thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 19 సంచిక - 360 కరీంనగర్ శుక్రవారం, 7 మార్చి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## మేకిన్ ఇండియా విఫలం..మోదీ గుర్తించాలి

పట్నా : జీడీపీలో తయారీ రంగం వాటా 2104లో 15.3 శాతంగా ఉంటే ఇప్పుడది 12.6శాతానికి పడిపోయిందని.. ఇది గత 60ఏళ్లలో అత్యంత కనిష్ఠం అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ పేర్కొన్నారు. లోక్ సభలో మోదీ తన ప్రసంగంలో ఎక్కడా 'మేకిన్ ఇండియా' గురించి మాట్లాడలేదని.. ఈ 'మేక్ ఇన్ ఇండియా' మంచి కార్యక్రమమే అయినా అది విఫలమైందనే విషయాన్ని ప్రధాని గుర్తించాలని అన్నారు. దళితనేత, స్వాతంత్ర్య సమరయోధుడు జగ్‌లాల్ చౌదరీ జయంతి సందర్భంగా పట్నాలో జరిగిన కార్యక్రమంలో రాహుల్ ప్రసంగించారు. ప్రధాని మోదీ మాట్లాడితే.. ఎన్నికల్లో అణగారిన వర్గాలకు టికెట్లు ఇవ్వడం ద్వారా వారికి ప్రాతినిధ్యం కల్పించామని గొప్పగా చెబుతుంటారని.. అయితే ఆ వర్గం ఎమ్మెల్యేలు, ఎంపీల నుంచి అన్ని అధికారాలనూ ఆయన లాగేసుకున్నారని ఆరోపించారు. కేంద్రమంత్రులు కూడా పేరుకే ఉన్నారని.. ఆర్ఎస్ఎస్ సిఫారసు చేసిన ఓఎస్డీలే శాఖలపై పెత్తనం చెలాయిస్తున్నారని మండిపడ్డారు.

# పదవుల పంపకాలకు వేళాయె!

## 10లోపు నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తామన్న సీఎం
## రంగంలోకి దిగిన ఏఐసీసీ కార్యదర్శులు




### గాంధీభవన్‌లో 48 మంది సీనియర్లతో భేటీ - వన్ టు వన్ ప్రశ్నిస్తున్న నేతలు

### -ఎమ్మెల్సీ పోస్టులకూ భారీ డిమాండ్
### - మండలిలో చోటు కోసం ఢిల్లీకి విజయశాంతి?
### ఢిల్లీ వెళ్లిన సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి
### - హాట్ టాపిక్ గా మారిన నేతల హస్తిన టూర్

హైదరాబాద్: రాష్ట్రంలో నామినేటెడ్ పోస్టుల భర్తీకి ముమ్మరంగా కసరత్తు జరుగుతోంది. ఈ నెల 10వ తేదీ లోపు ఆశావహులు తమ పేర్లు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల గాంధీభవన్ లో జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో తెలిపారు. ఈ నేపథ్యంలో పదేండ్లుగా పార్టీలో కొనసాగుతున్న సీనియర్ నాయకులతో ఏఐసీసీ కార్యదర్శులు విష్ణునాథ్, విశ్వనాథ్ భేటీ అయ్యారు. రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గా లనుంచి 48 మంది సీనియర్ నేతలను ఇవాళ గాంధీభవన్ పిలిచారు. విష్ణునాథ్ 24 మందితో , విశ్వనాథ్ 24 మందితో వన్ టు వన్ మీటింగ్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వారి నుంచి నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై ఆరా తీస్తూనే పార్టీ గత, ప్రస్తుత పరిస్థితి గురించి తెలుసుకుంటున్నారు. 'పార్టీలో ఎంత కాలం నుంచి కాలం నుంచి కొనసాగుతున్నారు? .. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో మీరు ఏ నియోజకవర్గానికి ఇంచార్జీ గా ఉన్నారు? అక్కడ పార్టీ గెలిచిందా? ఓడిందా? .. పార్టీలో ఇప్పుడు మీరు ఏ పదవి ఆశిస్తున్నారు?' అనే ప్రశ్నలను సంధిస్తున్నారు. వన్ టు వన్ మీటింగ్ లో ఇప్పటి వరకు వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బుజ్జు,అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, పలు వురు పీసీసీ ఆఫీసు బేరర్లతో ఏఐసీసీ కార్యదర్శులు మాట్లాడినట్టు సమాచారం.

**ఎమ్మెల్సీ పోస్టుల కోసం ప్రయత్నాలు...** రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఐదు ఎమ్మెల్సీ పోస్టులకు ఇటీవలే నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల10లోపు నామినేషన్లు వేయాల్సి ఉన్నందున ఆశావహులు తమ వంతు ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

ఇందులో భాగంగా సినీ నటి, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు విజయశాంతి ఢిల్లీ వెళ్లినట్టు తెలుస్తోంది. ఏఐసీసీ పెద్దల సహకారంతో ఎమ్మెల్సీగా టికెట్ పొందాలని ఆమె భావిస్తున్నారంటూ ప్రచారం జరుగుతోంది. మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కూడా హుటాహుటిన ఢిల్లీకి బయల్దేరడం చర్చనీయాంశంగా మారింది. అయితే తాను ఎమ్మెల్సీ పదవి కోసం ఢిల్లీ వెళ్లడం లేదని, రాహుల్ గాంధీని కలిసేందుకే వెళ్తున్నానని జగ్గారెడ్డి చెబుతున్నారు. టికెట్లు ఎవరికి కేటాయించాలనే అంశంపై కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ నిన్న సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అయిన విషయం తెలిసిందే. ఎవరికి అవకాశం కల్పిస్తారనేది ఎల్లుండి కల్లా క్లారిటీ వచ్చే అవకాశం ఉందని సమాచారం.

# నేడు ఢిల్లీకి సిఎం రేవంత్



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం మరోసారి ఢిల్లీ వెళ్లనున్నారు. ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు సిఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళుతున్నారు. సిఎం రేవంత్ రెండు రోజులు పాటు అక్కడే ఉండే అవకాశం ఉందని పిసిసి వర్గాలు చెబుతున్నాయి. అయితే ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై ఈ నెల 7, 8 తేదీల్లో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులు ఎంపిక తుది రూపానికి వచ్చే అవకాశం ఉందని పిసిసి వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ నెల 7,8 తేదీల్లో ముఖ్యమంత్రి ఢిల్లీలోనే ఉంటుండడంతో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా ఢిల్లీకి వెళ్లే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కోర్ కమిటీ మొత్తం ఢిల్లీలో అందుబాటులో ఉండడం వల్ల ఏఐసి సితో చర్చించి అభ్యర్థులు ఎంపికపై తుది నిర్ణయానికి వచ్చే అవకాశం ఉందని పిసిసి వర్గాలు పేర్కొంటున్నాయి.

**ఏఐసిసి క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతే జాబితా...** ప్రధానంగా ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు కొనసాగుతున్న నేపథ్యంలోనే ఏఐసిసి తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఎమ్మెల్సీ అభ్యర్థులకు సంబంధించి ఇప్పటికే రేవంత్ రెడ్డి వద్ద కోర్ కమిటీ సమావేశమయ్యింది. అభ్యర్థుల ఎంపిక కోసం అనుసరించాల్సిన విధి, విధానాలపై దాదాపు గంట పాటు చర్చ కొనసాగింది. విధి, విధానాలకు లోబడి ఉన్న ఆశావహుల జాబితాను సిద్ధం చేయనున్నారు. అర్హులను సామాజిక వర్గాల వారీగా సమతుల్యత పాటించే విధంగా జాబితాను సిద్ధం చేసి ఏఐసిసికి నివేదించనున్నారు. ముఖ్యమంత్రితో కూడిన కోర్ కమిటీ నివేదించిన జాబితాను ఏఐసిసి క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత అభ్యర్థుల ఎంపికపై తుది నిర్ణయం తీసుకుంటుంది.





తెలంగాణ మంత్రివర్గం ఎస్సీ కులాల వర్గీకరణ ముసాయిదా బిల్లుకు ఆమోదముద్ర వేసింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కీలక సూచనలు చేశారు. న్యాయపరమైన చిక్కులు లేకుండా తుది మెరుగులు దిద్దాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. క్యాబినెట్‌లో అసెంబ్లీ సమావేశాలపై చర్చ జరిగింది. త్వరలో అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. అసెంబ్లీ సమావేశ తేదీల ఖరారు అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి మంత్రుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. మార్చి 10 తర్వాత అసెంబ్లీ సమావేశాలు నిర్వహించనున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ .. బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టనున్నారు. మేడ్చల్ జిల్లాలోని మూడుచింతలపల్లి, ఎల్లంపేట్, అలియాబాద్ మండలాలను మున్సిపాలిటీలలో విలీన చేయాలని నిర్ణయించారు.

దీంతో పట్టణ జిల్లాగా మేడ్చల్ మారుతుంది. సెర్ప్, మెప్మా విలీనంకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ములుగుతో పాటు మరికొన్ని గ్రామపంచాయతీలు మున్సిపాలిటీలుగా మారిన నేపథ్యంలో.. గ్రామ పంచాయతీల జాబితా నుంచి ఆ గ్రామాలను తొలగిస్తూ క్యాబినెట్ తీర్మానం చేసింది. ఇక మెట్రో రైల్ ఫేజ్-2, రీజనల్ రింగ్ రోడ్డు, మూసీ ప్రక్షాళనతో పాటు ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ, యాదాద్రి టెంపుల్ బోర్డు, హెచ్ఎండీఏ యాక్ట్ లో మార్పులకు సంబధించి మరికొన్ని నిర్ణయాలు ఉండనున్నాయి. బీసీ రిజర్వేషన్లపై క్యాబినేట్ లో ప్రధానంగా చర్చ జరిగింది. ఇందుకు సంబంధించి కీలక నిర్ణయాలు ప్రకటించే అవకాశం ఉంది. భూభారతి చట్టం అమలు, LRS, మైనింగ్ యాక్ట్ అంశాలు కేబినెట్ లో చర్చకు వచ్చినట్లు సమాచారం. నూతన టూరిజం పాలసీ, ఎకో టూరిజంపై నిర్ణయాలు తీసుకోన్నారు. కాగా, తెలంగాణలో 59 ఎస్సీ కులాలు ఉన్నాయి. ఆ జాబితాలోని కులాలకు ప్రభుత్వ విద్య, ఉద్యోగాల్లో కొంత శాతం వరకు రిజర్వేషన్ ఉంటుంది. తెలంగాణలో అది 15 శాతం ఉంది. అంటే వందలో 15 ఉద్యోగాలు ఈ కులాలకు చెందిన వారికే ఇస్తారు. అయితే, ఆ జాబితాలోని కులాల మధ్య కూడా అసమానతలు ఉన్నాయి. అందులో కొన్ని కులాలు ముందున్నాయి, మరి కొన్ని కులాలు వెనుకబడి ఉన్నాయని ఆయా కులాల వారు చెబుతూ వచ్చారు.

# ఆపరేషన్ తెలంగాణ!

## తెలంగాణలో బీజేపీ లెక్కలు.. యాక్షన్ ప్లాన్ సిద్ధం..!




హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. తాజా ఎమ్మెల్సీ ఎన్నిక ల్లో బీజేపీ రెండు స్థానాలు గెలుచుకుంది. కాంగ్రెస్ సిట్టింగ్ సీటు కోల్పోయింది. బీఆర్ఎస్ పోటీకి దూరంగా ఉంది. అనూహ్య ఫలితాలతో ఒక్క సారిగా బీజేపీలో జోష్ పెరిగింది. ప్రధాని గెలిచిన ఎమ్మెల్సీలను అభినందించారు. ఢిల్లీ కేంద్రంగా ఆపరేషన్ తెలంగాణ మొదలైంది. ఈ ఎన్నికల తో రాజకీయంగా డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. అలర్ట్ కావాల్సింది ఎవరు.. ఏం జరుగుతోంది..

**మారుతున్న లెక్కలు...** తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపుగా మారుతున్నాయి. సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీకి అనుకూలంగా ఫలితాలు ఉంటాయి. ఇక్కడ మాత్రం ఫలితాలు భిన్నంగా వచ్చాయి. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎన్నికలకు దూరంగా ఉంది. బీజేపీ అనూహ్యంగా రెండు స్థానాలు గెలుచుకుంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ సిట్టింగ్ సీటును బీజేపీ కైవసం చేసుకుంది. కాంగ్రెస్ ప్రతిష్ఠాత్మకంగా భావించిన కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో బీజేపీ విజయం సాధించింది. బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి రెండో ప్రాధాన్యఓట్లతో విజయం సాధించారు.

**కాంగ్రెస్ కు షాక్...** ఇదే జిల్లాలకు చెందిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాన్నీ గెలుచుకున్న బీజేపీ.. పట్టభద్రుల ఎమ్ మెల్సీని కూడా దక్కించుకోవడం ద్వారా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో మరోసారి పట్టు నిరూపించు కుంది. కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో సిటింగ్ ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేత జీవన్‌రెడ్డి ఉన్నారు. ఈసారి పోటీకి ఆయన సుముఖత తెలపకపోవడంతో కాంగ్రెస్ అధిష్ఠానం అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డిని బరిలోకి దింపింది. ఈ నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో 21 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు ఉన్నా, మిత్రపక్షంగా సీపీఐ మద్దతు ప్రకటించినా కాంగ్రెస్ తన సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకో లేకపోయింది.

**ఊపుమీదున్న బిజెపి...** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గ్రాండ్ విక్టరీ కొట్టింది. దేశ రాజధానిలో జరిగిన ఎన్నికల్లో ఆమ్‌ఆద్మీ పార్టీకి కాషాయ పార్టీ మట్టికరిపించింది. దాదాపు 27 ఏళ్ల తర్వాత దేశ రాజధాని కాషాయ జెండా ఎగరడంతో నేతల సంతోషానికి అవధులు లేకుండా పోయాయి.. గత రెండు పర్యాయాలు ఢిల్లీలో అధికారం కోసం కమలం పార్టీ ప్రయత్నించినా సాధ్యపడలేదు. కానీ ఈసారి మాత్రం బీజేపీ స్ట్రాటజీ సక్సెస్ అయ్యింది. ఢిల్లీలో ఎలాగైనా జెండా పాతాలనే కమలం పార్టీ నేతల కల సాకారమైంది. ఇప్పుడు కాషాయ పార్టీలో సరికొత్త చర్చ జరుగుతోందట. వాట్ నెక్స్ట్ అని కమల నాథులు లెక్కలు వేస్తున్నారట. అంతేకాదు కమలం పార్టీ పెద్దల కన్ను తెలంగాణపై పడిందని పార్టీ నేతలు చెబుతున్నారు. ఇందుకోసం తెలంగాణ బీజేపీ నేతలకు కేంద్ర పెద్దలు దిశానిర్ధేశం కూడా చేసినట్టు ప్రచారం జరుగుతోంది. తెలంగాణలో ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల జోరు సాగుతోంది. ఈ ఎన్నికల్లో సత్తా చాటాలని కమలనాథులు జోరు పెంచారు. తాజాగా హైదరాబాద్‌లో సమావేశమైన లీడర్లు.. ఈసారి మూడు సీట్లలో విజయం సాధించాలని నిర్ణయించినట్టు సమాచారం. ఇందుకోసం సరైనా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని నిర్ణయించారట. ఇప్పుడున్న పరిస్థితుల్లో మూడు ఎమ్మెల్సీ సీట్లను గెలుచుకోగలితే.. వచ్చే ఎన్నికల్లో అధికారానికి మరింత దగ్గర కావొచ్చని భావిస్తున్నారట. ప్రస్తుతం దేశమంతా తమ పార్టీని విస్తరించిన కమలం పార్టీ.. కేవలం దక్షిణాదిలో అధికారంలో లేదు.. తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడులో అధికారంలోని రావాలని లెక్కలు వేసుకుంటోంది. ఇందుకోసం మొదట తెలంగాణనే ఎంచుకున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఢిల్లీలో అధికారం నిలబెట్టుకున్న కమలం పార్టీ.. రానున్న రోజుల్లో తెలంగాణతోపాటు.. ఇతర రాష్ట్రాల్లోనూ జెండా పాతేస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. దీనికి సంబంధించి ఆయన చేసిన ట్వీట్ సంచలనంగా మారింది. తెలంగాణలో ఎన్నికలకు మరో నాలుగేళ్లు సమయం ఉంది. ఆ లోపు పార్టీని మరింత విస్తరించే అవకాశం ఉంది. ఇప్పటికే రాష్ట్రంలో కమలం పార్టీకి 8 మంది ఎంపీలు ఉన్నారు. మరో 8 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధిస్తే.. అటు మండలిలోనూ బీజేపీకి బలం పెరుగుతుంది. కాబట్టి ఈసారి ఎలాగైనా మండలిని దక్కించుకోవాలని పార్టీ నేతలు అంచనాలు వేస్తున్నారట. ప్రస్తుతం ఢిల్లీలో గెలిచిన ఊపులో ఈ ఎన్నికల్లో సత్తా చాటాలని కమలనాథులు ఉవ్విళ్లూరుతున్నారట. ప్రస్తుతం తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ తన ప్రభావాన్ని కోల్పోతుందని.. ఆ స్థానాన్ని తాము భర్తీ చేస్తే.. అధికారానికి దగ్గరవుతామని పార్టీలో అంతర్గతంగా చర్చ జరుగుతోందని సమాచారం. రాష్ట్రంలో ఏడాదిలోపే సీఎం రేవంత్ రెడ్డి ప్రజల్లో విశ్వాసం కోల్పోయారని.. ఈ అవకాశాన్ని చక్కగా వినియోగించుకుని.. తెలంగాణలో జెండా పాతాలని బీజేపీ నేతలు లెక్కలు వేసుకుంటున్నట్టు తెలుస్తోంది. మొత్తంగా ఢిల్లీలో అనుసరించిన వ్యూహాలను తెలంగాణలోనూ అమలు చేస్తే అధికారం మరింత సులువు అవుతుందని కాషాయ పెద్దలు లెక్కలు వేసుకుంటున్నట్టు తెలిసింది. ఎన్నికలకు ఎక్కువ సమయం ఉండటంతో పదువైన వ్యూహాలతో ముందుకు పోవాలని రాష్ట్ర నేతలకు కేంద్ర పెద్దలు సూచించనట్టు సమాచారం. చూడాలి మరి కమలం పార్టీ పెద్దల ఆదేశాలను పాటిస్తూ.. రాష్ట్ర బీజేపీ నేతలు ఎలా ముందుకు సాగుతారో..!

# అందుకే ఓడిపోయాం.. ఎమ్మెల్సీ ఎన్నికలపై శ్రీధర్ రెడ్డి రియాక్షన్



కరీంనగర్–మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు ఇచ్చిన తీర్పును స్వీకరిస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఈ రోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లోనే బీజేపీతో బీఆర్ఎస్ మమేకం అయ్యిందన్నారు. ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా అలానే వ్యవహరించదని ఆరోపించారు. బీఆర్ఎస్ తరఫున ఈ ఎన్నికల్లో అభ్యర్థులను పెట్టలేదన్నారు. రవీందర్ సింగ్ కు వ్యక్తిగతంగా ఓట్లు వచ్చాయన్నారు.

**బీఆర్ఎస్, బీజేపీది ఫెవికల్ బంధం...** పరోక్షంగా రవీందర్ సింగ్ ను బీఆర్ఎస్ బలపరిస్తే పరిస్థితి ఇంకోలా ఉండేదన్నారు. బీఆర్ఎస్, బీజేపీది ఫెవికల్ బంధమన్నారు. కాంగ్రెస్ పార్టీని ఓడగొట్టాలనే బీఆర్ఎస్ పార్టీ, బీజేపీ ఒకటయ్యాయని ధ్వజమెత్తారు. ఈ ఎన్నికల్లో అభ్యర్థిని ఎందుకు నిలబెట్టలేదో సూటిగా చెప్పాలని బీఆర్ఎస్ పార్టీని శ్రీధర్ బాబు నిలదీశారు. బీఆర్ఎస్ పరోక్షంగా బీజేపీకి సపోర్ట్ చేసింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ కీలక నేత అద్దంకి దయాకర్ సైతం ఈ అంశంపై రియాక్ట్ అయ్యారు. బీఆర్ఎస్ ను బీజేపీ ఎలా లొంగదీసుకుందో ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్పష్టం అయిందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు ఒక్కటేనన్నారు. ఆ రెండు పార్టీలను వేరువేరుగా చూడడం లేదన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం తర్వాత బీజేపీ నేతల మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. బీజేపీ ఓట్ల కోసం.. ఎన్నికల కోసం పోరాడుతోందన్నారు. ఆ పార్టీ ప్రజల కోసం ఎప్పుడూ పోరాటం చేయదన్నారు. ఉప ఎన్నికలు వస్తే సత్తా చటుతాం అనే బీఆర్ఎస్.. మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో ఒక్క చోట కూడా ఎందుకు పోటీ చేయలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పై పోరాటం చేసి.. బీజేపీకి ఓట్లు వేయించిందన్నారు. కరీంనగర్–మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి విజయం సాధించడం తెలంగాణ పాలిటిక్స్ లో సంచలనంగా మారింది. రాష్ట్రంలో తమకు తిరుగు లేదని బీజేపీ నేతలు చెబుతుండగా.. బీఆర్ఎస్ సపోర్ట్ తోనే బీజేపీ గెలిచిందని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ప్రచారం చేసినా ఓటర్ల మద్దతు లభించలేదని ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయి.



# ఎస్ఎల్బీసీ టన్నెల్లో చిక్కుకున్న 8 మంది జాడ కోసం కేరళ జాగిలాలు

అమ్రాబాద్: నాగర్ కర్నూలు జిల్లా అమ్రాబాద్ మండలం దోమలపెంట సమీపంలోని ఎస్ఎల్బీసీ సొరంగ మార్గంలో చిక్కుకుపోయిన 8 మంది జాడను గుర్తించేందుకు సహాయక చర్యలు వేగవంతమయ్యాయి. ఇందుకోసం కేరళ నుంచి ఆర్మీ హెలికాప్టర్లలో రెండు క్యాడవర్ జాగిలాలను తీసుకువచ్చారు. కేరళ ప్రత్యేక పోలీసు బృందం, జిల్లా కలెక్టర్ సంతోష్.. విపత్తు నిర్వహణ అధికారులతో సమావేశమయ్యారు. 8మంది చిక్కుకున్న ప్రాంతాలపై ప్రాథమిక అంచనాలు వేస్తున్నారు. ఎస్ఎల్బీసీ సొరంగంలో సమస్యాత్మకంగా మారిన బురద, మట్టిని తొలగించేందుకు అధికారులు తొలిసారి వాటర్ జెట్లను వినియోగిస్తున్నారు. సొరంగంలో చిక్కుకుపోయిన వారిని కనుగొనేందుకు అధికారులు 13 రోజులుగా చేస్తున్న కృషి ఫలించడం లేదు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సింగరేణి, ర్యాట్ హెూల్ మైన్స్, హైడ్రా తదితర ఏజెన్సీల నిపుణులు బురద తొలగింపు పనుల్లో నిమగ్నమయ్యారు. ఫలితం తేలకపోవడంతో తొలిసారిగా వాటర్ జెట్లను వినియోగిస్తున్నారు. టన్నెల్ బోరింగ్ మిషిన్(టీబీఎం)పైన, చుట్టుపక్కల పేరుకుపోయిన బురదపై వీటితో నీటిని పంప్ చేస్తున్నారు. మరోవైపు సొరంగంలో ప్రమాదకరంగా ఉన్న షీర్‌జోన్ ప్రాంతంలో రోబోల సేవలను వినియోగించే అవకాశాన్ని పరిశీలించేందుకు హైదరాబాద్‌కు చెందిన ఎన్‌వీ రోబోటిక్స్ ప్రతినిధుల బృందం టన్నెల్‌ను సందర్శించింది. సీఎం రేవంత్‌రెడ్డి టన్నెల్‌ను సందర్శించిన సమయంలో అవసరమైతే రోబోలను వినియోగిస్తామని ప్రకటించారు. ఈ మేరకు రోబోటిక్స్ సంస్థ ప్రతినిధులు సాధ్యాసాధ్యాలను పరిశీలించారు.




# బీజేపీలో కొత్త ఉత్తేజం.. ఆ ఎన్నికల్లోనూ పాగా వేసేందుకు ప్లాన్

హైదరాబాద్ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపుతో బీజేపీలో కొత్త ఉత్తేజం నెలకొంది. రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు విజయ ఢంకా మోగించడంతో కమలం పార్టీలో నయా జోష్ వచ్చి చేరింది. ఈ జోష్‌తోనే రాబోయే ఎన్నికల్లోనూ విజయం సాధించాలనే పట్టుదలతో ఉంది బీజేపీ. ఇందు కోసం ఇప్పటి నుంచే ప్రణాళికలను కూడా రూపొందిస్తోంది. ఇక తెలంగాణలో కాంగ్రెస్‌ను ప్రత్యామ్నాయం తామే అని బీజేపీ నేతలు చెబుతున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఛరిష్మా తెలంగాణలో వర్క్అవుట్ అయిందని కమలనాథులు అంటున్న మాట. ఇక అదే ఫార్ములాతో వచ్చే స్థానిక సంస్థలు, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ప్లాన్ వేయాలని చేస్తోంది బీజేపీ. త్వరలోనే ఎమ్మెల్యే ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులతో ప్రధాని మోదీతో సమావేశం ఏర్పాటు చేసేందుకు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు సమన్వయం చేస్తున్నారు. కాగా.. ఈరోజు బీజేపీ కార్యాలయంలో రెండు ఎమ్మెల్సీ (టీచర్ ఎమ్మెల్సీ , గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ) లపై గ్రాండ్ గా సంబురాలు చేసుకున్నారు. కాగా.. కరీంనగర్–నిజామాబాద్–ఆదిలాబాద్–మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంతో పాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాన్ని కూడా బీజేపీ కైవసం చేసుకోవడంతో ఆ పార్టీ నేతల్లో సంబరాలు అంబరాన్నంటాయి. కరీంనగర్–నిజామాబాద్–ఆదిలాబాద్–మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో బీజేపీ అభ్యర్థి గెలుపొందారు. ఆ పార్టీ బలపరిచిన మల్క కొమరయ్య తొలి ప్రాధాన్యత ఓట్లతో టీచర్స్ ఎమ్మెల్సీగా విజయం సాధించారు. మరోవైపు ఉమ్మడి కరీంనగర్ – అదిలాబాద్ – నిజామాబాద్ – మెదక్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీకి చెందిన నరేంద్ర్ రెడ్డిపై 5,106 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ఈ స్థానానికి మొత్తం 2,52,029 ఓట్లు పోల్ కాగా, 28,686 ఓట్లు చెల్లకుండా పోయాయి. చెల్లుబాటైన 2,23,343 ఓట్లలో గెలుపు కోసం 1,11,672 ఓట్లను కోటా ఓట్లుగా నిర్ధారించారు. మొదటి ప్రాధాన్యత ఓట్లు లెక్కింపు పూర్తయ్యాక బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి 75,675 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి 70,565 ఓట్లు, బీఎస్పీ అభ్యర్థికి 60,419 ఓట్లు వచ్చాయి. ఏ అభ్యర్థికీ గెలుపు టార్గెట్ కోటా అయిన 1,11,672 ఓట్లు రాలేదు. మిగిలిన 53 మంది కలిపి 16,684 ఓట్లు పోలయ్యాయి.

దీంతో మొదటి ప్రాధాన్య ఓట్లలో ఎవరికీ కోటా ఓటు రాకపోవడంతో రెండో ప్రాధాన్య ఓట్లను లెక్కించారు. రెండో ప్రాధాన్యత ద్వారా బీజేపీ అభ్యర్థికి 98,637 ఓట్లు రాగా.. కాంగ్రెస్ అభ్యర్థికి 93,531 ఓట్లు పోలయ్యాయి. ఈ క్రమంలో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి 5,106 ఓట్ల తేడాతో విజయం సాధించారు.

**మోదీ అభినందలు...** తెలంగాణలో కొత్తగా ఎన్నికైన బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు మల్క కొమరయ్య, అంజిరెడ్డిలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అభినందనలు తెలియజేశారు. ఎక్స్ వేదికగా మోదీ స్పందిస్తూ.. "బీజేపీ అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు ధన్యవాదలు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్సీ అభ్యర్థులకు అభినందనలు. ప్రజల మధ్య ఉంటూ వారి కోసం ఎంతో శ్రద్ధతో పనిచేస్తున్న బీజేపీ కార్యకర్తలను చూసి నేను చాలా గర్వపడుతున్నాను" అంటూ ప్రధాని మోదీ ట్వీట్ చేశారు.

# నిర్మల్ జిల్లాలో మహిళా పోలీసులతో పెట్రోలింగ్!



**మహిళల రక్షణకు నిర్మల్ జిల్లా పోలీసులు మరో ముందడుగు వేశారు. తెలంగాణలో ఎక్కడా లేనివిధంగా మొట్టమొదటగా నిర్మల్ జిల్లాలో మహిళా పోలీసులతో పెట్రోలింగ్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు 'పోలీస్ అక్క' అనే నూతన కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు నిర్మల్ పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ చెప్పారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లకు ఈ విధులు కేటాయించి మహిళల రక్షణకై ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. డయల్ 100కు మహిళల నుంచి కాల్ వస్తే ఈ మహిళా పోలీసులు సమస్య ఉన్న చోటుకు చేరుకుంటారని వివరించారు.**

# ఆ రెండు పార్టీలు కలిసి కాంగ్రెస్‌ను ఓడించాయి: మంత్రి పొన్నం




హైదరాబాద్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాజపా, భారాస రెండూ కలిసే కాంగ్రెస్‌ను ఓడించాయని మంత్రి పొన్న ప్రభాకర్ ఆరోపించారు. ఎమ్మెల్సీ ఫలితాలపై ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. "అభ్యర్థిని పెట్టకుండా భాజపాతో కలిసి భారాస కుమ్మకయ్యింది. కేటీఆర్, హరీశ్‌రావు నియోజకవర్గాల్లో ఎన్నికలు జరిగాయి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వారిద్దరు ఎవరికి ఓటేశారో చెప్పాలి. తక్కువ ఓట్లతోనే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోయాం. ఈ ఓటమిపై సమీక్షించుకుంటాం" అని అన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లడుతూ.. కాంగ్రెస్‌ను ఓడించ డానికి భాజపా, భారాస కలిసి పనిచేశాయన్నారు. పట్టభద్రులకు నైపుణ్యాన్ని పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేస్తున్నారని తెలిపారు.

# జానారెడ్డితో సీఎం రేవంత్ భేటీ.. కారణం అదేనంటూ చర్చ..



సీఎం రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జానారెడ్డి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా సుమారు అరగంటకు పైగా వీరి మధ్య పలు అంశాలపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. అయితే జానారెడ్డితో సీఎం రేవంత్ భేటీపై ప్రభుత్వ వర్గాలలో ఆసక్తికర చర్చ నడుస్తోంది. జానారెడ్డిని ప్రభుత్వ ముఖ్య సలహాదారుగా జానారెడ్డిని నియమిస్తారని ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వం అడిగితే సలహాలు ఇస్తానని జానారెడ్డి బుధవారం మీడియాతో తెలిపారు. దీంతో వీరి భేటీపై అంతా ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. జానారెడ్డి వ్యాఖ్యల వల్లే.. ముఖ్య సలహాదారు పదవి ఆఫర్ చేయడానికి సీఎం వెళ్లారంటూ చర్చించుకుంటున్నారు. త్వరలో కేబినెట్ విస్తరణ ఉంటుందనే ఊహాగానాలతో ఈ భేటీ ప్రాధాన్యతతలను సంతరించుకుంది.

# సీఎం గాలి మాటలకు సమాధానం చెప్పాలా?: కిషన్‌రెడ్డి



హైదరాబాద్: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి గాలి మాటలకు సమాధానం చెప్పాలా అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. "సీఎం గాలి మాటలకు సమాధానం, సంజాయిషీ ఇవ్వాల్సిన అవసరం లేదు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో రేవంత్‌రెడ్డి నాపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడారు. ఆ ఆరోపణలకు ప్రజలే సరైన సమాధానం ఇచ్చారు. ప్రజా తీర్పు.. కాంగ్రెస్ పాలనకు చెంపపెట్టులాంటిది. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చాలి. రైతులకు ఎకరాకు రూ.15 వేలు, యువతకు నిరుద్యోగ భృతి, ఆడబిడ్డలకు నెలకు రూ.2,500, దళితులకు రూ.12 లక్షలు, ఆడపిల్లలకు స్కూటీలు ఇస్తామని ఆ పార్టీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతున్నాం. జీవో 317 కారణంగా ఇబ్బందులు పడుతున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి" అని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# కరీంనగర్‌లో ప్రేమజంట ఆత్మహత్య

చొప్పదండి: కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలానికి చెందిన ఇద్దరు ప్రేమికులు ఆత్మహత్య చేసుకున్న ఘటన రెండు గ్రామాల్లో విషాదం నింపింది. వివరాల్లోకి వెళితే చొప్పదండి మండలం చిత్యలపల్లికి చెందిన కొండపర్తి అరుణ్ కుమార్ (24) కరీంనగర్‌లో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. అదే మండలం భూపాలపట్నానికి చెందిన నాంపల్లి అలేఖ్య(21)తో స్నేహం ఏర్పడి అది ప్రేమగా మారింది. రెండేళ్లుగా వీరు ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో అలేఖ్యకు వేరే వ్యక్తితో వివాహం కోసం సంబంధాలు చూస్తున్నారు. తమ వివాహం జరగదని భావించిన ఇరువురూ కరీంనగర్‌లో మిత్రుని ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.



# నకిలీ కాల్ సెంటర్ ఏర్పాటు చేసి మోసాలు.. 60 మంది అరెస్టు

హైదరాబాద్: నకిలీ కాల్ సెంటర్ ఏర్పాటు చేసి విదేశీయులను మోసగిస్తున్న ముఠాను సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు అరెస్టు చేశారు. గుజరాత్‌కు చెందిన మనస్విని సహా 60 మందిని అరెస్టు చేశారు. కేసు వివరాలను పోలీసు అధికారులు వెల్లడించారు. వారి కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో 'ఎక్సిటో సొల్యూషన్స్' పేరిట మనస్విని కాల్ సెంటర్ ఏర్పాటు చేసింది. కైవాన్ పటేల్, ప్రతీక్, రాహుల్ అనే వ్యక్తులతో కలిసి దీన్ని నిర్వహిస్తోంది. పలువురు ఈశాన్య రాష్ట్రాల వ్యక్తులను ఆమె టెలీకాలర్లుగా నియమించుకుంది. అమెరికన్లే ప్రధాన లక్ష్యంగా నిందితులు మోసాలకు పాల్పడుతున్నారు.


వీరి నుంచి పోలీసులు 63 ల్యాప్‌టాప్‌లు, 52 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. హ్యాక్ అయిన బ్యాంకు ఖాతాలు సరిచేస్తామంటూ వీరు మోసాలకు పాల్పడుతున్నారు. బ్యాంకు ఖాతా, డెబిట్, క్రెడిట్ కార్డుల వివరాలు సేకరించి నగదు కాజేస్తున్నారు.



# పుస్తకాలే అయన ప్రాణం..పుస్తకాలయాలే ఆయన లోకం...

## - దేశంలోనే తొలి గ్రంథాలయ సంఘ స్థాపకులు అయ్యంకి

### మార్చి 7... గ్రంథాలయ పితామహ అయ్యంకి వెంకట రమణయ్య వర్ధంతి



పుట్టడం, గిట్టడం సహజం. జీవించినంతలో సమాజానికి ఉపయోగపడే పనులు చేయడం మానవ ధర్మం. కొంతమంది మాత్రమే తమ జీవితంలో ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేసి తమ జీవితాన్నే ఫణంగా పెట్టి మానవ జాతిలో చిరస్థాయిగా తరతరాలుగా నిలిచిపోతారు . అలాంటి వాటిలో...అయ్యంకి వెంకట రమణయ్య ముఖ్యులు. గ్రంథాలయోద్యమం అనగానే గుర్తుకు వచ్చే పేరు ఆయనదే. "పుస్తకాలే ప్రాణంగా...పుస్తకాలయాలే లోకం"గా జీవించిన వ్యక్తి. గ్రంథాలయోద్యమ పితా మహుడుగా, జీవితాంతం గ్రంథాలయాల అభివృద్ధి కోసం, అద్వితీయంగా, అనన్యంగా, అహర్నిశలూ, బహుముఖ సేవలందించిన గొప్ప వ్యక్తి అయ్యంకి. అయ్యంకి వెంకట రమణయ్య (1890–1979) గ్రంథాలయోద్యమ కారుడు, ఆయుర్వేదం, ప్రకృతి వైద్యంలో సిద్ధహస్తులు, పత్రికా సంపాదకులు. గ్రంథాలయ సర్వస్వము అనే పత్రికను నిర్వహించారు. అయన గ్రంథాలయ ఉద్యమంలో జీవితాంతం విశేష కృషి సల్పి గ్రంథాలయ పితా మహుడుగా పేరు గాంచారు. ఆయన తూర్పు గోదావరి జిల్లా రామచంద్రపురం తాలూకా అనపర్తి నియోజక వర్గంలోని బిక్కవోలు మండంలో గల కొంకుదురు గ్రామంలో 1890 జూలై 24న జన్మించారు. అయన తల్లిదండ్రులు వెంకటరత్నం, మంగమాంబ. తండ్రి వెంకతరత్నం గారు నీటిపారుదల శాఖలో ఉద్యోగి. 1907లోప్రముఖ జాతీయ నాయకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు బిపిన్ చంద్రపాల్ రాజమండ్రి లో భారత స్వాతంత్ర్య సమరంలో యువకులు పాల్గొనాలని ఇచ్చిన ఉత్తేజ పూరితమైన ఉపన్యాసాలు విని, చదువుకు స్వస్తి చెప్పి దేశ సేవకు జీవితాన్ని అంకితం చెయ్యటానికి 'రక్షాబంధనం ' కట్టుకొన్నారు. దేశంలోని పలు సమస్యలకు ముఖ్యకారణం అవిద్య, అజ్ఞానం అని గ్రహించి, అందరినీ విద్యా వంతులుగా, జ్ఞాన వంతులుగా చెయ్యాలని అందుకు గ్రంథాలయాల వ్యాప్తి అవసరమని భావించి ఆ ఉద్యమ వ్యాప్తికి కంకణం కట్టుకొన్నారు. 1910 లో బందరులో "ఆంధ్ర సాహిత్య పత్రిక"ను స్థాపించి, గురజాడ, రాయప్రోలు, శ్రీశ్రీ రచనలను ప్రచురించి, ప్రజలను చైతన్య వంతం చేశారు. 1914లో ప్రథమ ఆంధ్ర రాష్ట్ర గ్రంథ భాండాగార ప్రతినిధుల మహాసభలను విజయ వాడలో నిర్వహించారు. 1919, నవంబరు–14న, చెన్నైలో తొలి "అఖిల భారత పౌర గ్రంథాలయం" ను స్థాపించి, మొదటి మహా సభను నిర్వహించారు. అలాగే 'గ్రంథాలయ సర్వస్వం' (త్రైమాసిక), 'ఇండియన్ లైబ్రరీ జర్నల్', 'కొరడా', 'ప్రకృతి', 'ది ఇండియన్ నేచురోపతి',' 'సహకారం', 'దివ్యజ్ఞాన దీపిక' వంటి పత్రికలను కూడా నడిపారు. 1911లో విజయవాడలో రామమోహన గ్రంథాలయ స్థాపనకు తోడ్పడ్డాడు. 1914లో విజయ వాడలో ఆంధ్రదేశ గ్రంథ భాండాగార, ప్రతినిధుల గ్రంథాలయ మహా సభలు జరిపి భారత దేశంలో తొలిసారిగా గ్రంథాలయ సంఘాన్ని, 1915లో సంఘ పక్షాన గ్రంథాలయ సర్వస్వం పత్రికను స్థాపించడానికి తోడ్పడ్డారు. 1919లో అఖిల భారత పౌర గ్రంథాలయ సంఘాన్ని స్థాపించి, 1924లో ఆ సంఘ పక్షాన ఇండియన్ లైబ్రరీ జర్నల్ అనే ఆంగ్ల పత్రికను ప్రారంభించారు. 1934–1948 మధ్యకాలంలో గ్రంథాలయ యాత్రలను అపూర్వమైన స్థాయిలో పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలలో కార్యదర్శులు నిర్వహించారు. వీరి మూలంగా వందల సంఖ్యలో కొత్త గ్రంథాలయాలు ఏర్పడ్డాయి. మూసి వేసినవి పునరుద్ధరించ బడ్డాయి. 1920, 1934లలో గ్రంథాలయ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆంధ్రదేశంలోని ప్రతి గ్రామం పర్యటించారు. అయ్యంకి వెంకట రమణయ్య, దేశంలో పూర్తిస్థాయిలో గ్రంథాలయాలను నెలకొల్పిన వ్యక్తిగా పేరు గడించారు. ఆంధ్రభాషాభివర్ధినీ మండలి, ఆంధ్రపరిషత్తు, కళాపీఠము, దివ్యజ్ఞాన చంద్రికామండలి అనే గ్రంథమాలలను స్థాపించి అనేక ఉత్తమ రచనలను తెలుగు పాఠకులకు అందించారు. గ్రంథాలయోద్యమంలో ఆయన సేవలను గుర్తించి, ఆయన సప్తతి మహోత్సవ సందర్భంగా, గుడివాడలో 'సరస్వతీ సామ్రాజ్య ప్రతిష్ఠాపనాచార్య' బిరుదుతో సత్కరించారు. 1919లో అఖిల భారత పౌర గ్రంథాలయ సంఘాన్ని స్థాపించిన రోజును భారత గ్రంథాలయ సంస్థ గుర్తించి నేషనల్ లైబ్రరీ డే (జాతీయ గ్రంథాలయ వారోత్సవ దినం)"గా దేశమంతటా 1968 నుంచి ప్రతి సంవత్సరం జాతీయ గ్రంథాలయ1968 నుండి, "జరుపుకొను చున్నారు. ఆయన అనేక గ్రంథాలయ యాత్రలను నిర్వహించి, "ప్రజా గ్రంథాలయమే ప్రజల విశ్వవిద్యాలయం" అని చాటి చెప్పారు. భారత ప్రభుత్వం ఆయన గ్రంథాలయ సేవలకు స్పందించి 1972 లో 'పద్మశ్రీ'తో .గౌరవించింది. గ్రంథాలయ పితామహ, గ్రంథాలయోద్ధారక, గ్రంథాలయ విశారద, సరస్వతీ సామ్రాజ్య ప్రతిష్ఠాపనాచార్య, సరస్వతీ రమారమణ, గ్రంథాలయ విశారద వంటి బిరుదులు అందుకున్నారు. 1977లో ప్రొఫెసర్ కౌలా అంతర్జాతీయ స్వర్ణపతకం పొందారు. ఆంధ్రవిశ్వ కళాపరిషత్తు గ్రంథాలయ శాస్త్ర పరీక్షలో ఉత్తమ విద్యార్థికి అయన పేరుతో స్వర్ణ పతకం ఇస్తున్నది. 1979లో అయ్యంకి లైబ్రరీ కమిటీ ఏర్పడి ప్రతి సంవత్సరం ఉత్తమ గ్రంథాలయ కార్యకర్తను సత్కరిస్తోంది. ఆయన తండ్రి వెంకట రత్నం అయ్యంకిలో శ్రీ గంగా పర్వత.వర్ధనీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం నిర్మించారు. వెంకట రమణయ్య 1979, మార్చి 7న మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# భారత వైద్య రంగంలో బసవపట్నం నారాయణ బాలకృష్ణారావు విశేష కృషి

### మార్చి 7....పద్మశ్రీ బసవపట్నం నారాయణ బాలకృష్ణారావు వర్ధంతి



బసవపట్నం నారాయణ బాలకృష్ణారావు (1910–1995) భారత దేశంలో శస్త్రచికిత్స (సర్జరీ) రంగంలో విశేష సేవలు అందించిన గొప్ప వైద్యుడు, విద్యావేత్త, పరిశోధకుడు, రచయిత. భారత వైద్య రంగాన్ని పురోగమింప చేయడంలో ఆయన విశేష కృషి చేశారు. ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లో శస్త్రచికిత్స విభాగానికి అధిపతిగా సేవలందించడంతో పాటు, అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా కూడా ఉన్నారు. భారత వైద్య రంగంలో ఆయన చేసిన కృషికి గాను భారత ప్రభుత్వం 1971లో పద్మశ్రీ పురస్కారాన్ని ప్రదానం చేసింది. బసవపట్నం నారాయణ బాలకృష్ణారావు 1910 జనవరి 21న కర్ణాటకలోని రామనగర జిల్లా చన్నపట్న పట్టణంలో జన్మించారు. ఆయన తండ్రి భికె నారాయణరావు, ఒక ప్రముఖ నేత్ర వైద్య నిపుణుడు. ఆయన మింటో కంటి ఆసుపత్రిని స్థాపించడంలో ప్రధాన పాత్ర పోషించారు. బాలకృష్ణారావు చిన్నతనం నుండే విద్యా అభిలాష కలిగినవారు. ఆయన మైసూరులో ప్రాథమిక విద్యను పూర్తి చేసి, ముంబై విశ్వవిద్యాలయం నుంచి వైద్యశాస్త్రంలో పట్టభద్రుడయ్యారు. అనంతరం ఇంగ్లాండ్ వెళ్లి MRCS (1936), FRCS (1937) పట్టాలు పొందారు. తద్వారా తన వైద్య నైపుణ్యాన్ని మెరుగు పరచుకున్నారు. బాలకృష్ణారావు తన వైద్య జీవితాన్ని 1940లో మైసూర్ మెడికల్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ప్రారంభించారు. 1945లో మైసూర్ మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్, శస్త్రచికిత్స విభాగ అధిపతిగా నియమితులయ్యారు. 1947లో గ్వాలియర్‌లోని గజర రాజా మెడికల్ కాలేజీలో చేరి, 1964 వరకు అక్కడ ప్రొఫెసర్, డీన్‌గా పనిచేశారు. 1964లో ఢిల్లీలోని AIIMS లో ప్రొఫెసర్ – శస్త్రచికిత్స విభాగ అధిపతిగా నియమితులయ్యారు. 1972లో AIIMS నుంచి పదవీ విరమణ. 1975లో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్‌లో సైంటిస్ట్ ఎమెరిటస్‌గా సేవలందించారు. 1976–78లో ఇండోర్‌లోని చోయిత్‌రామ్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో పనిచేశారు. ఆయన శస్త్రచికిత్స (సర్జరీ) రంగంలో ఎన్నో కీలక ప్రయోగాలు, పరిశోధనలు చేశారు. న్యూరోసైన్సెస్, కిడ్నీ సంబంధిత వ్యాధులపై పరిశోధనలు చేశారు. ప్రైమరీ లివర్ క్యాన్సర్ (Primary Carcinoma of Liver in Infancy) పై వ్యాసాలు వ్రాశారు. వివిధ శస్త్రచికిత్సలు, చికిత్సా విధానాలపై ఎన్నో పుస్తకాలు, వ్యాసాలు రాశారు. వైద్య విద్యలో నూతన మార్గదర్శకంగా నిలిచారు. విద్యార్థులకు తక్కువ వయసులోనే శస్త్రచికిత్స పాఠాలు బోధించారు. వైద్య విద్యార్థులకు శస్త్రచికిత్స నైపుణ్యాన్ని మెరుగుపరిచే అనేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా (ASI) కు అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. 1971లో భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. 1945లో ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఫెలోగా ఎన్నికయ్యారు. 1993లో ఇంటర్నేషనల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ సభ్యత్వం పొందారు. 1995లో భారత రాష్ట్రపతికి గౌరవ శస్త్రవైద్యునిగా సేవలందించారు. బాలకృష్ణారావు 1995 మార్చి 7న, 85 ఏళ్ల వయసులో మరణించారు. ఆయన చేసిన సేవలను గుర్తించి ASI 2000లో "డాక్టర్ బాలకృష్ణారావు ఒరేషన్" అనే వార్షిక అవార్డు ప్రసంగాన్ని ప్రారంభించింది. డాక్టర్ బసవపట్నం భారత శస్త్రచికిత్స రంగానికి ఎనలేని సేవలు అందించిన గొప్ప వైద్యుడు. శస్త్రచికిత్స, వైద్య విద్యా, పరిశోధనలలో కీలక పాత్ర పోషించారు. భారత వైద్య రంగాన్ని మెరుగుపరిచేందుకు తన జీవితాన్ని అంకితమిచ్చారు. వైద్య విద్యార్థులకు మార్గదర్శకంగా, స్ఫూర్తిదాయకంగా నిలిచారు. భారత ప్రభుత్వ గుర్తింపుగా పద్మశ్రీ పురస్కారాన్ని పొందారు. ఆయన జీవితం, సుదీర్ఘ వైద్య సేవలు, పరిశోధనలు భవిష్యత్తు వైద్యులకు స్ఫూర్తినిస్తూ ఉంటాయి. భారత వైద్య రంగంలో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచి పోతుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# మోడీ డీలిమిటేషన్ ని ఢీ కొట్టిన స్టాలిన్ !





కేంద్రంలోని నరేంద్ర మోడీ డీలిమిటేషన్ ని అమలు చేయాలని చూస్తోంది. దానికి 2011 జనాభా లెక్కలను తీసుకుని వాటిని 2025కి అనువదించి ఆ విధంగా పెరిగిన జనాభాకు అనుగుణంగా కొత్తగా ఎంపీ సీట్లను పెంచాలని చూస్తున్నారు అని ప్రచారం అయితే సాగుతోంది. ఇలా చేయడం వల్ల ఇబ్బందులే వస్తాయని మరీ ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని అంటున్నారు. ఈ విషయంలో డీఎంకే అధినేత, తమిళనాడు సీఎం స్టాలిన్ అయితే మొదటి నుంచి కేంద్రం చేపట్టబోయే డీలిమిటేషన్ ప్రక్రియను వ్యతిరేకిస్తున్నారు. కొత్త జనాభా లెక్కలను తీసుకుని ఈ ప్రక్రియను అమలు చేస్తే కనుక కచ్చితంగా దక్షిణాది రాష్ట్రాలు ఇబ్బందులు పడతాయని అంటున్నారు. ఉత్తరాదిన పెరిగిన జనాభాతో ఎంపీ సీట్లు ఎక్కువగా ఉంటాయని అదే సౌత్ ఇండియాలో ఐదు ముఖ్యమైన రాష్ట్రాలకు పెద్దగా పెరిగేదీ ఒరిగేదీ ఏదీ ఉండదని అంటున్నారు. ఈ నేపథ్యంలో స్టాలిన్ అధ్యక్షతన అఖిల పక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలకమైన నిర్ణయాలనే తీసుకున్నారు. దాని ప్రకారం చూస్తే కనుక 1971 జనాభా లెక్కలనే ఆధారంగా తీసుకుని డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టాలని కోరారు. అలాగే ప్రస్తుతం ఉన్న 543 ఎంపీ సీట్లనే మరో ముప్పయ్యేళ్ళ పాటు కొనసాగించాలని కూడా తీర్మానించారు. డీలిమిటేషన్ ప్రక్రియను జనాభా ఆధారంగా చేయరాదని కోరారు. అలా చేస్తే దక్షిణాది రాష్ట్రాలే తీవ్రంగా నష్టపోతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. యాభై ఏళ్ళ పాటు కుటుంబ నియంత్రణను పకడ్బందీగా అమలు చేసి దేశ వికాసానికి అభివృద్ధికి పాటుపడిన దక్షిణాది రాష్ట్రాలకు డీలిమిటేషన్ పేరుతో సీట్లు తగ్గించి శిక్ష విధిస్తారా అని స్టాలిన్ ప్రశ్నిస్తున్నారు. అదే విధంగా చూస్తే డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలు నష్టపోవని ప్రధాని నరేంద్ర మోడీ లిఖితపూర్వకంగా హామీ ఇవ్వాలని అఖిలపక్ష సమావేశం డిమాండ్ చేస్తోంది. ఇక డీలిమిటేషన్ కి వ్యతిరేకంగా రానున్న రోజుల్లో ప్రజా భాగస్వామ్యంతో ఆందోళనను చేపట్టడానికి కూడా అఖిలపక్షం నిర్ణయించింది. అలాగే దక్షిణాదికి చెందిన ఎంపీలతో జాయింట్ కమిటీని ఏర్పాటు చేసి కేంద్రం తీసుకుంటున్న డీలిమిటేషన్ ప్రక్రియకు వ్యతిరేకంగా పోరాడాలని తీర్మానించింది. ఈ విషయంలో దక్షిణాదిన ఉన్న అన్ని రాష్ట్రాలను కలుపుకుని పోతామని స్టాలిన్ అంటున్నారు. అయితే సౌత్ లో ఉన్న అయిదు రాష్ట్రాలలో నాలుగు ఇండియా కూటమిలో ఉన్నవే. ఒక్క ఏపీ మాత్రమే ఎన్డీయేలో ఉంది. మరి ఏపీని ఈ విషయంలో కలుపుకుని పోతారా లేదా అన్నది చూడాలి అదే సమయంలో డీలిమిటేషన్ కి వ్యతిరేకంగా సౌత్ నుంచి నాయకత్వం వహిస్తూ మోడీతో ఢీ కొట్టేందుక్ స్టాలిన్ రెడీ కావడం కొత్త రాజకీయ పరిణామంగానే చూస్తున్నారు. రానున్న రోజులలో ఇది ఏ రకమైన మలుపు తీసుకుంటుందో చూడాల్సి ఉంది.

## సివిల్ కాంట్రాక్టుల్లో ముస్లిములకు 4% రిజర్వేషన్!

కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం సివిల్ కాంట్రాక్టుల్లో ముస్లిములకు 4% రిజర్వేషన్ కల్పించేందుకు సిద్ధమవుతోంది. ముఖ్యమంత్రి సిద్దరామయ్య నేతృత్వంలోని ప్రభుత్వం %ఖ్రూ% (కర్ణాటక ట్రాన్స్‌పరెన్సీ ఇన్ పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్) చట్టాన్ని సవరించాలని యోచిస్తోంది. ఈ మేరకు ఫైనాన్స్ శాఖ ఇప్పటికే బ్లూప్రింట్ సిద్ధం చేసిందని సమాచారం. క్యాబినెట్ సమావేశంలో ఈ ప్రతిపాదనపై చర్చ జరిగే అవకాశం ఉంది. మంత్రివర్గం ఆమోదం తెలిపితే రాబోయే బడ్జెట్ సెషన్‌లో ఈ ప్రస్తావనను అధికారికంగా ప్రవేశపెట్టనున్నారు. ప్రభుత్వ వర్గాల ప్రకారం..




ఈ నిర్ణయం సామాజిక న్యాయాన్ని పెంపొందించేందుకు తీసుకుంటున్న చర్యగా పేర్కొన్నారు.

**వ్యతిరేకిస్తున్న ప్రతిపక్ష బీజేపీ...** ఈ నిర్ణయాన్ని భాజపా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. "ఇది బుజ్జగింపు రాజకీయాలకు పరాకాష్ట" అని బీజేపీ నేతలు విమర్శిస్తున్నారు. ప్రభుత్వం మత ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని ఆరోపిస్తున్నారు. ఈ నిర్ణయం ద్వారా ఇతర వెనుకబడిన తరగతులపై అన్యాయం జరుగుతుందని వారు చెబుతున్నారు.


**పలువురు మద్దతుదారుల అభిప్రాయం...** ముస్లిముల సంక్షేమ సంఘాలు, మైనారిటీ హక్కుల పరిరక్షణ సంఘాలు ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాయి. ముస్లిముల ఆర్థిక స్థితిని మెరుగుపరిచేందుకు ఇలాంటి చర్యలు అవసరమని వారు అభిప్రాయపడుతున్నారు. కొన్ని వర్గాలు, అయితే, ప్రభుత్వ విధానాన్ని సమర్థిస్తూ, దీని ద్వారా సామాజిక సమానత్వానికి కొత్త గళం పడుతుందని చెబుతున్నాయి.

**తుది నిర్ణయం ఎప్పుడు?...** క్యాబినెట్ ఆమోదం పొందిన తర్వాత, రిజర్వేషన్ ప్రతిపాదన బడ్జెట్ సెషన్‌లో ప్రవేశపెట్టబడే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై అధికారిక ప్రకటన చేసిన తర్వాత, దీనిపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

అయితే, రాజకీయంగా ఈ నిర్ణయం మరింత చర్చనీయాంశమయ్యే సూచనలున్నాయి.

## రేవంత్ - చంద్రబాబు.. గురుశిష్యుల మధ్య యుద్ధం మొదలు?

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు మధ్య లొల్లి మొదలైంది. ఇరు రాష్ట్రాల మధ్య నీటివనరుల పంపకం నేతల మధ్య అగ్గిరాజేస్తున్నట్లు కనిపిస్తోంది. ఏపీ సీఎం చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణంపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేయడమే కాకుండా కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంపై చంద్రబాబు అసంతృప్తితోపాటు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ సర్కారు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తామంటే తాము వద్దన్నామా? అంటూ ప్రశ్నించారు? దీంతో ఇద్దరు నేతల మధ్య గ్యాప్ పెరుగుతుందనే టాక్ వినిపిస్తోంది. ఏపీ సీఎం చంద్రబాబు అంటే తనకు ఎంతో గౌరవమంటూనే తన రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆయనతో వివాదానికి రెడీ అవుతున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకేతాలు పంపుతున్నారు. ఏపీలోని రాయలసీమ, పల్నాడు జిల్లాల్లో కరువు రూపుమాపడానికి గోదావరి జలాలను తరలించాలనే చంద్రబాబు ప్రణాళికను అడ్డుకునేందుకు రేవంత్ రెడ్డి రంగంలో దిగారు. ఇప్పటికే రెండు రాష్ట్రాల మధ్య క్రిష్ణా జలాల



సమస్య ఉండగా, తాజాగా గోదావరి జలాలను వాడుకునేందుకు ఏపీ చేస్తున్న ప్రయత్నాలను ఆదిలోనే అడ్డుకోవాలని తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. దీంతో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వైఖరిపై ఏపీ సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణంపై రేవంత్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేయడంపై చంద్రబాబు స్పందించారు. సముద్రంలో వృథాగా కలిసే నీటినే తాము వాడుకోవాలని అనుకుంటున్నామని తెలిపారు. వృథా నీటితో బనకచర్ల కడితే తప్పేంటని ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తే తాము అభ్యంతరం చెప్పలేదన్న విషయాన్ని గుర్తుచేశారు. నీళ్లు వృథా కాకుండా తెలంగాణ కూడా నీటిని వాడుకోవచ్చునని సలహా ఇచ్చారు. సముద్రంలో కలిసే వరద నీటిని కరువు నేలకు తరలించే ప్రక్రియను అడ్డుకోవద్దని రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు.కాగా, ఢిల్లీ పర్యటనకు వెళ్లిన తెలంగాణ సీఎం ఏపీ ప్రభుత్వం చేపడుతున్న బనకచర్ల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంపై జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ కు ఫిర్యాదు చేశారు. రేవంత్ రెడ్డి కంప్లెయింట్ చేసిన గంటల వ్యవధిలోనే ఏపీ సీఎం స్పందించారు. అయితే ఈ వివాదంపై కేంద్రం నిర్ణయం ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది. మరోవైపు గురు, శిష్యుల మధ్య మొదలైన నీళ్ల పంచాయితీ ఎటు దారితీస్తుందనేది వాడివేడి చర్చకు దారితీస్తోంది.

చురకలు

## సంపాదకీయం

### రాష్ట్రాలకు కోత పెడుతున్న మోడీ సర్కార్ ?

దేశంలోని 28 రాష్ట్రాలు ఉన్నాయి. అయితే బీజేపీ పాలిత రాష్ట్రాలు ఎన్డీయే పాలిత రాష్ట్రాలు ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు అన్న వివక్ష ఉందని ఇండియా కూటమి నేతలు అంటూంటారు. బీజేపీ రాష్ట్రాలకు రూపాయికి ఏడు రూపాయల దాకా కేంద్రం నుంచి నిధులు అందుతాయని అదే విపక్షాల రాష్ట్రాలకు ఎంత ఆదాయం కేంద్రానికి పన్నుల రూపంలో ఇచ్చినా నలభై నుంచి యాభై పైసల వద్దనే నిధులు ఇస్తారని విమర్శలు చేస్తూంటారు. ఇక జీఎస్టీ వచ్చాక రాష్ట్రాలు సొంతంగా పన్నులు వేసుకుని నిధులను పొందే సౌలభ్యం లేకుండా పోయింది అన్నది ఉంది. అంతే కాదు బీజేపీ ఏలుబడిలో స్పెషల్ గ్రాంట్స్ అన్నవి కూడా పెద్దగా లేవని రాష్ట్రాల పట్ల సానుకూలత ఉంటే ఉదారంగా అప్పులు చేసుకునేందుకు మాత్రమే వీలు కల్పిస్తుందని కూడా విమర్శిస్తుంటారు. ఇక ప్రకృతి విపత్తులు వచ్చినపుడు కూడా కేంద్రం నుంచి గతంలో మాదిరిగా పెద్దగా సాయం ఇపుడు అందడం లేదు అన్నది కూడా చర్చగా ఉంది. ఇవన్నీ ఇలా ఉంటే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ద్రవ్య లోటుని పూడ్చుకునేందుకు రాష్ట్రాలకు పన్నుల ద్వారా ఇవ్వాల్సిన వాటాలలో కోత పెట్టడానికి చూస్తోంది అన్నది ఇపుడు ఒక ప్రచారంగా ముందుకు వస్తోంది. రాష్ట్రాలకు కేంద్రం నుంచి దక్కాల్సిన పన్నుల వాటాను తగ్గించేందుకు ఆర్థిక శాఖ ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లుగా రాయిటర్స్ ఒక సంచలన కథనాన్ని ప్రచురించింది. ఈ కథనం ప్రకారం చూస్తే ఇప్పటిదాకా కేంద్రం నుంచి రాష్ట్రాలకు పన్నుల ద్వారా 41 శాతం వాటా వచ్చేది. తాజా ప్రతిపాదనల ప్రకారం దీనిని ఒక్క శాతం వాటా తగ్గించి నలభై శాతానికి పరిమితం చేయాలని చూస్తోంది అని అంటున్నారు. ఇలా కేవలం ఒక్క శాతం వాటాలో కోత పెట్టడం వల్ల కేంద్రానికి ఏకంగా 35 వేల కోట్ల రూపాయల ఆదాయం మిగులుతుందని రాయిటర్స్ కథనం వెల్లడించింది. ఆర్థికవేత్త అరవింద్ పనగరియా నాయకత్వంలోని ఆర్థిక సంఘానికి ఇదే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రతిపాదించినట్లుగా చెబుతున్నారు. ఈ నెలాఖరులో జరిగే కేంద్ర మంత్రివర్గ భేటీలో ఈ ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసి ఆ మీదట పరిశీలన కోసం ఆర్థిక సంఘానికి పంపుతారని అంటున్నారు. ఇక ఈ నిర్ణయానికి ఆర్థిక సంఘం కనుక ఓకే చెబితే 2025-26 ఆర్థిక సంవత్సరం నుంచి ఈ కోత అమలులోకి వస్తుంది. దాని వల్ల రాష్ట్రాలకు దక్కే కేంద్ర పన్నులలో వాటా సొమ్ము గణనీయంగా తగ్గిపోతుంది అని అంటున్నారు. దీని వల్ల రాష్ట్రాలు మరింతగా ఆర్థికంగా ఇబ్బందులోకి వెళ్తాయని చెబుతున్నారు. ఇప్పటికే ఏపీ లాంటి రాష్ట్రాలు అప్పుల మీద నడుస్తున్నాయి. ఇక మీదట సంక్షేమానికి కాదు కదా అభివృద్ధికి కూడా నిధుల కోసం తీవ్ర కొరత వస్తుందని అంటున్నారు. కేంద్రం ద్రవ్య లోటుని పూడ్చుకోవడానికి రాష్ట్రాల పన్నుల వాటలో కోత పెట్టడం ఏమిటి అన్నది విపక్షాల నుంచి మెల్లగా వినిపిస్తోం ది. కేబినెట్ ఆమోదం తెలిపిస్తే మరి విపక్షాలు ఏ రకంగా ప్రతిఘటిస్తాయన్నది చూడాల్సి ఉంది.

# పాశ్చాత్య దేశాల్లో యోగా పితా మహుడు యోగానంద యోగి - మార్చి 7...పరమహంస యోగానంద వర్ధంతి



పరమహంస యోగానంద (1893 జనవరి 5 - 1952 మార్చి 7) భారతీయ సన్యాసి, యోగి, ఆధ్యాత్మిక గురువు. యోగానంద అమెరికాలో స్థిరపడ్డ ప్రధాన ఆధ్యాత్మిక గురువుల్లో ప్రథముడు. తన చివరి 32 సంవత్సరాలు అమెరికాలో గడిపాడు3. శ్రీయుక్తే శ్వర్ గిరికి ముఖ్య శిష్యుడిగా, యోగాభ్యాసాన్ని పాశ్చాత్యులకు పరిచయం చేసి ఆయన భౌతిక వాదాన్ని, భారతీయుల ఆధ్యాత్మి కతను సమన్వయ పరచడంలో ప్రధాన పాత్ర పోషించాడు. అమెరికాలో ఆయన యోగా ఉద్యమంపై వేసిన ముద్ర, లాస్ ఏంజిలస్ లో ఆయన నెలకొల్పిన యోగా సంస్కృతి, ఆయనకు పాశ్చాత్య దేశాల్లో యోగా పితా మహుడిగా గౌరవ స్థానాన్ని సంపా దించి పెట్టాయి. 1927 లో అప్పటి అమెరికా అధ్యక్షుడు కాల్విన్ కూలిడ్జ్ చేత వైట్ హౌస్ ఆతిథ్యాన్ని అందుకున్న ప్రథమ భారతీయ ప్రముఖుడు కూడా ఆయనే. లాస్ ఏంజిలస్ టైమ్స్ అనే పత్రిక ఆయన్ను 20వ శతాబ్దపు మొట్టమొదటి సూపర్ స్టార్ గురువు అని అభివర్ణించింది. యోగానంద 1893, జనవరి 5 న ఉత్తరప్రదేశ్ లోని గోరఖ్‌పూర్లో ఒక సాంప్రదాయ బెంగాలీ కాయస్థ కుటుంబంలో జన్మించాడు. జన్మ నామం ముకుందలాల్ ఘోష్. చిన్న వయసు నుంచే ఆధ్యాత్మికతలో వయసుకు మించిన ఆసక్తిని, పరిణతిని కనబరిచేవాడు. పాఠశాల చదువు పూర్తయిన తర్వాత ఇల్లు వదలి వారణాసిలోని మహామండల్ సన్యాసాశ్రమం చేరాడు. 17 ఏళ్ళ వయసులో, 1910 సంవత్సరంలో శ్రీయుక్తేశ్వర్ గిరిని తన గురువుగా కను గొన్నాడు. యోగానంద శ్రీయుక్తేశ్వర్ గిరి శ్రీరాంపూర్ ఆశ్రమం లోనూ, పూరీ ఆశ్రమంలోనూ ఒక దశాబ్దం పాటు (1910-1920) శిక్షణ పొందా డు. 1914 లో కలకత్తాలోని స్కాటి ష్ చర్చి కళాశాల నుండి ఇంట ర్మీడియట్ పరీక్షలో ఉత్తీర్ణుడై 1915, జూన్ లో బి. ఎ డిగ్రీకి సమానమైన డిగ్రీని పొందాడు. కళాశాల వదిలిపెట్టిన కొన్ని వారాలకు సాంప్రదాయికంగా సన్యాసాన్ని స్వీకరించాడు. శ్రీ యుక్తేశ్వరి గిరి ఆదేశానుసారం తన సన్యాస నామాన్ని స్వచ్ఛందంగా స్వామి యోగానంద గిరిగా మార్చు కున్నాడు. 1917 లో యోగానంద బాలుర కోసం పశ్చిమ బెంగాల్ లోని దిహికలో ఒక పాఠశాల ప్రారం భించాడు. ఆ పాఠశాల అమెరికాలో యోగానంద స్థాపించిన సెల్ఫ్ రియ లైజేషన్ ఫెలోషిప్ కు భారత దేశం లో అనుబంధ పాఠశాల అయి న యోగదా సత్సంగ సొసైటీగా మారింది. అమెరికన్ యూనిటేరియన్ అసోసియేషన్ నుంచి బోస్టన్ లో జరిగే ప్రపంచ మత ఉదారవాదుల సభకు భారతదేశ ప్రతినిధిగా హాజరు కావాలని ఆహ్వానం అందింది. అందుకు గురువు శ్రీయుక్తేశ్వర్ గిరి అనుమతి కూడా వచ్చింది. 1920 లో బోస్టన్‌కు చేరుకున్న ఆయన తన ఉపన్యా సాలతో ఖండాంతర పర్యాటన చేశాడు. అంతర్జాతీయ మత సభల్లో ప్రసంగించాడు. ఆయన 1920 నుంచి 1952లో మరణించే దాకా అక్కడే ఉన్నాడు. సనాతన భారతదేశపు ఆధ్యాత్మిక బోధనలు, యోగాతత్వం, ధ్యాన సాంప్రదాయాలను ప్రచారం చేయడం కోసం సెల్ఫ్ రియలైజేషన్ ఫెలోషిప్ అనే సంస్థను ప్రారంభించాడు. యోగా నంద తర్వాతి నాలుగు సంవత్సరా లు బోస్టన్ లో గడిపాడు. 1924 లో సందేశాలిస్తూ ఖండాంతర పర్యటన లు చేశాడు. చివరికి 1925లో లాస్ ఏంజిలస్ లో స్థిరపడ్డాడు. అమెరి కాలో ఎక్కువ భాగం గడిపిన హిందూ ఆధ్యాత్మిక గురువుల్లో యోగానంద ప్రథముడు. తర్వాత 25 సంవత్సరాల పాటు అక్కడే ప్రాంతీయంగా మంచి గుర్తింపు పొందడమే కాక తన ప్రభావాన్ని విశ్వవ్యాప్తం చేశాడు. ఒక సన్యాసి సాంప్రదాయాన్ని ఏర్పాటు చేసి శిష్య పరంపరకు శిక్షణ ఇవ్వడం ప్రారంభించాడు. అక్కడక్కడ పర్యటిస్తూ బోధనలు చేశాడు. కాలిఫోర్నియాలోని పలు ప్రాంతాల్లో తమ సంస్థ కోసం ఆస్తు లు కొన్నాడు. వేలాది మందిని క్రియా యోగంలోకి ప్రవేశింప జేశాడు. 1935లో భారత దేశానికి వచ్చిన ఆయన, మహాత్మా గాంధీని కలిసి ఆయనను క్రియాయోగంలో ప్రవేశ పెట్టాడు. ఆనందమయి మా, నిరాహార యోగిని గిరిబాల, భౌతిక శాస్త్రవేత్త సి. వి. రామన్, లాహిరీ మహాశయుల శిష్యులను కొంత మందిని కలిశాడు. తిరిగి లండన్ వెళ్లి, యోగా తరగతులు నిర్వహించాడు. చారిత్రాత్మక స్థలాలు దర్శించాడు. అక్కడ నుంచి 1936 అక్టోబరున అమెరికాకు వెళ్ళి, అమెరికన్ శిష్యులను కలుసుకుని తన బోధన లు, రచనా కార్యక్రమాలు తిరిగి కొనసాగించాడు. 1952 కల్లా SRF భారతదేశం లో, అమెరికాలో కలిపి 100కి పైగా కేంద్రాలు నెలకొల్పారు. ప్రస్తుతం అమెరికాలో ప్రతి ప్రధాన నగరం లోనూ కేంద్రాలున్నాయి. ఆయన బోధించిన సరళ జీవనం, ఉన్నత మైన ఆలోచన అనే విధా నం వివిధ నేపథ్యాలు కలిగిన పలు వురు జిజ్ఞాసువులను ఆకట్టుకుంది. 1946 లో ఆయన రాసిన ఒక యోగి ఆత్మకథ విమర్శకుల ప్రశంసల నందుకుని ఇప్పటిదాకా 40 లక్షల ప్రతులకుపైగా అమ్ముడు పోయింది. హార్పర్ కోలిన్స్ సంస్థ 20వ శతాబ్దపు అత్యంత ప్రజాదర ణ పొందిన 100 పుస్తకాల్లో ఈ పుస్తకాన్ని చేర్చింది. ఈ పుస్తకం క్రమం తప్పకుండా అనేక పున ర్ముద్రణలు జరుపుకుని అనేక లక్షల మంది జీవితాలను మార్చినదిగా పరిగణించబడుతోంది. 1946 లో ఆయన అమెరికాలో మారిన వలస చట్టాల ప్రకారం పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోగా, 1949లో అంగీకరించ బడి అధికారికంగా అమెరికా పౌరుడయ్యాడు. 1952 మార్చి 7 న యోగానంద అమెరికాలో భారత రాయబారి వినయ్ రంజన్ సేన్ గౌరవార్థం లాస్ ఏంజిలెస్ లోని బిల్ట్‌మోర్ హోటల్లో ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నని, తన ఉపన్యా సం ముగించి, తాను రాసిన మై ఇండియా నుంచి కొన్ని వాక్యాలు చదివాక, తన చూపును ఆజ్ఞా చక్రంపై కేంద్రీకరించాడు. వెంటనే ఆయన శరీరం నేలమీద పడి పోయింది. ఆయన అనుచరులు తమ గురువు మహాసమాధి చెందినట్లు ప్రకటించారు. 1946 లో ఆయన ఆత్మకథను ఆటోబయోగ్రఫీ ఆఫ్ ఎ యోగి అనే పేరుతో ఆంగ్లంలో రాశాడు. ఈ పుస్తకం 50 పైగా భాషల్లోకి అనువాదమైంది. తెలుగులో ఒక యోగి ఆత్మకథ పేరుతో అనువదించారు. 1999 లో జరిపిన సర్వేలో ఈ పుస్తకం 20 వ శతాబ్ద పు అత్యుత్తమ ఆధ్యాత్మిక గ్రంథా ల్లో ఒకటిగా, స్థానం పొందింది. యోగదా సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా 1917 లో యోగానంద భారత దేశంలో స్థాపించిన సంస్థ. దీన్నే 1920 లో సెల్ఫ్ రియలైజేషన్ ఫెలోషిప్ (%ూ=ఖీ%) పేరుతో అమెరికాకు విస్తరించారు. %ూ=ఖీ/ూూ% ప్రధాన కార్యాలయం లాస్ ఏంజిలెస్ లో ఉంది. ఈ సంస్థకు ప్రపంచ వ్యాప్తంగా 500 కి పైగా దేవాలయాలు, కేంద్రాలు ఉన్నాయి. 175 దేశాల నుంచి ఈ సంస్థలో సభ్యులు ఉన్నారు. భారత దేశంలో %ూూ% 100 కి పైగా కేంద్రాలు, ఆశ్రమాలను నడుపుతోంది. నవంబరు 15, 2017 న భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, జార?ండ్ గవర్నరు ద్రౌపది ముర్ము, ముఖ్య మంత్రి రఘుబర్ దాస్‌తో కలిసి రాంచీలోని యోగదా సత్సంగ శాఖను సందర్శించారు. పరమహంస యోగానంద జ్ఞాపకంగా 1977 లో భారత ప్రభుత్వం ఆయన పేరున తపాలా బిళ్ళను విడుదల చేసింది. మార్చి 7, 2017 నాడు భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, యోగదా సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మరో స్మారక తపాలా బిళ్ళను విడుదల చేశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# తెలుగు చిత్రసీమలో ప్రథమ నేపథ్య గాయకుడు ఎమ్మెస్ - మార్చి 7...ఎమ్మెస్ రామారావు జయంతి



"శ్రీ హనుమాన్ గురుదేవులు నా యెద పలికిన సీతా రామ కథ....నే పలికెద సీతా రామ కథ"... ఎమ్మెస్ రామారావు సుమధుర కంఠం నుండి జాలువారిన సుందరాకాండ వినని తెలుగు వారు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. హనుమాన్ జయంతి, శ్రీ రామ నవమి నేపథ్యం లో, హనుమాన్ మండల దీక్షలు, రామ నవరాత్రుల సందర్భంగా ఎక్కడ విన్నా సుందరాకాండ విని పించడం సర్వ సాధారణమే. అంతే కాక, ఆంజనేయ, రామాలయాలలో నిరంతరం మైకుల ద్వారా రామా రావు గానం చేసిన సుందరాకాండ ప్రతిధ్వనించడం కద్దు. మోపర్తి సీతారామారావు అంటే ఎవరో చాలామందికి వెంటనే స్ఫురించక పోవచ్చును. కాని ఎం.ఎస్.రామారావు అనగానే తెలుగు సినిమాల తొలి నేపథ్య గాయకునిగా సంగీతాభిమానులకు, పాత తరం సినీ ప్రేక్షకులకూ ఆయన గుర్తుంటారు. సుందరదాసు' అన గానే ఆయన యావత్ తెలుగు ప్రజ లందరికీ సుపరిచితులు, సుప్రసి ద్ధులు. ఆయన రచించి, సంగీతం సమకూర్చి గానం చేసిన 'సుందర కాండ' గీతాలు యావదాంధ్ర దేశంలోనూ మారు మ్రోగాయి. మారు మ్రోగుతున్నాయి. ఇంకా మారు మ్రోగుతూనే ఉంటాయి. రామాయణంలోని మధురమైన 'సుందరకాండ' కథను, తేట తెలుగులో, మృదు మధురమైన శైలిలో ఆయన పాడిన తీరు అసమానం, అపూర్వం, అద్వితీ యం. ఇలా మూడు విధాలుగా స్వీయ రచన గావించి, సంగీతం సమకూర్చి, స్వయంగా గానం చేసిన అసమాన ప్రతిభాశాలి ఎమ్మెస్ రామారావుకు ముందు మరొక లేరనడం అతిశయోక్తి కాదు. ఆయనకు "సుందర దాసు" అనే బిరుదు ఉంది. గేయ రూపంలో రచించి గానం చేసిన రామయణ భాగం సుందరకాండము "ఎమ్మెస్ రామారావు సుందరకాండ" గా సుప్రసిద్ధం. తులసీదాసు రచించిన హనుమాన్ చాలీసాను తెలుగులోకి అనువదించి ఆకాశవాణిలో పాడా రు. ఆ రెండూ ఆయనకు మంచి గుర్తింపును, ఖ్యాతిని తెచ్చి పెట్టాయి. ఎమ్మెస్ రామారావు (మోపర్తి సీతారామారావు) 1921 మార్చి 7 న గుంటూరు జిల్లా అమృతలూరు మండలానికి చెందిన మోపర్రు గ్రామలో జన్మించారు. ఈయన తల్లిదండ్రులు మోపర్తి రంగయ్య, మంగమ్మ గార్లు సీతారామ భక్తులు. చిన్నతనం నుండే రామారావు గారు పాటలు పాడుతుండేవారు. ఈయ న విద్యాభ్యాసము నిడుబ్రోలు ఉన్నత పాఠశాలలో, గుంటూరు హిందూ కళాశాలలో జరిగింది. ఇంటర్మీడియేట్ రెండవ సంవత్సరం చదువుతున్న రోజుల్లో (1941 లో) అంతర్ కళాశాలల లలిత సంగీత పోటీలో మొదటి బహుమతి గెలుచు కున్నారు. న్యాయనిర్ణేతల్లో ఒకరైన అడవి బాపిరాజు చలన చిత్ర రంగంలో ప్రవేశించమని ఆయనను చాలా ప్రోత్సహించారు. 1944 లో ప్రఖ్యాత సినీ దర్శక నిర్మాత వై.వి.రావు తన తహసీల్దార్ చిత్రంలో ఎమ్మెస్ చేత మొదటి సారిగా "ఈ రేయి నన్నొల్ల నేరవా రాజా" అనే ఎంకి పాట పాడించా రు. ఆ చిత్రంలో కథా నాయకుని పాత్ర పోషించిన సి. హెచ్. నారాయణ రావుకు పాడారు. తెలుగు చలన చిత్ర చరిత్రలో ఇది మొట్ట మొదటి నేపథ్య గానం. అలా తెలుగు చలనచిత్ర చరిత్రలో మొట్ట మొదటి నేపథ్య గాయకులుగా గుర్తింపు పొందారు. తరువాత ఎమ్మెస్ దీక్ష, ద్రోహి, మొదటి రాత్రి, పాండురంగ మహత్యం, నా యిల్లు, సీతారామ కల్యాణము, శ్రీరామాంజనేయ యుద్ధము మొదలైన సినిమాలలో పాడారు. 1944 నుంచి 64 వరకు తెలుగు చలన చిత్రాలలో నేపథ్య గాయకునిగా మద్రాసులో నివసిం చిన ఆయన 5 సంవత్సరాల పాటు కర్ణాటక శాస్త్రీయ సంగీతం నేర్చుకు న్నారు. కొన్ని పాటలు రాసి నల్ల పిల్ల, తాజ్ మహల్, హంపి, కనీసం, హిమాలయాలకు రాలేనయ్యా, మొదలైన గ్రామఫోన్ రికార్డులు ఇచ్చారు. నీరాజనం చిత్రంలో "ఈ విశాల ప్రశాంత ఏకాంత సౌధములో నిదురించు జహాపనా" పాటలో ఎమ్మెస్ గొంతు వినిపించింది. 1963 సంవత్సరాంతంలో మద్రాసు వదిలి వెళ్లి, రాజమండ్రి చేరుకుని 1974వరకు అక్కడే నివసించారు. అక్కడ నవభారతి గురుకులంలో పది సంవత్సరాలు ఉద్యోగం చేసారు. 1970 లో పెద్ద కుమారుడు బాబూరావు భారతీయ వాయుసేన ఇండియన్ ఏర్ ఫోర్స్ లో పైలట్ ఆఫీసరుగా నియమితుడైనారు. 1971లో పాకిస్థానుతో జరిగిన యుద్ధ కాలంలో అతని ఆచూకీ తెలియ లేదు. తల్లి తండ్రులిద్దరూ భయం చెంది కుమారుని క్షేమం కోసం వాయు కుమారుడైన హనుమంతుని ఆరాధించడం మొదలు పెట్టారు. తర్వాత కొంత కాలానికి అబ్బాయి క్షేమంగా ఇల్లు చేరడంతో శ్రీ హనుమానుడే వారి ఇష్ట దైవమైనాడు. ఆయన హను మాన్ చాలీసా, సుందరకాండ వ్రాయడానికి అదే ప్రేరణ. 1972 నుండి 74 వరకు తులసీదాసు హనుమాన్ చాలీసాను హిందీ నుంచి తెలుగులోనికి అనువదిం చారు, తన పేరుతో అవినాభావ సంబంధమేర్పడ్డ సుందరకాండ గేయ రచన చేశాడు. 1975 నుంచి హైదరాబాదులోని చిక్కడపల్లిలో నివసించారు. రామారావుకు 1977 సంవత్సరంలో సుందరదాసు అనే బిరుదాన్ని ఇచ్చారు. ఈయన ఏప్రిల్ 20, 1992న హైదరా బాదులో తుది శ్వాస విడిచారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# దేశం గర్వించ దగిన ఖగోళ భౌతిక శాస్త్రవేత్త ఎ .వి.లక్ష్మీనారాయణ

## మార్చి 7...అప్పడవేదుల లక్ష్మీనారాయణ వర్ధంతి

అప్పడవేదుల లక్ష్మీనారాయణ (1887- మార్చి 7,1973) భారత దేశానికి చెందిన ప్రముఖ ఖగోళ భౌతిక శాస్త్రవేత్త. భారతీయ ఖగోళ పరిశోధనలో కీలక పాత్ర పోషించిన ఆయన, ముఖ్యంగా సౌర భౌతికశాస్త్రం మరియు నక్షత్రాల వర్ణపట విశ్లేషణ రంగాల్లో తన విశేష కృషిని అందించారు. కొడైకెనాల్ లోని సూర్య దర్శిని విభాగంకు తొలి అధ్యక్షుడిగా సేవలందించి, భారత ఖగోళ పరిశోధనను కొత్తదారిలో నడిపారు. 1887లో తూర్పు గోదావరి జిల్లా, ముక్కామల గ్రామం (అంబాజీపేట మండలం)లో అప్పడవేదుల వ్యాసులు, మహాలక్ష్మి ధంపతులకు జన్మించారు. చిన్ననాటి నుంచే శాస్త్ర అధ్యయనం మీద ఆసక్తి కనబరిచిన లక్ష్మీనారాయణ, ప్రాథమిక విద్యను కొత్తపేట ఉన్నత పాఠశాల లో పూర్తిచేశారు. 1910లో రాజమండ్రి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల లో బి. ఎ విద్యను పూర్తి చేశారు. 1914లో మద్రాసు విశ్వవిద్యాలయం నుండి భౌతికశాస్త్రంలో ఎం. ఎ డిగ్రీ పొందారు. అనంతరం, విజయనగరం మహారాజా కళాశాల లో ఉపన్యాసకుడిగా పనిచేశారు. లండన్‌లోని రాయల్ కాలేజ్ ఆఫ్ సైన్స్ లో డాక్టరేట్ చేసిన తర్వాత ఖగోళ భౌతికశాస్త్ర పరిశోధనలో మరింత నిమగ్నమయ్యారు. అప్పడవేదుల లక్ష్మీనారాయణ తన కెరీర్‌లో భారతీయ ఖగోళ పరిశోధన అభివృద్ధికి అంకితమై పనిచేశారు. కొడైకెనాల్ సౌర పరిశోధనా కేంద్రం లో పనిచేసి, భారత దేశంలో సూర్యుని వర్ణపట విశ్లేషణ కు బలమైన పునాది వేశారు. సూర్యుని వాతావరణం, సౌర మచ్చలు, సౌర జ్వాలల గురించి లోతైన అధ్యయనాలు నిర్వహించారు. ఈ పరిశోధనల ఫలితంగా, సూర్యుని యూనిక్ స్పెక్ట్రల్ లైన్స్ గురించి విలువైన పరిశోధనలు అందించారు. సూర్యుని ఉపరితల లక్షణాలు, వాతావరణం, ఉష్ణోగ్రత మార్పులు, సౌర మబ్బులు గురించి లోతైన అధ్యయనాలు చేశారు. సౌర వర్ణపట విశ్లేషణ ద్వారా, సూర్యుని వాయుమండలంలో హైడ్రోజన్, హీలియం వంటి మూలకాలు ఉన్నాయనే విషయాన్ని ప్రామాణికంగా నిర్ధారించారు. నక్షత్రాల స్పెక్ట్రల్ అనాలసిస్ పై ప్రత్యేక పరిశోధనలు చేశారు. నక్షత్రాల ఉష్ణోగ్రత, రసాయనిక నిర్మాణం, పరిణామ ప్రక్రియ గురించి గొప్ప పరిశోధనలు అందించారు. తన అధ్యయనాల ద్వారా నక్షత్రాల వర్ణపటంలో ప్రత్యేకమైన లైన్‌లను గుర్తించి, అవి ఎలాంటి మూలకాల ఉనికిని సూచిస్తాయో విశ్లేషించారు. భారత ఖగోళ పరిశోధనలను కొత్తదారిలో నడిపించేందుకు ఖగోళ పరిశీలన పరికరాల అభివృద్ధి పై కృషి చేశారు. సౌర స్పెక్ట్రోగ్రాఫ్ ఆధునీకరణలో కీలకపాత్ర పోషించారు. 1957లో ఖగోళ భౌతిక శాస్త్రానికి చేసిన కృషికి భారత ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించింది. భారత జాతీయ సైన్సు అకాడమీ ఫెలోగా ఎంపికయ్యారు. లండన్ భౌతికశాస్త్ర సంస్థ ఫెలోగా ఎన్నికయ్యారు. తిరువాన్కూరు మహారాజా వారి "కర్జన్ స్మారక బహుమతి" పొందారు. భారత సైన్స్ కాంగ్రెసులో భౌతికశాస్త్ర విభాగానికి అధ్యక్షుడిగా వ్యవహరించారు.

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ప్లానింగ్ కమిషన్ సభ్యునిగా సేవలందించారు. సౌర పరిశోధనల్లో విశేష కృషి చేసినందుకు గాను, చంద్రుని ఉపరితలంలోని ఒక బిలానికి "లక్ష్మీనారాయణ" అని పేరు పెట్టారు. 1973లో ఆయన మరణించినా, ఆయన చేసిన పరిశోధనలు భారత ఖగోళ భౌతిక శాస్త్ర పరిశోధనలకు శాశ్వత ఆస్తిగా నిలిచాయి. భారతదేశ ఖగోళ పరిశోధనకు ఆయన అందించిన కృషి ఈ రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రేరణగా మారింది. కొడైకెనాల్ సౌర పరిశోధనా కేంద్రం, భారత ఖగోళ పరిశోధనలో అతి సంభ్రమకరమైన కేంద్రంగా అభివృద్ధి చెందడానికి ఆయన చేసిన కృషి అమూల్యమైనది. ఆయన పరిశోధనల ఆధారంగా, తర్వాతి తరం శాస్త్రవేత్తలు నక్షత్ర భౌతికశాస్త్రంలో ముందడుగు వేశారు. అప్పడవేదుల సౌర భౌతిక శాస్త్రం, నక్షత్ర విశ్లేషణ, ఖగోళ పరిశీలనా పరికరాల అభివృద్ధి వంటి రంగాల్లో ఆయన చేసిన విశేష కృషి భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలిచింది. భారత ఖగోళ శాస్త్ర పరిశోధనలో ఆయన ఎనలేని సేవలను చరిత్ర చిరస్థాయిగా గుర్తుంచు కుంటుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**


# దిగువకు పాతాలగంగ

సిరిసిల్ల : జిల్లా వ్యాప్తంగా భూగర్భ జలమట్టాలు వేగంగా పడిపోతున్నాయి. గత నెలతో పోలిస్తే జిల్లాలోని ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, తంగళ్లపల్లి మండలాల్లో సగటున 2.45 నుంచి 1.54 మీటర్ల మేర దిగువకు పడిపోయాయి. జిల్లా భూగర్భ జలశాఖ తాజా నివేదిక దీనిని స్పష్టం చేస్తోంది. మరోవైపు గత నాలుగు రోజులుగా సగటున 36.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాధారణం కంటే మూడు డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగాయి. పరిస్థితి ఇలానే కొనసాగితే మెట్టప్రాంతం కావడంతో భూగర్భజలాలు మరింత వేగంగా లోతుకు పడిపోయే అవకాశాలు ఉన్నాయి.

జిల్లాలో యాసంగి వరి 1.77 లక్షల ఎకరాలు.. ఆరుతడి పంటలైన మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, కూరగాయలు కలిపి నాలుగు వేల ఎకరాల్లో సాగయ్యాయి. గతేడాదితో పోల్చితే వరిసాగు 20 వేల ఎకరాలు పెరిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. వరి పంటకు ఈ రెండు నెలలు కీలకం. పొట్టదశలో కంకులు పాలుపోసుకుంటాయి. ఇప్పుడు నీటి తడులు ఎక్కువ అందిస్తే... దానికి తగ్గట్టుగా దిగుబడి పెరుగుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో అంత మేర నీటి లభ్యత కనిపించడం లేదు.

మధ్యమానేరులో 15.95 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇక్కడి నుంచి దిగువమానేరు, కుడి, ఎడమ కాల్వల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. అన్నపూర్ణ జలాశయం నుంచి ఇల్లంతకుంట మండలంలోని చెరువులను నింపారు. ఎగువమానేరులోకి మల్లన్నసాగర్‌నుంచి గత నెలలోనే 0.5 టీఎంసీల నీటిని తరలించారు. ఆయా కాల్వల పరిధిలోని ఆయకట్టు మినహా మిగతా ప్రాంతమంతా బోరుబావులే ఆధారం. మెట్టప్రాంతం కావడంతో భూగర్భజలాలు వేగంగా తగ్గుతున్నాయి. దీని ప్రభావం సాగుచేసిన పంటలపై పడుతోంది.

పంటల సాగు విస్తీర్ణం పెరగడంతో బోరు బావుల నుంచి అన్నదాతలు



నిరంతరం నీటిని తోడుతున్నారు. ఈ ఏడాది తక్కువ రోజుల్లో ఎక్కువ వర్షాలు కురవడంతో భూగర్భంలోకి తక్కువ నీరు ఇంకింది. ఫలితంగా భూగర్భ జలమట్టాలు వేగంగా పడిపోతున్నాయి. పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి సాగునీటి ఇబ్బందులు తీర్చేందుకు చర్యలు చేపట్టాలని అన్నదాతలు కోరుతున్నారు.


నాకున్న 2.20 ఎకరాలకు తోడు పక్కనే ఉన్న మరో 2.20 ఎకరాలను కౌలుకు తీసుకుని మొత్తం వరి సాగు చేశా. ఇందులో రెండు వ్యవసాయ బోరుబావులు ఉన్నాయి. గత నెలరోజుల్లో రెండు బోరుబావుల్లో నీటి మట్టం పడిపోయింది. పొట్టదశ సమయంలో మూడెకరాలు పూర్తిగా ఎండిపోయింది. మిగిలిన రెండెకరాల్లో పంట పూర్తిగా చేతికొచ్చే పరిస్థితులు కనిపించడంలేదు. మాది మల్కపేట జలాశయం దిగువన కిలోమీటరు పరిధిలో ఉన్న గ్రామం. జలాశయంలో నీరు నింపితే చుట్టూ ఉన్న గ్రామాల్లో భూగర్భజలాలు నిలకడగా ఉండే అవకాశం ఉంది. పొన్నం లింగం, రైతు వెంకట్రావుపేట, కోనరావుపేట మండలం

# బాల బడులు.. కనీస వసతులు కరవు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూ ర్‌లోని బీసీ కాలనీలో మూడో అంగన్‌వాడీ కేంద్రం ఇది. ఇందులో 18 మంది చిన్నారులు ఉండగా 8 మంది గర్భిణులు, ఆరుగురు బాలింతలు లబ్ధిపొందుతున్నారు. సొంత భవనం ఉంది. శౌచాలయం ఉన్నా దానికి నీటి సరఫరా లేదు. కనీసం పిల్లలు గొంతు తడుపుకునేం దుకైనా తాగునీరు మృగ్యమైంది. బయట ఉన్న ట్యాంకు నుంచి బిందెలతో నీళ్లు తీసుకొస్తే చిన్నారులు చేతులు శుభ్రపరచుకోవాల్సిన పరిస్థితి. విద్యుత్తు సౌకర్యం లేదు. ఎండలు, ఉక్కపోత పెరుగుతున్న దృష్ట్యా తన సొంత ఖర్చులతో విద్యుత్తు తీగలను అమర్చి, ఫ్యాన్‌కు మరమ్మతు చేయించేందుకు ఇప్పటికే ఎలక్ట్రీషియన్‌తో మాట్లాడినట్లు అంగన్‌వాడీ టీచర్ జి.లావణ్య తెలిపారు.

**చిన్నారులకు తప్పని ఇబ్బందులు**


మాతా శిశుసంరక్షణలో భాగంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడం, 0 నుంచి ఆరేళ్ల వయసున్న పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్య నేర్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తోంది. కాగా పలు కేంద్రాల్లో సమస్యలు తిష్ట వేశాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం(ఐసీడీఎస్)పరిధిలో మొత్తం 587 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. కొన్ని కేంద్రాలు సొంత భవనంలో నడుస్తుండగా మరికొన్ని అద్దె ఇళ్లు, పాఠశాలల గదుల్లో కొనసాగు తున్నాయి. అనేక కేంద్రాల్లో కనీస వసతులు మృగ్యమయ్యాయి. శౌచాలయాలు లేక చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. శౌచాలయాలున్న కేంద్రాల్లో నీటి సరఫరా లేకపోవడం వల్ల వాటిని వినియోగించుకోలేని దుస్థితి నెలకొంది. అనేక కేంద్రాల్లో విద్యుత్తు కనెక్షన్లు,



ఫ్యాన్లు లేకపోవడంతో ప్రస్తుత వేసవిలో ఇబ్బంది పడుతున్నారు. గ్రామపంచాయతీల నుంచి 15 శాతం బడ్జెట్‌ను కేటాయించి అంగన్‌వాడీ కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాల్సి ఉన్నా, పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు పట్టించుకోవడం లేదు. జిల్లాలోని వేములవాడ, సిరిసిల్ల ఐసీడీఎస్ పరిధిలోని కేంద్రాల్లో 6 మాసాల నుంచి 3 సంవత్సరాల వయసు చిన్నారులు 18,838 మంది, 4020 మంది గర్భిణులు, 2533 మంది బాలింతలు, 15,374 మంది మూడు సంవత్సరాల నుంచి ఆరేళ్ల వయసున్న పిల్లలు లబ్ధిపొందుతున్నారు.

**సౌకర్యాలు కల్పించాలి** అంగన్‌వాడీ కేంద్రానికి పగటిపూట వెళుతున్నాం. అక్కడ శౌచాలయం నిరుపయోగంగా ఉంది. ఫ్యాన్ నడవకపోవడంతో ఉక్కపోతతో ఇబ్బందిగా ఉంది. ఎండ తీవ్రత పెరగడంతో చిన్నారులు సైతం అవస్థలు పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో స్వచ్ఛమైన తాగునీటిని అందుబాటులో ఉంచి మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి. వైష్ణవి, గర్భిణి, రాచర్ల బొప్పాపూర్

# జలం వృథా.. జరిమానా వాత



కరీంనగర్ : జిల్లాలోని పుర, నగరపాలికల్లో ఎండాకాలం వచ్చిందంటే తాగునీటికి కష్టాలు మొదలవుతున్నాయి. ఇళ్లలో ఉన్న బోరుబావుల్లో నీరు అడుగంటడంతో పురపాలికల నీటిపై ఆధారపడితే సరఫరాపై భారం పడుతుంది. ప్రధానంగా జిల్లా కేంద్రంలో దిగువ మానేరు జలాశయం నుంచి రావాటర్ తీసుకొని మిషన్ భగీరథ, నగరపాలిక నీటి శుద్ధి కేంద్రానికి పంపిస్తున్నారు. ఆ నీటిని ప్రస్తుతం దిగువకు వదులుతుండటంతో నీటిమట్టం కిందకు పడిపోయింది. గతేడాది ఇలాగే 13.5 టీఎంసీలు డ్యాంలో ఉన్నా రావాటర్ అందకపోవడంతో బూస్టర్ల ద్వారా పంపింగ్ చేసినా ఆశించిన స్థాయిలో అందలేదు. కొత్తగా వాల్వ్ వేయడంతో ఈ ఏడాది 13 టీఎంసీలకు చేరినా బూస్టర్లను నడిపించకుండానే నేరుగా నీటిని తీసుకుంటున్నారు. మరింత కిందికి వదిలితే మాత్రం సమస్యలు మొదలయ్యే ప్రమాదముంది.

నగరంలోని పలు డివిజన్లలో నీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడుతుండగా విలీన కాలనీల్లో గ్రామీణ మిషన్ భగీరథ సరఫరాతో నానావస్థలు పడుతున్నారు. గతంలో కలిసిన గ్రామాలతోపాటు ఇటీవల విలీనమైన గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్రంగా మారింది. బొమ్మకల్, దుర్శేడ్, చింతకుంట ప్రాంతాల్లో నల్లా నీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలనే డిమాండ్ పెరిగింది.

ఒకట్రెండు రిజర్వాయర్ల పరిధిలో రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేస్తుండగా, మిగతా ప్రాంతాల్లో నిత్యం సరఫరా అవుతోంది. తాగునీటి కోసం రక్షిత నీటిని పలు విధాలుగా శుద్ధి చేస్తున్నారు. అయితే కొందరు వాహనాలు శుభ్రం చేసేందుకు, ఇళ్లను కడిగేందుకు, పూల మొక్కలకు పట్టేందుకు నీటిని వాడుతున్నారు. భూగర్భజలాలు పడిపోతున్న తరుణంలో పొదుపు పాటిస్తే వేసవి నుంచి కొంత సమస్యలు తప్పించుకునే వీలుంటుంది.

**బెంగళూరు తరహాలో...**

బెంగళూర్‌లో తాగునీటిని ఇతర అవసరాలకు వాడుతూ దుర్వినియోగం చేస్తే రూ.5 వేలు జరిమానా వేసేందుకు అక్కడి జలమండలి ఉత్తర్వులు జారీ చేసింది. అదే తరహాలో మొదటిసారి కరీంనగర్ నగర పాలక సంస్థ తాగునీటిని వృథా చేస్తే రూ.500 జరిమానా విధించేందుకు సిద్ధమైంది. ఎక్కువ శాతం ఇళ్లల్లో బిరడాలు ఉండవు. కుళాయి నీరు వచ్చినప్పుడు వృథాగా మురుగుకాలువలో కలుస్తుంది. తాగేందుకు, అవసరాలకు వినియోగించే నీటి కంటే వృథా చేయడమే అధికంగా కనిపిస్తుందని అధికారులు గుర్తించారు. జరిమానా విధించడంతో శుద్ధనీటిని పొదుపుగా వాడుకుంటారనే అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తం చేశారు.

నగర పరిధిలో కుళాయిల సంఖ్య 52 వేలు

ప్రతి రోజు నీటి పంపిణీ 68 ఎంఎల్‌డీలు

'వేసవిలో తాగునీటికి ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూడాలి.. ఇప్పటి నుంచే అధికారులు తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలి.. రిజర్వాయర్ల వారీగా టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేసుకొని నిరంతరం నీటి సరఫరా తీరును గమనిస్తూ ఉండాలి. ఎప్పటికప్పుడు సాంకేతికపరంగా, లీకేజీలను గుర్తించి మరమ్మతు చేయాలి.' ఇటీవల నిర్వహించిన సమీక్షలో కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

# నిర్వహణ కొరవడి.. వనాలు మాయమై



జగిత్యాల : పల్లెలను హరిత గ్రామాలుగా మార్చడంతోపాటు ఆహ్లాదం కోసం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు నిర్వహణ లేమితో ఎండిపోతున్నాయి. జిల్లాలో 380 పంచాయతీలతోపాటు అనుబంధ గ్రామాలను కలుపుకొని 417 గ్రామాల్లో 421 ఎకరాల్లో పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేయగా, 57 ప్రాంతాల్లో కోతులకు ఆహార ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో బృహత్ పల్లె ప్రకృతి వనాలు 65 ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్య వజ్రోత్సవ ముగింపు వేడుకల్లో భాగంగా ప్రతి గ్రామానికి వేయి మొక్కల చొప్పున జిల్లా వ్యాప్తంగా 3.80 లక్షల మొక్కలను నాటారు. అలాగే 'మేరీ మిట్టి– మేరీ దేశ్'లో భాగంగా అమర జవాన్లు, దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన వారిని గౌరవించుకునేందుకు ప్రతి పంచాయతీలో 75 మొక్కలతో వనాలు ఏర్పాటు చేశారు. నిర్వహణ లేకపోవడంతో ఎక్కడా మొక్కలు పూర్తి స్థాయిలో కనిపించడంలేదు.

**ప్రజాధనం వృథా** మండలంలోని 18 పంచాయతీలలో పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేయగా ఒకట్రెండు మినహా ఎక్కడా వనాలు కనిపించడంలేదు. ప్రకృతి వనాలు ఏర్పాటు చేసిన సమయంలో ఆర్భాటంగా మొక్కలు నాటడమే కాకుండా పంచాయతీలు ప్రత్యేక శ్రద్ధ చూపడంతో పచ్చదనం కనిపించింది. ప్రస్తుతం పలు వనాల్లో మొక్కలు కూడా కనపడకుండా పోయాయి. ఒక్కో వనం పేరుతో రూ.లక్షల్లో ప్రజాధనం వృథా అయింది.

**పేరుకుపోతున్న చెత్తాచెదారం**

మండలంలోని గ్రామాల్లో లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనాలపై అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. ఎక్కడిచెత్త అక్కడే ఉంటుండడంతో పాటు నడక ట్రాకింగ్‌లు రూపు రేఖలు కోల్పోతున్నాయి. కొన్ని వనాల చుట్టూ ఏర్పాటు చేసిన హద్దులు విరిగి పోయాయి. వేసవి ప్రారంభం కావడంతో నీటిని అందించక పోవడంతో చెట్లు ఎండిపోతున్నాయి.

**నిధుల కొరత**

జగిత్యాల అర్బన్, గ్రామీణ మండలాల్లోని 34 గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. పంచాయతీల నిర్వహణ లేకపోవడంతో సగానికిపైగా వనాలు కనిపించకుండా పోయాయి. పంచాయతీలకు నిధుల కొరతతో నీరు అందించలేక ఎండిపోతున్నాయి.

**అధికారుల నిర్లక్ష్యం**

మండలంలోని 15 గ్రామపంచాయతీలలో ఉపాధిహామీ పథకంలో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. రెండేళ్ల కిందట వరకు నిర్వహణ బాధ్యతలను ఉపాధిహామీ ఆధ్వర్యంలో చేపట్టేవారు. తర్వాత నిర్వహణను గ్రామపంచాయతీలకు అప్పగించారు. గ్రామపంచాయతీలలో నిధుల కొరత, పంచాయతీ అధికారుల అలసత్వంతో పకృతి వనాలను పట్టించుకోవడం లేదు. దీంతో చాలాచోట్ల మొక్కలకు నీటిని పట్టకపోవడంతో ఎండిపోతున్నారు.

**గ్రామాలకు దూరంగా..**

మండలంలోని 23 పంచాయతీల పరిధిలో నిర్మించిన పల్లెప్రకృతి వనాలు నిరుపయోగంగా ఉంటున్నాయి. ఒబులాపూర్‌లో గ్రామానికి దూరంగా సోమేశ్వర ఫిల్టర్‌బెడ్‌లో ఏర్పాటుచేసిన పల్లెప్రకృతి వనం ఇప్పటికీ ఉపయోగించిన దాఖలాలు లేవు. మల్లాపూర్‌లో శ్మశానవాటిక కింద నిర్మించగా ఆటు వైపు ఎవరూ వెళ్లడంలేదు. సగానికి పైగా వనాలను గ్రామాలకు దూరంగా నిర్మించడంతో ఉపయోగంలోకి రాకుండా పోతున్నాయి.

# భవితకు మరింత భరోసా

భువనగిరి : ప్రత్యేక అవసరాలు కలిగిన 0–18 ఏళ్లలోపు వారికి ఆటపాటలతో విద్య అందించేందుకు ప్రభుత్వం విలీన విద్యా వనరుల (భవిత) కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. పాఠశాల స్థాయి వయసు కలిగిన వారికి భవిత కేంద్రాల్లో, 15 ఏళు పైబడ్డ వారికి కళాశాలల్లో ప్రత్యేక తరగతులు బోధిస్తున్నారు. విద్యాబుద్ధులు నేర్పించడం, మాట్లాడటం, నడిపించడం వంటి వాటితోపాటు వారిని శారీరకంగా మానసికంగా ఆరోగ్యవంతంగా మార్చేందుకు కృషి జరుగుతోంది. ఇందుకోసం నిపుణులను మండలానికి ఒకరిని చొప్పున నియమించి సెంటర్లు నిర్వహిస్తున్నారు. ఇందుకు అవసరమైన సామగ్రి, తదితర వాటిని అప్పట్లో కొంతమేర సమకూర్చారు. అయితే సుమారు 10 ఏళ్ల తరువాత తాజాగా నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా ఉన్నతాధికారులు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపిక చేసిన వాటిలో సొంత భవనాలు కలిగిన వాటికి వివిధ పరికరాల కోసం ఒక్కో కేంద్రానికి రూ.2లక్షల చొప్పున కేటాయించింది.

**పరికరాల కొనుగోలు..**

ప్రభుత్వ నిర్ణయంతో యాదాద్రి భువనగిరి జిల్లాలోని అయిదు కేంద్రాలకు రూ.10 లక్షలు విలువ చేసే సామగ్రి అందుబాటులోకి రానుంది. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధనోపకరణాలు, ఐఈఆర్పీలకు కుర్చీలు, చికిత్స అందించే బల్లలు, మసాజ్ బాల్, డంబుల్స్, రౌండ్‌టేబుల్, అల్మారాలు తదితర 115 రకాల వాటిని సమకూర్చేలా మార్గనిర్దేశం చేశారు. ఈ నిధులతో ఎంఈవో, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, భవిత కేంద్రం అనుసంధానంగా ఉన్న పాఠశాల ప్రధానోపాధ్యాయుల కమిటీ నేతృత్వంలో వీటిని సమకూర్చనున్నారు.

జిల్లాలోని ఐదు భవిత కేంద్రాలకు ఆయా పరికరాల కొనుగోలుకు రూ.2లక్షల చొప్పున మంజూరు కావడంతో రానున్న రోజుల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఆటపాటల విద్యా సహకారం మరింత మెరుగయ్యే అవకాశం ఉంటుందని జిల్లా సహిత విద్య సమన్వయకర్త పెసరు లింగారెడ్డి కు తెలిపారు.

కేంద్రాల వివరాలు..


ఆలేరు, భువనగిరి, చౌటుప్పల్, మోత్కూరు, రామన్నపేట

# సేవలు చేరువయ్యేలా..!

భువనగిరి : ఉమ్మడి జిల్లాలో పోలీస్‌శాఖలో మార్పులు చేర్పులకు ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. జనాభాకు అనుగుణంగా నూతన ఠాణాల ఏర్పాటు జరుగుతుందని భావించినా.. జాప్యం నెలకొనే అవకాశం కన్పిస్తోంది. ప్రస్తుతానికి కొన్ని పోలీస్‌స్టేషన్ల స్థాయి (అప్‌గ్రేడ్) పెంపుతో పాటు అద్దె భవనాలు, శిథిలావస్థలో ఉన్న వాటి స్థానాల్లో కొత్తవాటిని నిర్మాణం చేపట్టడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. స్థాయి పెంపు మూలంగా ఆయా స్టేషన్లలో ఎస్సైలు, కింది స్థాయి సిబ్బంది సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

**నల్గొండ జిల్లాలో..**

ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత జిల్లాలో పురపాలికలు స్థాయి పెంపుతో పాటు మండలాల్లో మార్పులు చేర్పులు చేయడంతో కొన్ని ప్రాంతాల్లో ఇబ్బందులు తప్పడం లేదు. ఉదాహరణకు నల్గొండ సబ్‌డివిజన్‌లో కనగల్ మండలంలోని గ్రామాలకు జి.చెన్నారం, తొరగల్‌ను నల్గొండ మండలంలో కలిపారు. వీరు ఎమ్మార్వో, ఎంపీడీవో ఇతర పనులకు నల్గొండ మండల అధికారులను కలవాలి. పోలీస్‌స్టేషన్ పనులకు కనగల్ వెళ్లాల్సి వస్తోంది. తిప్పర్తి మండలం చిన్నసూరారం, పెద్ద సూరారం, ఖాజీరామారం గ్రామాలు నల్గొండ మండలంలో కలిపారు. మరో గ్రామపంచాయతీ కేశరాజుపల్లిని నల్గొండ మున్సిపాలిటీలో కలిపారు. వీరు రెవెన్యూ, ఇతర అభివృద్ధి పనులు, సమస్యలకు నల్గొండ



మండలం, పురపాలికకు వెళ్లాలి. పోలీస్‌స్టేషన్ పనులకు మాత్రం తిప్పర్తికి వెళ్లాల్సి వస్తోంది. నల్గొండ మండలంలోని చర్లపల్లి, దండెంపల్లి, శేషమ్మగూడెం, మర్రిగూడ, ఆర్జాలబావి, పానగల్ గ్రామాలు మున్సిపాలిటీలో కలిపారు. పోలీస్‌స్టేషన్ పనులకు మాత్రం నల్గొండ రూరల్ స్టేషన్‌ను సంప్రదించాల్సి వస్తోంది. దీంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**కొంత మార్పు...** జిల్లాలో ప్రస్తుతం ఉన్న 36 పోలీస్‌స్టేషన్లకు మరో ఆరు పెంచితే జనాభాకు అనుగుణంగా ఉంటుందని పోలీస్ అధికారులు చెబుతున్నారు. తాజాగా ప్రభుత్వ నిర్ణయంతో అడవిదేవుల పల్లి, మాడ్గులపల్లి, గట్టుప్పల, మిర్యాలగూడ రూరల్, నిడమనూరు పోలీస్‌స్టేషన్లలో స్థాయి పెంపుతో పాటు నూతన భవనాలు ఏర్పాటు చేసే అవకాశాలున్నాయి. మిర్యాలగూడ, దేవరకొండ ప్రాంతాల్లో నూతనంగా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల ఏర్పాటు జరుగుతున్నట్లు తెలుస్తోంది.


**యాదాద్రి భువనగిరి**

జిల్లాలో ప్రస్తుతం 22 పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. మరో నాలుగు ఠాణాలు అవసరమని అధికారులంటున్నారు. నూతన పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుకు రాయగిరి, యాదగిరిగుట్ట టెంపుల్ సిటీ ప్రాంతాల్లో ఏర్పాటుకు ఇప్పటికే అధికారులు నివేదికలు పంపారు. ఆయా ప్రాంతాల్లో సొంత భవనాలు లేని కారణంగా అద్దె వాటిల్లో నిర్వహణకు కసరత్తులు చేస్తున్నారు. వలిగొండ, పోచంపల్లి, ఆలేరు స్టేషన్ల స్థాయి పెంపునకు ప్రతిపాదనలు పంపారు. చౌటుప్పల్, దండుమల్కాపురంలో ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

**సూర్యాపేట జిల్లాలో..** ప్రస్తుతం ఉన్న 26 ఠాణాలకు మరో మూడు ఏర్పాటు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. మహిళా పోలీస్‌స్టేషన్ లేని కారణంగా ఆయా స్టేషన్లలో ఫిర్యాదులు చెప్పుకోవడానికి బాధితులు ఇబ్బంది పడుతున్నారు. నూతనంగా సూర్యాపేట రూరల్, సూర్యాపేట టౌన్, తిరుమలగిరి, నేరేడుచర్ల, హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్లను స్థాయి పెంచడానికి పోలీస్ అధికారులు నివేదికను రాష్ట్ర కార్యాలయానికి పంపించారు. వీటిపై త్వరలోనే పూర్తిస్థాయిలో స్పష్టత రానుంది.

# పట్టణంలో.. పచ్చదనం లేదాయె..!

నకిరేకల్ : పురపాలక సంఘం అధికారులకు ముందుచూపు లేకపోవడంతో పట్టణ ప్రజలు పచ్చదనానికి దూరమయ్యారు. నకిరేకల్ పురపాలికలోని ప్రధాన రహదారి (పాత జాతీయ రహదారి) విస్తరణ పనులు రెండున్నరేళ్లుగా సాగుతూనే ఉన్నాయి. టీయూఎఫ్‌ఐడీసీ నుంచి మొదటగా రూ.26 కోట్లు, ఆ తర్వాత రూ.6.94 కోట్లను రుణ ప్రాతిపదికన తీసుకుని 4.5 కి.మీ. పొడవునా రహదారి విస్తరణ, సుందరీకరణ పనులు చేపట్టారు. రోడ్డు మధ్యలో విభాగిని నిర్మించి వీధి దీపాలను ఏర్పాటు చేశారు. దారి పొడవునా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాల్సి ఉంది. ఈ పనిని మాత్రం విస్మరించారు. నాడు రూపొందించిన విస్తరణ పనుల డిజైన్‌లో గుత్తేదారు మొక్కలు పెంచి అప్పగించే అంశం లేదు. రూ.32.94 కోట్లతో చేపట్టిన ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో ఇప్పటి వరకు రూ.19 కోట్లు ఖర్చుచేశారు. ఇన్ని కోట్లు వ్యయం చేసినా.. విభాగిని మధ్యలో పచ్చదనం లేకుండా పోయింది. పుర నిధులతోనే డివైడర్లపై మొక్కలు పెంచాల్సి ఉంటుంది.



ప్రస్తుతం అన్ని నిధులు పురపాలిక వద్ద లేవని అధికారులు అంటున్నారు. ప్రజాప్రతినిధులు వారి కోటా నుంచి నిధులిస్తేనే నకిరేకల్ పట్టణ ప్రజలకు పచ్చదనం భాగ్యం కలగనుంది. ఈ రోడ్డు విస్తరణ పనుల కోసం 4.5 కి.మీ. మేర రహదారికి ఇరువైపులా 70 ఏళ్ల నుంచి ఉన్న 95 పెద్ద వృక్షాలను పూర్తిగా తొలగించారు. ఒక్క చెట్టు తొలగిస్తే దాని స్థానంలో ఐదు చెట్లను పెంచాలన్న అటవీశాఖ నిబంధనలను కూడా ఇక్కడ పాటించడం లేదు. కొత్తగా నిర్మించిన విభాగినిపై మొక్కలు పెంచి పచ్చదనంగా మార్చేందుకు రూ.15 లక్షలకు పైగా వ్యయమవుతాయని పుర ప్రజారోగ్య ఇంజినీరు గౌతమ్‌రాజ్ తెలిపారు. నాటి అగ్రిమెంట్‌లో గుత్తేదారు మొక్కలు పెంచే అంశం లేదన్నారు. నిధుల కోసం ప్రతిపాదనలు రూపొందిస్తున్నామని వివరించారు.

# వస్త్ర పరిశ్రమ ప్రగతికి 'ముద్ర'

సిరిసిల్ల: వస్త్రోత్పత్తుల్లో ఆధునికతను అందిపుచ్చుకుంటేనే మనుగడ. జిల్లాలో అత్యధికంగా మరమగ్గాలు విస్తరించి ఉన్నాయి. తీసుకున్న ఆర్డర్లకు.. మరమగ్గాల ఆధునికీకరణకు పెట్టుబడుల కోసం ఆసాములు, కార్మికుల వద్ద డబ్బులులేక నేటికీ మూస ధోరణిలోనే వెళుతున్నారు. ఈ పరిస్థితి నుంచి గట్టెక్కించేందుకు ప్రధానమంత్రి ముద్ర (మైక్రో యూనిట్స్ డెవలప్ మెంట్ అండ్ రీఫైనాన్స్ ఏజెన్సీ) యోజన పథకం కింద మరమగ్గాల విస్తరణ, అభివృద్ధి కోసం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా నేతృత్వంలో రుణాల మంజూరుకు చేనేత జౌళి శాఖ ప్రణాళిక రూపొందించింది. జిల్లాలోని బ్యాంకర్లు, అధికారులతో జనవరిలో విస్తృత స్థాయి సమావేశం జరిగింది. దీనిలో లీడ్ బ్యాంకుతో పాటు వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు. దరఖాస్తుల పరిశీలన తర్వాత బ్యాంకుల లక్ష్యం మేరకు రుణాలు మంజూరు చేసేందుకు బ్యాంకర్లు అంగీకరించారు.

కొత్త మరమగ్గాలతో యూనిట్ల ఆధునికీకరణ, వస్త్రోత్పత్తులకు ముడి సరకుల కొనుగోలుకు రుణాలు మంజూరు చేయనున్నారు. ముద్ర పథకం కింద రుణాలు పొందేవారు సంబంధిత ధ్రువపత్రాలు సమర్పిస్తున్నారు. మద్రలో శిశు పథకంలో రూ.50వేల లోపు, కిషోర్‌లో రూ.50 వేల నుంచి రూ.5లక్షల వరకు. తరుణ్‌లో రూ.5లక్షల నుంచి రూ.10 లక్షల వరకు రుణం పొందే వీలుంది.

మరమగ్గాలు, వాటి విడిభాగాలు కొనుగోలు చేసేవారు తయారీ సంస్థల నుంచి యూనిట్ వ్యయం సమర్పించాలి. పెట్టుబడుల కోసమైతే బ్యాంకు కేవైసీ, పాన్‌కార్డును సమర్పించాలి. ఆదాయపన్ను చెల్లించే వారు వాటికి సంబంధించిన పత్రాలు జత చేయాలి. ధ్రువపత్రాల పరిశీలన పూర్తయ్యాక మరోసారి బ్యాంకర్లతో సమావేశం నిర్వహిస్తారు. దీనిలో ఏ బ్యాంకు ఎన్ని యూనిట్లు మంజూరు చేస్తుందనే లక్ష్యం నిర్ణయించనున్నారు. ఇప్పటికే చేనేత, జౌళిశాఖ కార్మికులు, ఆసాముల నుంచి 820 దరఖాస్తులు వచ్చాయి. క్షేత్రస్థాయిలో వీటి పరిశీలన జరుగుతోంది. ఈ నేపథ్యంలో ముద్ర పథకం పూర్తిస్థాయిలో అమలైతే పరిశ్రమకు మేలు జరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ఇంటి నంబర్లు సృష్టించి.. రిజిస్ట్రేషన్ చేయించి

హైదరాబాద్ :శంషాబాద్ విమానాశ్రయం రన్‌వే సమీపంలో ప్రభుత్వ ఎసైన్డ్ భూములపై కొందరు అక్రమార్కులు కన్నేశారు. ఎసైన్డ్‌దారులను బెదిరించి.. కొంత మొత్తం చేతుల్లో పెట్టేసి సంతకాలు చేయించుకొని తరిమేస్తున్నారు. అనంతరం ప్లాట్లుగా మార్చి రేకుల షెడ్లు నిర్మించి దొడ్డిదారిన ఇంటి నంబర్లు తెచ్చుకుంటున్నారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని గొల్లపల్లి రెవెన్యూ నంబర్లు 219, 220, 221లోని 18.23 ఎకరాల భూములను పట్టాదారు ఎండీ.అబ్దుల్ రషీద్ వద్ద 1987లో అప్పటి ప్రభుత్వం రూ.1,85,75 0లకు కొనుగోలు చేసింది. గొల్లపల్లికి చెందిన కార్మికులకు జీవనోపాధి కోసం 17 గుంటల చొప్పున 42 మందికి పంపిణీ చేసింది. అప్పటినుంచి ఆ భూముల్లో ఉంటున్నారు. వీటికి సమీపంలోనే శంషాబాద్ విమానాశ్రయం రావడంతో అక్రమార్కుల కన్ను వాటిపై



పడింది. రెండు మూడేళ్ల నుంచి ముగ్గురు మాజీ ప్రజాప్రతినిధులు, స్థిరాస్తి వ్యాపారులు ఎసైన్డ్ భూములను ఎకరాల్లో కొనుగోలు చేయడం మొదలుపెట్టారు. భూములు విక్రయించమని చెప్పినా.. సర్కారు వెనక్కి తీసుకుంటుందని భయపెట్టి వారికి రూ.లక్షల్లో డబ్బులిచ్చి వెంచర్లు వేసేంత వరకూ ఇక్కడే ఉండాలని చెబుతున్నారు.

**నిషేధిత జాబితాలో చేర్చినా..**

గొల్లపల్లి కార్మికులకు ఇచ్చిన భూములను వారు కూడా విక్రయించకుండా ప్రభుత్వం 18.23 ఎకరాల భూములను నిషేధిత జాబితాలో చేర్చింది. ప్రస్తుతం ఇవి 'ఖరీజ్ ఖాతా' విభాగంలో ఉన్నాయి. కార్మికుల నుంచి కొనుగోలు చేసి ఇతరులకు విక్రయించినా వారి పేర్లమీద రిజిస్ట్రేషన్ కావు. అందుకే అక్రమార్కులు ఇంటి నంబర్లతో మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. వెయ్యి గజాల్లో ఇల్లు కట్టుకున్నామంటూ శంషాబాద్ మున్సిపాలిటీ అధికారులకు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇంటి నంబరు రాగానే నేరుగా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లి తమ అనుచరుల పేర్లతో రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. అక్రమార్కులు ఇప్పటి వరకూ సొంతం చేసుకున్న భూముల విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.300 కోట్ల వరకు ఉంటుందని అంచనా.

# పక్కన చేరి.. కలిపేసుకొని

కుత్బుల్లాపూర్ : అక్రమ లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్)కు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిన నేపథ్యంలో వాటిలోని ప్రభుత్వ స్థలాల పరిస్థితి ఏమిటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. కొందరు ప్రైవేటు పట్టాభూముల్లో లేఅవుట్లు చేసేటప్పుడు సర్కార్ స్థలాలను కలుపుకొని ప్లాట్లు చేసి విక్రయించారు. ఎల్ఆర్ఎస్ పథకం అమలుకు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఆయా లేఅవుట్లలోని ప్లాట్లు ప్రభుత్వ సర్వే నంబరులో లేవని రెవెన్యూ అధికారులు నిర్ధారించాల్సి ఉంటుంది.

**రూ.476 కోట్ల విలువ చేసే భూముల ఆక్రమణ**

గాజులరామారం సర్కిల్‌లో రెండు దశాబ్దాలుగా కొందరు వ్యక్తులు ప్రైవేట్ వెంచర్ల మాటున కొనసాగించిన కబ్జాకాండతో రూ.476.4 కోట్ల 17.4 ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయి. నిబంధనలప్రకారం ప్రైవేట్ పట్టా భూమిని లేఅవుట్ చేయాల్సివస్తే.. అందులో 2.5శాతం భూమిని సామాజిక అవసరాలకు..7.5 శాతం ఉద్యానాలకు.. 30 శాతం స్థలం రోడ్లకు కేటాయించాల్సి ఉంటుంది. కానీ కొందరు పథకంప్రకారం ప్రభుత్వ భూముల పక్కన ప్రైవేట్ పట్టా భూములను కొనుగోలుచేసి.. సర్కార్ స్థలాలనూ కలిపేసుకున్నారు. పాతతేదీలతో గ్రామ పంచాయతీ లేఅవుట్లు (అక్రమ లేఅవుట్లు) సృష్టించి ప్లాట్లవిక్రయానికి శ్రీకారం చుట్టారు. ఈ తరహా లేఅవుట్లలో చాలా వరకు ప్లాట్లు ఎల్ఆర్ఎస్ కింద క్రమబద్ధీకరణకు నోచుకోదని సమాచారం.

**ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు-మల్లికార్జున్‌రావు, డిప్యూటీ తహసీల్దార్, కుత్బుల్లాపూర్** కొందరు తమ లేఅవుట్లలో కలుపుకొని ప్లాట్లు చేసి విక్రయించినట్లు ఒకరు జాతీయ హరిత ట్రైబ్యునల్‌ను ఆశ్రయించాడు. ప్రస్తుతం ఈ భూముల్లో సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేస్తేనే అక్కడి సర్కార్ స్థలాల వివరాలు తెలిసే అవకాశం ఉంది. ఎల్ఆర్ఎస్ పథకం మార్గదర్శకాలు అందాక ప్రభుత్వ ఆదేశాల మేరకు సంబంధిత లేఅవుట్లపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

# మొదటి గంటే.. కీలకం

కరీంనగర్ : కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో సైబర్ నేరగాళ్లు చెలరేగిపోతున్నారు. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని ఓటీపీ చెప్పాలని, బహుమతి గెలుచుకున్నారు.. చూడాలంటే క్లిక్ చేయాలని, మీ ఖాతాల్లో డబ్బులు పంపించామని చూసుకోమని.. ఇలా అనేక రకాలుగా మోసగించి రూ.కోట్లు దోచేస్తున్నారు. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. అవగాహన లేని వారే కాదు.. విద్యావంతులూ మోసపోతుండటం గమనార్హం. సైబర్ నేరగాళ్ల బారిన పడినప్పుడు గంటలోపు మేల్కొంటే సాధ్యమైనంత వరకు ప్రమాదం నుంచి బయటపడవచ్చని కరీంనగర్ సైబర్ క్రైం పోలీసుస్టేషన్ ఏసీపీ నరసింహారెడ్డి సూచించారు. ఆలోపు నేరగాళ్లు డబ్బులు డ్రా చేసుకుంటే మాత్రం.. తిరిగి రప్పించడం కష్టమవుతుందన్నారు.ఇలా చేయండి..%htps:cybercrime.gov.in% పోర్టల్‌ను క్లిక్ చేయాలి. హోం పేజీలోకి వెళ్లి ఫైల్ ఏ కంప్లైంట్ ఆప్షన్‌పై క్లిక్ చేస్తే అక్కడ కొన్ని నియమ, నిబంధనలు, సూచనలు చదవాలి.

రిపోర్ట్ అదర్ సైబర్ క్రైం బటన్‌పై క్లిక్ చేయాలి. తర్వాత సిటిజన్ లాగిన్ ఆప్షన్ సెలెక్ట్ చేసి పేరు, ఫోన్ నంబర్, ఈ-మెయిల్ తదితరాలు నమోదు చేయాలి.

రిజిస్టరు మొబైల్ నంబరుకు ఓటీపీ వస్తుంది. ఓటీపీ నమోదు చేసి క్యాప్చర్ కోడ్ పొందుపరిచి మీట నొక్కాలి.

తర్వాత పేజీలోకి వెళ్తుంది. నేరం గురించి క్లుప్తంగా వివరించాలి. అక్కడ సెక్షన్లుగా విభజించి ఉంటుంది. సాధారణ సమాచారం, సైబర్ నేరానికి సంబంధించి సమాచారం, ప్రివ్యూ అని ఉంటాయి.

ప్రతి సెక్షన్‌లో అడిగిన వివరాలు నమోదు చేస్తూ ప్రక్రియ పూర్తి చేయాలి. మూడు సెక్షన్లు పూర్తయ్యాక ప్రివ్యూ పరిశీలించాలి.

అన్ని వివరాలు సక్రమంగా ఉంటే సబ్మిట్ బటన్ నొక్కాలి. తర్వాత ఘటన ఎలా జరిగిందో వివరించాలి. నేరానికి సంబంధించిన స్క్రీన్ షాట్లు (ఖాతా లావాదేవీలు) వంటి ఆధారాలు, సాక్ష్యాలు అందులో పొందుపరచాలి.

అన్ని మరోసారి పరిశీలించి సబ్మిట్ బటన్ నొక్కితే కన్ఫర్మేషన్ సమాచారం వస్తుంది. కంప్లైంట్ ఐడీతోపాటు ఇతర వివరాలు ఈ-మెయిల్ ఐడీకి వస్తాయి. ఆ తర్వాత అధికారులు దర్యాప్తు ప్రారంభిస్తారు. ఫిర్యాదు చేయడం ఆలస్యమైతే దుండగులు వేర్వేరు ఖాతాల్లోకి నగదు బదిలీ చేస్తారు. లేకుంటే క్రిప్టోకరెన్సీగా ఆపై డాలర్లుగా మార్చుకునే అవకాశం ఉంటుంది.

**వెంటనే 1930కి ఫోన్ చేస్తే..**

1930 కాల్ సెంటర్‌కు బ్యాంకుల రిస్క్ మేనేజ్‌మెంట్ బృందాలు అనుసంధానమై ఉంటాయి. సైబర్ నేరాలకు సంబంధించిన సమాచారం అందిన వెంటనే వారు స్పందించి చర్యలు తీసుకుంటారు. బ్యాంకు ఖాతాల నుంచి సైబర్ నేరగాళ్ల డబ్బులను ఎక్కడికి మళ్లించుకుంటున్నారో గుర్తించి ఆ ఖాతాలను వెంటనే ఫ్రీజ్ చేస్తారు. డబ్బు డ్రా చేసుకునే అవకాశం లేకుండా కట్టడి చేస్తారు.

డబ్బు పోగొట్టుకున్న బాధితులు ఆలస్యం చేయకుండా గంటలోపు ఫిర్యాదు చేస్తే సొమ్ము రికవరీ చేయడం లేదా నేరగాళ్లు నగదు మళ్లించుకునే అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటారు.

# మారుదామా.. దిల్లీలా మార్చేద్దామా?



హైదరాబాద్: దేశ రాజధాని దిల్లీలో 15 ఏళ్లు దాటిన వాహనాలకు మార్చి 31 తరువాత బంకుల్లో ఇంధనం పోయకూడదంటూ కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆ రాష్ట్ర పర్యావరణ శాఖ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా అధికారులను ఆదేశించారు. బంకుల్లో ప్రత్యేకంగా రూపొందించిన పరికరాలతో కాలం చెల్లిన వాహనాలను గుర్తిస్తారు. కాలుష్య కోరల నుంచి దిల్లీని బయటపడేయడానికి తీసుకుంటున్న చర్యల్లో భాగమే ఇదంతా. అక్కడ గాలి నాణ్యత పడిపోతుండటంతో కాలుష్య కట్టడికి కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. దీనికి ప్రధాన కారణం కాలం చెల్లిన పెట్రోల్, డీజిల్ వాహనాల నుంచి వెలువడే కర్బన ఉద్గారాలేనని అధికారులు నిర్ధారణకు వచ్చారు. మన మహా నగరం కూడా అప్రమత్తం కావాల్సిన అవసరాన్ని సూచిస్తోంది. రోజురోజుకూ కాలుష్యం పెరిగిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో కాలం చెల్లిన వాహనాల విషయంలోనూ దిల్లీ బాట పట్టాల్సిన అవసరం ఉంది.సాధారణంగా వాయు నాణ్యత సూచీ 100లోపు ఉంటేనే స్వచ్ఛమైన గాలి పీలుస్తున్నట్లు. గ్రేటర్ పరిధిలో 150 వరకు చేరుకుంటుంది. ఏటా కాలం చెల్లిన వాహనాలు పెరుగుతూ ఉన్నాయి.


హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో జనవరి నాటికి 84లక్షల వాహనాలుంటే.. అందులో కాలం చెల్లినవే 24.40లక్షలు.

వ్యక్తిగత వాహనాలు రిజిస్ట్రేషన్ చేసుకున్నప్పటి నుంచి 15 ఏళ్లు, వాణిజ్య వాహనాలు ఏడేళ్లు దాటితే కాలం చెల్లినవిగా కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ పరిగణిస్తుంది.

తుక్కు చేస్తే రాయితీలు

కాలం చెల్లిన వాహనాలను తుక్కుగామార్చి.. అలాంటి వాహనాలనే కొనుగోలు చేసే వారికి రాష్ట్రప్రభుత్వం ప్రోత్సాహకాలు ప్రకటించింది. ద్విచక్రవాహనాల నుంచి భారీ వాహనాల వరకు తుక్కుగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం మూడు కేంద్రాలను మంజూరు చేసింది. కాలుష్య కారక వాహనాలను తగ్గించి విద్యుత్తు వాహనాల వినియోగం పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాహనాలను తుక్కుగా మార్చుకుని అదే విభాగానికి చెందిన వాహనాన్ని కొనుగోలు చేస్తే జీవితకాల పన్నులో కొద్ది మొత్తాన్ని రాయితీగా ఇస్తుంది.

# నిర్మించుకోండి.. ఆకాశ నడక మార్గాలు



హైదరాబాద్: నగరంలో ట్రాఫిక్ సమస్యతో పాటు కాలుష్యాన్ని తగ్గించేలా ప్రైవేటు వాహనాల సంఖ్యను తగ్గించడానికి ప్రజా రవాణా వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా మెట్రో స్టేషన్ల నుంచి వాటి సమీపంలోని వాణిజ్య భవనాలు, నివాస సముదాయాలకు ఆకాశ నడక మార్గాలు (స్కైవాక్) నిర్మాణాలను ప్రోత్సహించాలని మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌లు ఇటీవల జరిగిన కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్రణాళిక సమావేశంలో నిర్ణయించారు. ఈ వివరాలను మెట్రోరైలు సంస్థ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించింది.

**ఇప్పటికే అందుబాటులో..**

పంజాగుట్ట, హైటెక్‌సిటీ, ఎర్రమంజిల్ మెట్రో స్టేషన్ల నుంచి సమీపంలోని మాల్స్‌కు ఇప్పటికే ఎల్ అండ్ టీ మెట్రోరైలు సంస్థ స్కైవాక్‌లను నిర్మించింది. జేబీఎస్, పరేడ్ గ్రౌండ్స్ స్టేషన్లను కలుపుతూ రహదారి దాటే అవసరం లేకుండా అందుబాటులోకి తీసుకొచ్చారు. సికింద్రాబాద్ మెట్రో స్టేషన్ నుంచి సమీపంలోని రేతిఫైల్ బస్టాండ్, రైల్వే స్టేషన్ చేరుకునేలా స్కైవాక్ ఉంది. ఉప్పల్ మెట్రో స్టేషన్‌కు అనుసంధానంగా కూడలిలో వలయాకారంలో ఆకాశ నడక మార్గాన్ని హెచ్ఎండీఏ నిర్మించింది.

**ప్రతి స్టేషన్ పాదచారుల వంతెనే**

మెట్రో మొదటి దశలోని 69.2 కి.మీ. మార్గంలోని మొత్తం 57 మెట్రో స్టేషన్లలో...ప్రతి స్టేషన్ నుంచి రహదారికి ఒకవైపు నుంచి మరోవైపునకు చేరుకునేందుకు అవకాశం ఉందని ప్రయాణికులే కాదు.. ఇతరులూ వినియోగించుకోవచ్చని మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు.

**త్వరలో సాకారం..**

ఎల్బీనగర్ మెట్రో స్టేషన్ పక్కనే వాసవీ ఆనంద నిలయం పేరుతో భారీ గేటెడ్ కమ్యూనిటీ నిర్మిస్తున్నారు. తమ నివాస సముదాయానికి మెట్రో స్టేషన్ నుంచి ఆకాశ నడక మార్గం నిర్మాణానికి ముందుకొచ్చింది. ఇదే విధంగా మరికొన్ని సంస్థలు నాగోల్, స్టేడియం, దుర్గం చెరువు, కూకట్‌పల్లి మెట్రో స్టేషన్ల నుంచి ఈ తరహా స్కైవాక్‌ల ఏర్పాటుకు తమతో చర్చలు జరుపుతున్నాయని ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో ఎండీ కేవీబీరెడ్డి తెలిపారు. ఆసక్తి ఉన్న ప్రైవేటు సంస్థలు ఎల్ అండ్ టీ మెట్రోరైలు స్టేషన్ రిటైల్ అధికారి కె.వి.నాగేంద్ర ప్రసాద్ 99000 93820 ను సంప్రదించవచ్చని సూచించారు.

**రైలు దిగి కార్యాలయంలోకే..**

రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి సమీపంలోని మైండ్‌స్పేస్ ఐటీ పార్క్‌కు రహేజా సంస్థ స్కైవాక్ ఏర్పాటు చేసింది. ఇది ఐటీ ఉద్యోగులకు సౌకర్యంగా మారింది. బాలానగర్ స్టేషన్ నుంచి సమీపంలో నిర్మాణంలో ఉన్న ఫినిక్స్/ల్యాండ్ మార్క్ మాల్‌కు అనుసంధానంగా ఆ సంస్థ స్కైవాక్ అందుబాటులోకి తెచ్చింది.

# అర్హత ఉన్నా అందని రేషన్ కార్డులు

హైదరాబాద్: నగరంలో రేషన్ కార్డుల పంపిణీపై అయోమయ పరిస్థితి తొలగడంలేదు. ఈనెల ఒకటో తేదీ నుంచి కార్డుల పంపిణీకి అధికార యంత్రాంగం సన్నద్ధమైనట్లు ప్రకటించినా మొదలుకాలేదు. నగరంలో అయిదు లక్షల మందికి పైగా కొత్త కార్డుల కోసం దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం 83 వేల మందిని ప్రాథమికంగా అర్హులుగా గుర్తించింది. వార్డుసభలను నిర్వహించి వీరిలో 60 వేల మందిని లబ్ధిదారులుగా ఎంపికచేసి కార్డుల పంపిణీకి పౌరసరఫరాల శాఖ సిద్ధమైంది. మరోసారి మీసేవా కేంద్రాల ద్వారా కార్డుల పంపిణీకి దరఖాస్తులు స్వీకరించడంతో పాటు కొత్త రేషన్ కార్డుల పంపిణీ నిరంతర కార్యక్రమంగా ప్రకటించడంతో గతంలో దరఖాస్తు చేసుకోనివారు పలువురు కార్డుల కోసం దరఖాస్తులు అందజేశారు. రెండోసారి మీసేవా కేంద్రాల్లో 1.3 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. మొదటి దశలో జీహెచ్ఎంసీ పరిధిలో వార్డుసభలను నిర్వహించడంలో జరిగిన జాప్యంతో లబ్ధిదారులను ఖరారు చేయడంలో ఆలస్యం జరిగింది. ఇందిరమ్మ ఇళ్ల కోసం నిర్వహించిన వార్డు సభల్లోనే రేషన్ కార్డుల



అర్హులను గుర్తించారు. అర్హులైన పేదలు రాయితీతో గ్యాస్ సిలిండర్లు పొందే అవకాశం ఉంది. పేదలకు పలు విధాల ఉపయోగపడేలా ఉన్న కార్డుల పంపిణీ వాయిదాపడుతుండడంతో దరఖాస్తుదారులను ఆందోళనకు గురిచేస్తోంది.

# సాగు భిన్నం.. రాబడి నిత్యం

సుల్తానాబాద్: ఎలిగేడు మండలం లాలపల్లి గ్రామం కూరగాయల సాగులో ఆదర్శంగా నిలుస్తోంది. ఊరిలో దాదాపు 60 మంది రైతులుండగా వరి, పత్తి, మొక్కజొన్న వంటి పంటలు సాగు చేస్తూనే దాదాపు 30 ఎకరాల్లో కూరగాయలు పండిస్తున్నారు. పొలాలు, ఇళ్ల పరిసరాలు.. ఇలా ఎక్కడ కొద్దిపాటి ఖాళీ స్థలం దొరికినా టమాట, బీర, చిక్కుడు, మిర్చి, సొరకాయ, కాలీఫ్లవర్, క్యాబేజీ, వంకాయ, కాకర, అలసంత, ఉల్లి, వెల్లుల్లి, కొత్తిమీర, మెంతి తదితర కూరగాయల సాగు చేస్తున్నారు. నేరుగా సుల్తానాబాద్, పెద్దపల్లి, కరీంనగర్ మార్కెట్లకు తరలిస్తూ సొంతంగా విక్రయిస్తున్నారు.

**మిశ్రమ పంటల సాగు**

కాలానుగుణంగా పండే రకాలు సాగు చేస్తున్న లాలపల్లి రైతులు విపణిలో ధరలను అంచనా వేస్తూ మిశ్రమ రకాలు వేస్తున్నారు. ఒక రకానికి గిట్టుబాటు ధర లేకున్నా మరో రకంతో ఆ లోటు పూడ్చుకుంటున్నారు. ప్రస్తుతం టమాట టోకు ధర కిలోకు రూ.5 పలుకుతుండగా, బీరకాయ, మిర్చి ధర రూ.80 వరకుంటోంది. ఈ రెండు రకాలను ఏక కాలంలో సాగు చేస్తుండటంతో నష్టం లేకుండా చూసుకుంటున్నారు. ఎకరా విస్తీర్ణంలో సాగుకు దాదాపు రూ.20 వేలు పెట్టుబడి పెడుతుండగా మూడు నెలల పాటు దిగుబడి వస్తోంది. ఏడాది పొడవునా కూరగాయలు పండిస్తుండగా రోజువారీగా ఆదాయం వస్తోంది.

**ఆరు నెలల్లో రూ.3 లక్షల ఆదాయం**

గడ్డం రాజేశ్వర్‌రెడ్డి నాలుగు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. మరోవైపు ఒకటిన్నర ఎకరంలో మిర్చి, క్యాబేజీ, కాలీఫ్లవర్, కాకర, బీర పండిస్తున్నారు. కేవలం కూరగాయలతోనే ఆరు నెలల్లో దాదాపు రూ.3 లక్షల ఆదాయం వస్తోంది. కుమారుడు మధును సివిల్ ఇంజినీరింగ్ చదివించి లండన్‌కు పంపించారు. కూతురు మౌనికను ఎంబీఏ వరకు చదివించి వివాహం చేశారు.

**అవసరాలు తీరుతున్నాయి**

ముస్కు మహిపాల్‌రెడ్డి నాలుగు ఎకరాల్లో వరి, మొక్కజొన్న సాగు చేస్తూనే, ఎకరంలో క్యాబేజీ, కాలీఫ్లవర్, బీర సాగు చేస్తున్నారు. ప్రతి నెలా రూ.20 వేలు సంపాదిస్తుండగా పిల్లల చదువులకు, ఇంటి అవసరాలకు, పంట పెట్టుబడి ఖర్చులకు ఇబ్బంది లేకుండా మారిందని చెబుతున్నారు. ప్రభుత్వం రాయితీపై విత్తనాలు, పురుగుమందులు, పిచికారీ పరికరాలు అందించాలని కోరుతున్నారు.

# భద్రతకు ప్రాధాన్యం.. భవితకు సోపానం

కరీంనగర్ : ప్రజలు, కార్మికులు, ఇతరులు ప్రమాదాల బారిన పడకుండా ఉండాలంటే తగిన రక్షణ చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా పని ప్రదేశాల్లో కార్మికులు తగిన జాగ్రత్తలు పాటించాలి. చాలాచోట్ల ఇవి పక్కాగా అమలు కావడంలేదు. మార్చి 4 నుంచి 10వ తేదీ వరకు దేశవ్యాప్తంగా పరిశ్రమల్లో భద్రతా వారోత్సవాల పేరిట అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. నేడు జాతీయ భద్రతా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో ఎలాంటి పరిశ్రమలు ఉన్నాయి. కార్మికుల భద్రతకు ప్రభుత్వాలు ఎలాంటి చట్టాలు అమలు చేస్తున్నాయి. తదితర వివరాలతో కథనం.

**చేపట్టాల్సిన చర్యలు ఇలా...**

ప్రమాదకర పని ప్రదేశాల్లో యాజమాన్యాలు కార్మికులకు రక్షణ చర్యల గురించి అవగాహన కల్పించాలి. ఆ తర్వాతే పనిలో పెట్టుకోవాలి

ప్రతి క్వారీలో హెల్మెట్, షూస్, మాస్క్, సేఫ్టీ బెల్టు, తదితర రక్షణ చర్యలు పాటించాలి.

పని ప్రదేశంలో తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలి.

అగ్ని ప్రమాదాల రక్షణ చర్యలు పాటించాలి.

భవన నిర్మాణాల రంగ కార్మికులకు హెల్మెట్, షూస్, మాస్క్‌తోపాటు ఇతర రక్షణ పరికరాలను అందుబాటులో ఉంచాలి. ప్రైవేవీ చాలా చోట్ల పాటించడంలేదు.

ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్, కారు డ్రైవరు సీటు బెల్టు పెట్టుకోవడం కూడా రక్షణ చర్యలో భాగమే.



ఇటుక బట్టీల్లో కార్మికులకు మౌలిక వసతులు, ప్రాథమిక వైద్యం అందేలా చూడాలి. చిన్న పిల్లలుంటే పాఠశాలకు పంపించాలి. గంగాధర మండలంలో ఇటుక బట్టీ ప్రాంతంలో ఉపాధ్యాయురాలిని నియమించి చదువు నేర్పిస్తున్నారు. చాలా చోట్ల అమలు కావడంలేదు.

**ఉమ్మడి జిల్లాలో పరిశ్రమలు..**

కరీంనగర్ జిల్లాలో గ్రానైట్ క్వారీలు, కటింగ్ పరిశ్రమలు, విత్తనశుద్ధి పరిశ్రమలు, పెద్దపల్లి జిల్లాలో బొగ్గు నిక్షేపాలు, థర్మల్ కేంద్రాలు, రాజన్న సిరిసిల్ల జిల్లాలో పవర్‌లూమ్స్, టెక్స్‌టైల్స్, ఇతర పరిశ్రమలు, జగిత్యాల జిల్లాలో ఆహార శుద్ధి, ఇతర పరిశ్రమలు ఉన్నాయి.

రైస్ మిల్లులు, భవన నిర్మాణ రంగం అన్ని జిల్లాలో ఉన్నాయి. పని ప్రదేశాల్లో సరైన రక్షణ చర్యలు తీసుకోకపోతే కార్మికులు ప్రమాదాల బారినపడే అవకాశాలు ఉంటాయి.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ-శ్రామ్ పోర్టల్‌లో సంఘటిత, అసంఘటిత కార్మికులుగా 4.88 లక్షల మంది పేర్లు నమోదు చేసుకున్నారు.

**లక్ష్యాలు...**

జాతీయ భద్రతా దినోత్సవ నిర్వహణ బాధ్యతను నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చూస్తోంది. పని, సాధారణ జీవనశైలిలో భద్రత, ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వడం. కార్యాలయాల్లో భద్రత కల్పించడం. కర్మాగారాల చట్టం 1948 ప్రకారం 150 మంది కార్మికులకు ఒక ప్రథమ చికిత్స పెట్టెను, 500 మందికి మించి కార్మికులు ఉంటే అంబులెన్స్ సౌకర్యం కల్పించాలి. విశ్రాంతి గదులు, భోజనశాల ఉండాలి. వారి యోగ క్షేమాల పర్యవేక్షణకు సంక్షేమాధికారిణి నియమించాలి.30 మందికి మించి మహిళా కార్మికులు ఉంటే శిశు సంరక్షణ కార్యాలయం ఏర్పాటు చేయాలి.

**సమష్టి బాధ్యత**పరిశ్రమలు, పని చేసే ప్రదేశాల్లో కార్మికుల రక్షణకు సంబంధించిన చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో కార్మికులు భద్రతా చర్యలకు అనుగుణంగా పనులు చేయాలి. భద్రత అనేది సమష్టి బాధ్యత. రేపటి కోసం అందరం కట్టుబడి ఉందాం. పనిలోకి తీసుకున్న కార్మికులకు చేసే పనిపై శిక్షణ తర్ఫీదు కూడా ఇవ్వాలి.గంగాధర్ రెడ్డి, కర్మాగార తనిఖీ అధికారి, కరీంనగర్

# ధరల పతనంతో అయోమయం..!

ఖమ్మం : ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో 'తేజ' మిరప ధరలు పతనమవుతున్నాయి. చైనా దేశంతో పాటు కర్ణాటకలో పండిన పంట వల్ల ఇక్కడి ధరలపై ప్రభావం పడుతోంది. గతేడాది పంట నిల్వ చేసి నష్టపోయిన వ్యాపారులు ప్రస్తుతం మిరపను కొనే పరిస్థితి లేకపోవటం మరో కారణం. మిరపకాయల నుంచి నూనె తయారుచేసే కర్మాగారాల యజమానులు సైతం ఖమ్మం విపణిలో కాకుండా కర్ణాటకలోనే కొంటుండటం గమనార్హం.

**దెబ్బతీసిన చైనా పంట..**

చైనాలో మిరప పంట జూన్, జులై, ఆగస్టులో వస్తుంది. దాదాపు ఖమ్మం జిల్లాలో తేజ రకానికి దగ్గరగా ఉన్న పంటను గతేడాది ఆ దేశస్థులు పండించి విజయవంతమయ్యారు. ఈసంవత్సరం రెండింతల విస్తీర్ణంలో సాగుచేశారు. అక్కడి పంట సైతం వారికి అందుబాటులోకి రావటంతో ఇక్కడి పంట కొనుగోళ్లపై పెద్దగా ఆసక్తి చూపటం లేదని సమాచారం. దేశంలోనే అత్యధిక విస్తీర్ణంలో ఖమ్మంలో సాగయ్యే తేజ రకం మిరప.. ఎక్కువగా చైనా, థాయ్‌లాండ్, మలేషియా, మెక్సికో



దేశాలకు ఎగుమతి అవుతుంటుంది.

**'ప్రత్యామ్నాయం'తో భారీ మూల్యం**

ఖమ్మం జిల్లా ముదిగొండ, మహబూబాబాద్ సమీపంలోని మన్నెగూడెం, హైదరాబాద్‌లోని సాగర్‌రోడ్డు, ఏపీలోని ఒంగోలులో తేజ మిరప నుంచి ఆయిల్ తయారుచేసే మిల్లులు ఉన్నాయి. ఆరేడేళ్లుగా ఇవన్నీ ఖమ్మం మార్కెట్‌లో తేజ మిరపపై ఆధారపడుతున్నాయి. గతేడాది ధర ఎక్కువగా ఉండటంతో ఈమిల్లుల యజమానులు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిం చారు. దాదాపు తేజ రకానికి సమానంగా కర్ణాటకలో పండిస్తున్న మిరపను పరిశీలించారు. ఇక్కడి కంటే క్వింటా రూ. 3వేలు తక్కువ ధర పలకటంతో అక్కడి నుంచి పెద్దఎత్తున కొన్నారు. తద్వారా ఖమ్మం విపణిలో సుమారు 10లక్షల బస్తాలను కొనే దిక్కులేకుండా పోయింది. రైతులు, వ్యాపారులు తక్కువ ధరకు సరకు అమ్మలేక శీతల గిడ్డంగుల్లో నిల్వ చేశారు.

**రూ.400 కోట్లకు పైగా నష్టం**

గతేడాది రైతులు, వ్యాపారులు సుమారు 20లక్షల బస్తాల(ఎనిమిది లక్షల క్వింటాళ్లు)ను శీతల గిడ్డంగుల్లో నిల్వ చేశారు. అప్పట్లో క్వింటా ధర రూ. 21-22వేలు పలికింది. మరింత పెరుగుతుందని భావించి భంగపడ్డారు. సగటున క్వింటాకు రూ. 5వేల చొప్పున నష్టపోయారు. ఈలెక్కన ఖమ్మం జిల్లాలో రైతులు, వ్యాపారులు సుమారు రూ. 400కోట్లు నష్టపోయినట్లు తెలుస్తోంది. వ్యాపారులకు కొనుగోలు శక్తి తగ్గింది.

ఇక్కడి నుంచి విదేశాలకు ఎగుమతులు బాగుంటేనే మిర్చికి డిమాండ్ ఉంటుంది. రైతులు నాణ్యమైన సరకు తీసుకొస్తే డిమాండ్ పెరుగుతుంది. దీనివల్ల విదేశాల నుంచి మనకు భారీగా ఆర్డర్లు వస్తాయి. గతేడాది నుంచి క్రమేణా ధరలు తగ్గుముఖం పట్టాయి. విదేశాల నుంచి ఆశించిన స్థాయిలో ఆర్డర్లు లేకపోవటమే ప్రధాన కారణం.
యడ్లపల్లి సతీష్, మిర్చి శాఖ కార్యదర్శి, ఖమ్మం

# గుర్రపుడెక్కతో మొక్కరైతు కన్నీరు

చింతకాని : జిల్లాలోని '21 ఎంబీసీ' (మెయిన్ బ్రాంచ్ కెనాల్) పరిధిలో ఎక్కువ సాగు విస్తీర్ణమున్న చింతకాని మేజర్ కాలువ పూర్తిగా గుర్రపుడెక్క, నాచుతో నిండిపోయింది. 11,000 ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పైరుకు నీరందక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఇదీ ప్రవాహం** చింతకాని మేజర్ కాలువ 18.8 కిలోమీటర్ల పరిధిలోని పొలాలకు నీరందిస్తుంది. పుట్టకోట వద్ద 0 కి.మీ. నుంచి 7వ కిలోమీటర్ అల్లీపురం వరకు ఖమ్మం అర్బన్ మండలం పరిధిలోకి వస్తుంది. 7వ కి.మీ. బస్వాపురం నుంచి 18.8 కి.మీ మత్కేపల్లి నామవరం వరకు చింతకాని మండలంలోకి వస్తుంది. ఈ మండల పరిధిలో 11వేల ఎకరాల మొక్కజొన్న సాగైంది.

**సమస్య ఏంటి?**



ఖమ్మం అర్బన్ పరిధిలో 7 కి.మీ.ల మేర కాలువలో పూర్తిగా గుర్రపుడెక్క, నాచు చేరటంతో నీరు ముందుకు కదలటం లేదు. పూర్తిస్థాయిలో 140 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నప్పుడు కాలువ పొర్లి పుట్టకోట చెరువు వద్ద కట్ట మీదుగా ప్రవహిస్తోంది. కట్ట తెగే ప్రమాదం ఉండటంతో కేవలం 70 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఫలితంగా చివరి ఆయకట్టుకు నీరు చేరటం లేదు.

**ఎవరికి ఇబ్బంది?**

బస్వాపురం, రామకృష్ణాపురం, రాఘవాపురం, కొదుమూరు, లచ్చగూడెం, చింతకాని, నరసింహాపురం, జగన్నాథపురం మత్కేపల్లి నామవరం గ్రామాల్లో మొక్కజొన్న పైరు కంకిపాప, పాలపొట్ట దశలో ఉంది. ఈ దశలో నీరు ఎంతో అవసరం. కానీ సరిపడా రావటం లేదు.

రైతులు ఎన్నిసార్లు సమస్య పరిష్కరించాలని కోరినా ప్రయోజనం లేకుండా పోయింది. పదెకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను. అడిగితే ఖమ్మం అర్బన్ అధికారులు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. అనేకసార్లు ఎన్నెస్పీ అధికారులకు సమస్య విన్నవించినా ప్రయోజనం లేదు. దండా విశ్వనాథం, చింతకాని

రైతులు ఇబ్బంది పడుతున్న మాట వాస్తవం. ఉన్నతాధికారులకు విషయాన్ని తెలియపర్చాం. వారి సూచనల మేరకు అర్బన్ ఎన్నెస్పీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం. రాంప్రసాద్, ఎన్నెస్పీ డీఈ

# ఎగువ మానేరుకు మల్లన్న సాగర్ నీరు



గంభీరావుపేట: ఎగువ మానేరు ఆయకట్టు రైతులు జలాశయంలో ఉన్న సాగునీటితో పూర్తి స్థాయిలో పంట పండుతుందో, లేదోనని మొన్నటి వరకు ఆందోళన చెందారు. ముఖ్యంగా ముస్తాబాద్ మండలంలోని ఆయకట్టు రైతులు యాసంగి పంటకు సాగునీరు అందటం లేదని వాపోయారు. ప్రస్తుతం మల్లన్నసాగర్ నుంచి ఎగువ మానేరు జలాశయానికి నీరు వదలడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని నర్మాల ఎగువ మానేరు జలాశయం సామర్థ్యం రెండు టీఎంసీలు. డిసెంబర్‌లో 5, 10 తేదీల్లో కుడి, ఎడమ కాలువల ద్వారా నీటిని అధికారులు విడుదల చేశారు. ఆ సమయంలో 1.9 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పది వేల ఎకరాలకు అధికారులు తైబంది చేశారు. ఎడమ కాలువ ద్వారా 670 ఎకరాలు, కుడి కాలువ ద్వారా 9,330 ఎకరాలకు నీరు అందించాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు 0.7 టీఎంసీని సాగుకు విడుదల చేశారు. నీటిని పొదుపు చేస్తూ వదులుతున్నారు. అయితే చివరి ఆయకట్టు వరకు నీరు అందక పంటలు ఎండిపోతాయని రైతులు ఆందోళన చెందారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కేకే మహేందర్‌రెడ్డి ద్వారా నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మల్లన్నసాగర్ జలాశయం నుంచి 0.5 టీఎంసీ నీటిని విడుదల చేస్తామని హామీ ఇచ్చి అక్కడి అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో వారు విడుదల చేశారు. ఈ నెల 2న రాత్రి వరకు ఎగువమానేరు జలాశయానికి నీరు చేరుకుంది. 0.5 టీఎంసీ రావడానికి దాదాపు పది రోజులు పడుతుందని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. పూర్తి స్థాయిలో పంటకు నీరు అందుతుందని అధికారులు చెబుతున్నారు.

**ఆందోళన తొలగింది**

పంట చివరి దశలో ఎండిపోతుందని మొన్నటి వరకు ఆందోళన చెందాం. ఇటీవల మా ఎడమ కాలువకు వారబంది పెట్టడంతో పంటలు ఎండిపోతాయని అనుకున్నాం. ప్రస్తుతం మల్లన్నసాగర్ జలాశయం నుంచి ఎగువమానేరుకు నీటిని విడుదల చేయడంతో ఆందోళన తొలగింది. ప్రతి ఎకరాకు నీరు అందించి పంటలు ఎండిపోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.
– జంగం కిష్టయ్య, నర్మాల రైతు

**రైతులకు అండగా...**

రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది. ఎగువమానేరు జలాశయం ఆయకట్టు రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. 0.5 టీఎంసీ నీరు మానేరు జలాశయానికి మల్లన్నసాగర్ నుంచి విడుదల చేస్తున్నారు. కేకే మహేందర్‌రెడ్డి నీటిపారుదలశాఖ మంత్రికి రైతుల సమస్యను వివరించగా వెంటనే మల్లన్నసాగర్ నుంచి విడుదల చేస్తున్నారు. – హమీద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు

**ప్రతి ఎకరానికీ అందుతుంది**

ప్రతి ఎకరానికి నీరు అందించాలనే ఉద్దేశంతో నీటిని పొదుపుగా విడుదల చేస్తున్నాం. మల్లన్నసాగర్ నుంచి 0.5 టీఎంసీ వస్తుందని అంచనా వేశాం. ప్రతి ఎకరానికీ అందుతుంది. రైతులు ఆందోళన చెందవద్దు. దాదాపు పది రోజుల వరకు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. ప్రతి రైతు నీటిని పొదుపుగా వాడుకోవాలి. – నర్సింగ్, ఇరిగేషన్ డీఈఈ

# కళ తప్పిన సినారె మందిరం



వేములవాడ : కళలు, కళాకారులకు పుట్టినిల్లుగా పేరొందిన వేములవాడ ప్రాంతంలోని సినారె కళా మందిరం కళావిహీనంగానే మారింది. ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు మారుతున్నా పట్టించుకున్న నాథుడు లేడు. దీంతో అధ్వానంగా తయారైంది. వేములవాడ ప్రాంతంలోని కళాకారులను, కళలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 2002 సంవత్సరంలో సినారె రాజ్యసభ సభ్యుడిగా ఉన్నప్పుడు రూ. 50 లక్షలతో కళా భవనాన్ని అన్ని హంగులతో నిర్మించారు. విశాలమైన స్థలంలో దాదాపు వేయి మంది పైగా కూర్చుని కార్యక్రమాలు తిలకించే విధంగా రూపకల్పన చేసి నిర్మాణం చేశారు. కళా భవనంలో డ్రెస్సింగ్ గది, మూత్రశాలలు తదితర అన్ని వసతులతో నిర్మించినప్పటికీ నిర్వహణ లేక అధ్వానంగా మారింది. కిటికీల అద్దాలు ధ్వంసమయ్యాయి. భవనంలోని సీలింగ్ శిథిలమైంది. తలుపులు పాడయ్యాయి. విద్యుత్ వైరింగ్ దెబ్బతింది. ఫ్యాన్లు మరమ్మతులకు గురయ్యాయి. జిల్లా స్థాయిలో జరిగే అనేక కార్యక్రమాలను ఇందులోనే నిర్వహించేవారు. యువజనోత్సవాలు వంటివి కూడా భారీ స్థాయిలో జరిగేవి. అలాంటి కళామందిరం నేడు ఆలనా పాలనా లేకుండాపోయింది. దీనిని పట్టించుకునే నాథుడు లేకపోవడంతో ప్రస్తుతం రాత్రి వేళ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.

**కానరాని నిధుల జాడ** గత ప్రభుత్వ హయాంలో ఈ భవనం స్థానంలో రూ. 10 కోట్లు వెచ్చించి కొత్తది నిర్మించాలని ప్రతిపాదనలు చేశారు. ఇందుకు ముందుగా రూ. 5 కోట్లు మంజూరు చేసినట్లు ప్రకటించారు. కానీ నిధుల జాడ లేదు. మరోవైపు భవనం నాణ్యతగానే ఉండటంతో అవసరమైన మరమ్మతులు చేసి ఆధునికీకరించి వినియోగంలోకి తీసుకురావాలని ఇంజినీరింగ్ అధికారులు భావించారు. ఏళ్లు గడుస్తున్నా అది కూడా కార్యరూపం దాల్చడం లేదు. మొదట్లో ఈ భవనం మండల పరిషత్ అధికారుల పర్యవేక్షణలో ఉండేది. ప్రస్తుతం పురపాలక సంఘం అధికారుల ఆధీనంలో ఉన్నా మరమ్మతులకు నోచుకోలేదు. ప్రస్తుతం భవనం పైఅంతస్తులో నీటిపారుదలశాఖ ఇంజినీరింగ్ కార్యాలయం కొనసాగుతోంది. కింద గదిలో ఆధార్ కేంద్రం నడుస్తోంది. భవనం మాత్రం ఆలనా పాలనా కరవై అస్తవ్యస్తంగా మారింది.

**చెత్త ఆటోలకు నిలయంగా...**

కళాకారులతో కళకళలాడాల్సిన కళామందిరం మున్సిపల్ చెత్త ఆటోలు, ట్రాక్టర్లకు నిలయంగా మారింది. మున్సిపల్ కార్యాలయం వద్ద స్థలం కొరత వల్ల కళామందిరం ఆవరణలో పార్కింగ్ చేస్తున్నారు. గేట్లు కూడా వేయకపోవడంతో ప్రైవేటు వ్యక్తులు కూడా ఇక్కడే వాహనాలు నిలుపుతున్నారు. ఇప్పటికైనా కళామందిరానికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కళాకారులు, కళాభిమానులు కోరుతున్నారు.

**ఆర్‌అండ్‌బీ పరిశీలనలో...** కళామందిరానికి సంబంధించి మున్సిపల్ నుంచి ఎలాంటి ప్రతిపాదనలు చేయలేదు. గతంలోనే నూతన భవనం నిర్మాణానికి పంపించారు. సినారె కళామందిరం మరమ్మతులు ఆర్‌అండ్‌బీ అధికారుల పరిశీలనలో ఉన్నాయి. నిధులు వస్తే వారు పనులు చేపడతారు. – అన్వేష్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ

# ఆర్ఆర్ఆర్ ప్రతిపాదన సాకు.. ఇళ్ల అనుమతులకు అపసోపాలు!

నర్సాపూర్: జిల్లాలో ప్రాంతీయ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) నిర్మాణానికి మూడు రకాల సర్వేలు చేసి ఒకదానిని ఖరారు చేశారు. మిగతా రెండు చోట్లా ప్రతిపాదిత భూముల్లో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. కొందరు ఎలాగోల నిర్మాణాలు చేపట్టడంతో అక్రమ నిర్మాణాలంటూ సంబంధిత అధికారులు వారికి నోటీసులు ఇస్తున్నారు. ఎల్ఆర్ఎస్‌లో క్రమబద్ధీకరిం చుకోవాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. ఈ పరిస్థితి నర్సాపూర్, తూప్రాన్ పురపాలికలతో పాటు, ఆయా పంచాయతీల్లో నెలకొంది.

**నర్సాపూర్‌లోనే 200 మంది** గతంలో ప్రతిపాదిత భూముల్లో నిర్మాణాలు చేపట్టుకోవడానికి అనుమతులు ఇవ్వకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. నర్సాపూర్ పురపాలికలో సుమారు 200 మంది ఎదురుచూస్తున్నారు. కొందరు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నా అనుమతులు రావడం లేదు. మరికొందరు ఇళ్లు నిర్మించుకోవడంతో వాటిని ఎల్ఆర్ఎస్‌లో క్రమబద్ధీకరించుకోవాలని అధికారులు ఒత్తిడి తీసుకొస్తున్నారు.

**బ్యాంకు రుణాలు రాకున్నా..** రెండు చోట్ల అనుమతులు రాకున్నా ధైర్యం చేసి నిర్మాణాలు చేపట్టిన వారికి బ్యాంకుల నుంచి రుణాలు రావడం లేదు. ప్లాట్లు కొనుగోలు చేసి తిరిగి సొంతంగా డబ్బులు వెచ్చించి నిర్మాణాలు చేపట్టడానికి పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

**మొదటి సర్వే..** నర్సాపూర్ పురపాలిక పరిధిలో గతంలో సంగారెడ్డి మార్గంలోని రుస్తుంపేట కమాన్ సమీపంలోంచి, మెదక్ మార్గంలోని సీతారాంపూర్, గోకుల్ కాలనీ మీదుగా, వెల్దుర్తి మార్గంలో ఖండసారి షుగర్ ఫ్యాక్టరీ వరకూ ట్రిపుల్ ఆర్ వెళ్తుందని సర్వే చేశారు. ఆయా ప్రాంతాల్లో హద్దులు కూడా ఏర్పాటు చేశారు.

**రెండో సారి..** నర్సాపూర్, శివ్వంపేట, కౌడిపల్లి మండలాల్లోని బ్రాహ్మణపల్లి, నాగ్సన్‌పల్లి, శివ్వంపేట మండలం పిల్లుట్ల తదితర ప్రాంతాల మీదుగా సర్వే చేశారు.

మూడో సారి.. పై రెండింటిని పక్కన పెట్టి ప్రస్తుతం ట్రిపుల్ ఆర్ నిర్మాణం రెడ్డిపల్లి సమీపంలోంచి చేపట్టనున్నట్లు ప్రకటించారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం
రామకృష్ణారావు, పురపాలిక కమిషనర్, నర్సాపూర్
అనుమతుల విషయాన్ని జిల్లా కలెక్టర్, సీడీఎంఏ దృష్టికి తీసుకెళ్లాం. ట్రిపుల్ ఆర్ ప్రతిపాదిత భూములని పేర్కొన్న వాటికి ఇవ్వడం లేదు. ఇలా నర్సాపూర్‌లో 200 లకు పైనే ఉంటాయి. ఆన్‌లైన్‌లో హెచ్ఎండీఏ డీనోటిఫై చేయడం వల్లే ఈ సమస్య పరిష్కారమవుతుంది. అంతవరకు అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారు ఎల్ఆర్ఎస్‌ను ఉపయోగించుకోవాలి.

# స్థానిక చర్చలు మొదలు

కొత్తగూడెం : స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తాజాగా చేసిన వ్యాఖ్యలతో గ్రామాల్లో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. మరో రెండు వారాల్లో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడుతుందనటంతో ఉభయ జిల్లాల్లో జోరుగా చర్చలు జరుగుతున్నాయి. పోటీ చేయాలనుకుంటున్న అభ్యర్థులు ఇప్పటికే తమ ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఏడాది కాలంగా పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. ఈనేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఎప్పుడు తేదీలు ప్రకటించినా పక్రియ నిర్వహించేందుకు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

**రిజర్వేషన్ల వైపు ఆశావహుల చూపు**

గత ప్రభుత్వం పంచాయతీ రిజర్వేషన్లను పదేళ్లపాటు అమలయ్యేలా.. 2019లో పంచాయతీరాజ్ చట్టం చేసింది. ఈ చట్టం ప్రకారం రిజర్వేషన్లు మార్చకుండా ఎన్నికలు నిర్వహించాలి. కానీ ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు కొత్త విధానాన్ని అమలుచేయనున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. గత ఎన్నికల్లో ఎస్సీలకు 15, ఎస్టీలకు 7, బీసీలకు 28 శాతం రిజర్వేషన్లు అమలయ్యాయి. అందులో మహిళలకు 50 శాతం ఉంటుంది. గత ఎన్నికల్లో బీసీల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. బీసీ గణన చేపట్టి అందుకు అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్ ఊపందుకుంది. ఈసారి ఎన్నికల్లో పోటీచేయాలనుకుంటున్న వారందరూ తమ స్థానాల్లో ఏ రిజర్వేషన్ ఖరారవుతుందోనని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



**తేలనున్న బీసీ రిజర్వేషన్లు..**

రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లు త్వరలోనే ఖరారు కానున్నాయి. బీసీలకు రిజర్వేషన్లు కేటాయించేందుకు కీలకంగా మారిన సామాజిక, ఆర్థిక సర్వే నివేదికలోని ముఖ్యాంశాలను ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్రంలోని బీసీ జనాభా లెక్కలను సైతం తేల్చింది. సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లపై ఏర్పాటైన ప్రత్యేక (డెడికేటెడ్) కమిషన్ త్వరలోనే నివేదిక సిద్ధం చేయనున్నట్లు తెలుస్తోంది. వార్డులు, గ్రామాలు, మండలాలు, జిల్లాలు, పట్టణ స్థానిక సంస్థల వారీగా బీసీ జనాభా ప్రకారం గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలకు రిజర్వేషన్లు ఖరారు చేస్తూ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. దీనిపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై బీసీ రిజర్వేషన్లు ఆధారపడి ఉంటాయి.

**ఆలోచింపజేస్తున్న లఘుచిత్రాలు..**

ఓవైపు గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికలపై విస్తృతంగా చర్చలు జరుగుతుంటే.. మరోవైపు ఎన్నికల్లో అభ్యర్థులు చేసే వ్యయం, దానివల్ల తలెత్తే సమస్యలపై సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్న లఘుచిత్రాలు ఆలోచింపజేస్తున్నాయి. అప్పులు చేసి పంచాయతీ ఎన్నికల బరిలో నిలిస్తే ఎలాంటి ఇబ్బందులు తలెత్తుతాయనే అంశాన్ని సందేశాత్మకంగా వివరిస్తున్నాయి. పంచాయతీ ఎన్నికల్లో బరిలో నిలిచి పరిమితికి మించి ఖర్చు చేయటం వల్ల చివరికి ప్రాణాలు తీసుకునే పరిస్థితులు దాపురిస్తాయంటున్నాయి.

# సౌర వెలుగు.. ఆదాయం సులువు!

ఆసిఫాబాద్ : మహిళలు వ్యాపారపరంగా రాణించి ఆర్థిక స్వావలంబన సాధించేలా ప్రభుత్వం మహిళా శక్తి పథకాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా మహిళా సంఘాలతో సౌరశక్తి విద్యుత్తు ఉత్పత్తి యూనిట్లు ఏర్పాటు చేయించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. యూనిట్ నెలకొల్పేందుకు అవసరమైన నిధులను బ్యాంకు ద్వారా రుణం ఇప్పించడంతోపాటు ప్రభుత్వ స్థలాలను కేటాయించేలా చూడాలని ఆదేశించింది. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు.. రెవెన్యూ అధికారులతో కలిసి స్థలాలను గుర్తిస్తున్నారు. విద్యుత్తు ఉపకేంద్రాలకు 4-5 కి.మీ. చుట్టుపక్కల స్థలం ఉండేలా చూస్తున్నారు. జిల్లాలో 400 ఎకరాల్లో వీటిని ఏర్పాటు చేయాలన్న లక్ష్యం విధించారు.

**ఉపకేంద్రాల సమీపంలో 141 ఎకరాల గుర్తింపు**

జిల్లాలో 33/11 కేవీ, 132/33 కేవీ విద్యుత్తు ఉప కేంద్రాలు మొత్తం 38 ఉన్నాయి. వీటి సమీపంలోని సర్కారీ స్థలాలను గ్రామీణాభివృద్ధి, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా గుర్తిస్తున్నారు. ఇప్పటికే 13 మండలాల్లోని 27 ప్రాంతాల్లో పరిశీలించారు. 141.21 ఎకరాలను గుర్తించారు. వీటిలో కొన్నిచోట్ల 1-5 ఎకరాల మధ్య భూమి ఉండగా, మరికొన్నిచోట్ల అంతకు మించి ఉన్నట్లు గుర్తించారు. వీటిలో యూనిట్ల స్థాపనపై టీజీ రెడ్కో అధికారులు ఆమోదించాక ప్రభుత్వానికి నివేదిస్తారు. ఒక్క మెగావాట్ విద్యుత్తు ఉత్పత్తి యూనిట్ నెలకొల్పేందుకు 3.5-4 ఎకరాల భూమి అవసరం. మొదట రెండు మెగావాట్ల యూనిట్ మోడల్‌గా ఏర్పాటు చేయాలనే ఆదేశాలతో.. రెబ్బెన మండలం నంబాల ఉపకేంద్రం సమీపంలోని ఎనిమిదెకరాల భూమిని ఇప్పటికే కలెక్టర్ యూనిట్ ఏర్పాటుకు కేటాయించారు. ఏర్పాటుకు అధికారులు సిద్ధమవగా.. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో తాత్కాలికంగా నిలిచింది.

**బ్యాంకుల ద్వారా రుణం..**

ఒక మెగావాట్ సౌర విద్యుత్తు ఉత్పత్తి యూనిట్ నెలకొల్పేందుకు రూ. 3 కోట్ల వరకు వ్యయమవుతుంది. దీనిలో మండల సమాఖ్యలు 10శాతం వెచ్చిస్తే.. మిగతావి బ్యాంకుల ద్వారా రుణం ఇప్పిస్తారు. సోలార్ ప్లాంటు ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్తును యూనిట్‌కు రూ. 3.13 చొప్పున డిస్కంలు కొనుగోలు చేయనున్నాయి. ఒక్క మెగావాట్ విద్యుత్తు సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుతో రోజుకు సుమారు 4 వేల యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

**కొన్నిచోట్ల స్థలాల గుర్తింపు**

దత్తారావు, డీఆర్‌డీవో
ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే రెవెన్యూ అధికారులతో కలిసి కొన్ని స్థలాలను గుర్తించాం. నంబాల ఉపకేంద్ర సమీపంలో త్వరలో రెండు మెగావాట్ల యూనిట్ ఏర్పాటు చేస్తాం. ఆయా యూనిట్లను ఏ సమాఖ్యలకు అప్పగించాలి. వారి వద్ద అందుబాటులో ఉన్న నిధుల వివరాలను పరిశీలిస్తున్నాం.

చురకలు



# 'కుట్టు' ఆర్థిక పట్టు

కర్నూలు : మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలన్న ఉద్దేశంతో గతంలో తెదేపా ప్రభుత్వం మహిళా సంఘాలను ఏర్పాటు చేసింది. వారికి జీవనోపాధి కల్పించే ఉద్దేశంతో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో కుట్టుశిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పొదుపు మహిళలకు కుట్టు నేర్పడం, దుస్తుల తయారీలో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించారు. ఉమ్మడి జిల్లాలో 12 కేంద్రాలు ఏర్పాటు చేసి ఒక్కో బృందంలో దాదాపు 300 మంది వరకు శిక్షణ ఇచ్చే వారు. వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత శిక్షణ కేంద్రాలకు తాళం వేసింది. వృత్తిపరమైన శిక్షణ కార్యక్రమాలు చేపట్టలేదు. శిక్షణను పునరుద్ధరించాలని 'కూటమి' ప్రభుత్వం నిర్ణయించింది.

**పలు అంశాల్లో...**మహిళలకు కేవలం టైలరింగ్ శిక్షణతోనే సరిపెట్టకుండా ఈవెంట్ మేనేజ్‌మెంటు యూనిట్ల ఏర్పాటులోను ప్రాధాన్యమివ్వనున్నారు. వీటితోపాటు బీసీ, ఈడబ్ల్యూఎస్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ ద్వారా అమలుచేసే స్వయం ఉపాధి పథకాల అమల్లోనూ మహిళలకు అవకాశం కల్పించనున్నారు. డెయిరీ, గొర్రెల, మేకల పెంపకం యూనిట్లతో పాటు జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటుకు ముందుకొచ్చిన మహిళలకూ ప్రభుత్వం అండగా నిలవనుంది.

**ప్రతిపాదనలు పంపిన అధికారులు**

రాష్ట్ర వ్యాప్తంగా బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు సామాజిక వర్గాలకు చెందిన 1.02 లక్షల మహిళలకు కుట్టు యంత్రాలు అందజేయాలని కూటమి



ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఒక్కో జిల్లాకు సరాసరిన 3,955 చొప్పున ఉమ్మడి జిల్లాకు 7,910 కుట్టు యంత్రాలు రానున్నాయి. బీసీ మహిళలకు కుట్టు యంత్రాలు అందించేందుకు గతేడాది అక్టోబరులోనే ప్రభుత్వం వివరాలు కోరింది. కర్నూలు జిల్లాలో 1,400, నంద్యాలలో 2 వేలు మంజూరు చేయాలంటూ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు.

**54 మండలాలు.. 64,399 సంఘాలు**


ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం 54 మండలాల పరిధిలో 2,049 గ్రామైక్య సంఘాలుండగా.. వాటి పరిధిలో 64,399 స్వయం సహాయక పొదుపు సంఘాలున్నాయి. ఈ సంఘాల్లో 6,76,723 మంది సభ్యులు ఉన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కర్నూలు నగరపాలక సంస్థతోపాటు నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, నందికొట్కూరు, గూడూరు మున్సిపాలిటీలు, బేతంచెర్ల నగర పంచాయతీ పరిధిలో 25,300 స్వయం సహాయక పొదుపు సంఘాలుండగా.. అందులో 2,58,823 మంది పొదుపు మహిళలు సభ్యులుగా ఉన్నారు. వీరిలో బీసీలు, ఈబీసీలు, కాపు సామాజిక వర్గాలకు చెందిన మహిళలను ఎంపిక చేయనున్నారు.

# పదింతల సన్నద్ధత

కర్నూలు : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతకు 'పది'ంతల ప్రణాళికలతో ముందుకెళ్తున్నారు. ప్రత్యేక ప్రణాళిక అమలు పూర్తి కావడంతో పునఃసమీక్ష చేయగా ఎక్కువ శాతం మంది విద్యార్థులు సి, డి గ్రేడులకే పరిమితమైనట్లు అధికారులు గుర్తించారు. ప్రధానంగా గణితం, సైన్సు, ఇంగ్లిషు సబ్జెక్టుల్లో మార్కులు సాధించడంలో వెనుకబడినట్లు తేలింది. వంద రోజుల ప్రణాళికలో భాగంగా నిర్వహించిన తరగతుల్లో కనీసం 75 శాతం మంది విద్యార్థులు ఏ, బీ గ్రేడ్లు సాధించి ఉంటే అనుకున్న లక్ష్యం నెరవేరేది. కానీ చాలా మంది విద్యార్థులు సీ, డీ%% గ్రేడుల్లోనే ఉండటం గమనార్హం. ఈ నేపథ్యంలో 12 రోజులపాటు ప్రత్యేక శ్రద్ధ వహించేలా ఉన్నతాధికారులు సమీక్షించి మంచి ఉత్తీర్ణతకు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యా శాఖ నుంచి ఆదేశాలొచ్చాయి. ఈనెల 17వ తేదీ నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

**మొదలైన గ్రాండ్ టెస్టు**

ఈనెల 3 నుంచి 13వ తేదీ వరకు పదో తరగతి విద్యార్థులకు గ్రాండ్ టెస్టు నిర్వహిస్తున్నారు. ప్రీ ఫైనల్ పరీక్షల్లో తక్కువ మార్కులు, ఉత్తీర్ణత సాధించలేని విద్యార్థులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మరోవైపు గ్రాండ్ టెస్టులో ఎక్కువ మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్తున్నారు.



ఈ నేపథ్యంలో ఎంతమేర సత్ఫలితాలిస్తాయో చూడాల్సి ఉంది.

**37 వేల మందికిపైగా విద్యార్థులు**

కర్నూలు జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన 21,848, నంద్యాల జిల్లాకు చెందిన 15,951 మంది విద్యార్థులు 'పది' పరీక్షలు రాసేందుకు సిద్ధమయ్యారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా మంచి ఫలితాలు సాధించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తోంది. ఈ నేపథ్యంలో వంద రోజుల ప్రత్యేక ప్రణాళికను డిసెంబరు నుంచి అమలుచేస్తూ విద్యార్థులను అధికారులు సన్నద్ధం చేస్తున్నారు.

విద్యార్థులకు ప్రతి రోజు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు ఫిబ్రవరితో ముగిశాయి. విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసే క్రమంలో ప్రీ ఫైనల్ పరీక్షలు సైతం ముగిశాయి. ఈ పరీక్షల్లో విద్యార్థులు సబ్జెక్టుల వారీగా సాధించిన మార్కుల ఆధారంగా ఏ, బీ, సీ, డీ గ్రేడులుగా కేటాయించారు.

# మామూళ్ల మత్తు.. నిబంధనలు చిత్తు!



అనంతపురం : అనంతపురం జిల్లాలో మద్యం అమ్మకాల వ్యవహారం పక్కదారి పడుతోంది. దుకాణదారులు నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు చూసీచూడనట్లు ఉన్నారు. ఫలితంగా నిర్వాహకుల్లో తమకు అడ్డే లేదన్న ధోరణి పెరిగిపోతోంది. అనంతపురం జిల్లా పరిధిలో 136 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఇటీవల కల్లు గీత కార్మికులకు మరో 14 దుకాణాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో మద్యం విక్రయాలు పెంచుకుని సొమ్ము చేసుకునేందుకు దుకాణాలు దక్కించుకున్నవారు అప్పుడే అడ్డదారులు తొక్కుతున్నారు. గ్రామాల్లో గొలుసు దుకాణాలకు యథేచ్ఛగా మద్యం సరఫరా చేస్తున్నారు. వారు పల్లెల్లో గొలుసు దుకాణాల నిర్వాహకుల నుంచి ముందస్తుగా రూ.లక్షల్లో అడ్వాన్సులు తీసుకున్నారు. బహిరంగంగా విక్రయాలు జరుగుతున్నా ఎవరూ చర్యలు తీసుకోవడం లేదు. నగరానికి ఆనుకుని ఉన్న కందుకూరు గ్రామ శివారులో ఒకరు గొలుసు దుకాణాన్ని పబ్లిక్‌గా నడుపుతున్నా పట్టింపులేదు. రాయదుర్గం ప్రాంతంలో నేత్రపల్లి, బానేపల్లి గ్రామాల్లో గొలుసు ఏర్పాటుకు ఓ నాయకుడు ఏకంగా రూ.ఐదు లక్షలు దుకాణదారులకు చెల్లించినట్లు వినికిడి. విడపనకల్లు, ఉరవకొండ, వజ్రకరూరు, శెట్టూరు, బెళుగుప్ప, కణేకల్లు, రాయదుర్గం ప్రాంతాల్లో బెల్టు ఎక్కువగా ఉన్నా పట్టించుకునే నాథుడే లేడు.

**ఏదీ సమయపాలన...**

మద్యం దుకాణాలను రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 10 వరకు మాత్రమే నిర్వహించాలి. కొన్నిచోట్ల దుకాణాల వద్దనే అనధికార పర్మిట్ గదులను ఏర్పాటు చేసుకుని మద్యం తాగిస్తున్నారు. ఇవి చిన్నపాటి బార్లను తలపిస్తున్నాయి. నిబంధనల విషయంలో సదరు శాఖ అధికారులతో రహస్య ఒప్పంద చేసుకున్నారని, కేవలం పొరుగు రాష్ట్రాల మద్యం రవాణాపైనే అధికంగా దాడులు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

అనంత నగరంలో కొన్ని దుకాణాల్లో ఉదయం తొమ్మిది నుంచే షట్టర్ కొద్దిగా తెరిచి లోపలి నుంచి అమ్మకాలు చేస్తున్నారు. రుద్రంపేటలోని ఓ దుకాణం నివాస ప్రాంతాల మధ్య ఉంది. అక్కడే అనధికార పర్మిట్ గదిలో భారీ స్థాయిలో తాపిస్తున్నారు. మందుబాబుల ఆగడాలను భరించలేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

**ఒప్పందాలు..!**

జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు వ్యక్తులు మద్యం దుకాణాలను ప్రారంభించిన నేపథ్యంలో మామూళ్లు ఇవ్వడానికి, తీసుకోవడానికి ఒప్పందాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. అమ్మకాలపై దృష్టి సారించాల్సిన నిఘా విభాగం అధికారులు సైతం నిర్వాహకులతో మామూళ్లు ఫిక్స్ చేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం కోసం అప్పుడప్పుడు తక్కువ సంఖ్యలో మద్యం పట్టుకున్నట్లు మీడియాకు సమాచారం ఇస్తున్నారు. కింది స్థాయి నుంచి పైస్థాయి అధికారి వరకు మామూళ్లకు అలవాటు పడినట్లు ఆరోపణలున్నాయి. దుకాణ అనుమతి జారీ సమయంలోనూ ఒక్కో అనుమతిదారుడి నుంచి రూ.లక్ష వరకు వసూలు చేసినట్లు ఆరోపణలొస్తున్నాయి. అందుకే గ్రామాల్లో పెద్ద ఎత్తున గొలుసు దుకాణాలు నడుస్తున్నా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

**నిఘా పెంచుతాం...**రాయదుర్గం, కణేకల్లు, కళ్యాణదుర్గం, సెట్టూరు మండలాల పరిధిలో అందిన సమచారం మేరకు దాడులు చేస్తున్నాం.. కర్ణాటక మద్యాన్ని ఎక్కడికక్కడ అరికడుతున్నాం. మరింత నిఘా పెంచుతాం..నాగమద్దయ్య, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్

# తాటిపూడి పైపులకు ఆక్రమణల 'ఒత్తిడి'




గోపాలపట్నం : తాటిపూడి పైపులైను ఏడాదిలో మూడు, నాలుగుసార్లు పగుళ్లిచ్చి భారీగా నీటి వృథా జరుగుతుంటుంది. గ్యాలన్ల కొద్దీ విలువైన తాగునీరు మురుగుకాలువల పాలవుతోంది. అసలు తరచూ ఎందుకు ఇలా జరుగుతుందనే మూలాల్లోకి ఉన్నతాధికారులు వెళ్లడం లేదు. పైపులకు 'ఒత్తిడే' కారణమని తెలుస్తున్నా... ఆ ఒత్తిడి ఆక్రమణల వల్లే సంభవిస్తుందని తెలిసినా దాని జోలికి వెళ్లడం లేదు. పైపు పగిలితే మరమ్మతులు చేయటం.. తర్వాత కథ మళ్లీ మామూలే.

**వివరాల్లోకి వెళితే..**

నగర ప్రజానీకానికి తాగునీటిని అందించాలన్న ఉద్దేశంతో 23 ఏళ్ల కిందట తాడిపూడి రిజర్వాయర్ నుంచి టీఎస్‌ఆర్ మంచినీటి ట్యాంకు వరకు పైపులైను ఏర్పాటు చేశారు. ఈ లైను భూగర్భం నుంచి వెళుతున్నందున గోపాలపట్నం పెట్రోల్‌బంకు కూడలి సమీపంలో సుమారు 70 భవనాలను తొలగించారు. వీరందరికి బంటాకాలనీ సర్వేనంబరు 76లో ఇళ్లను కేటాయించారు. అయితే అక్కడ స్థలాలను పొందిన వారితో పాటు ఇంకొందరు 'రాజకీయ' అండతో గోపాలపట్నం పెట్రోల్ బంకు కూడలి వద్ద తాటిపూడి పైపులైనుపై అనధికార నిర్మాణాలను చేపట్టారు. ఆ నిర్మాణాలకు అనుసంధానంగా బోర్లు, సెప్టిక్ ట్యాంకులను నిర్మించేశారు. ఆ అనధికార నిర్మాణాలను కాపాడుకోవడానికి ఆక్రమణదారులంతా ఒక సంఘాన్ని ఏర్పాటు చేసుకోవడం గమనార్హం. తాగునీటి సరఫరా పైపులైనుపై ఎటువంటి నిర్మాణాలను అనుమతించకూడదు. పైగా పైపులైనుకు కనీసం 10-15 అడుగుల వెడల్పు ప్రదేశాన్ని విశాలంగా ఉంచాలి. అయితే దీనికి భిన్నంగా పైపులైన్లపైనే అనధికారికంగా వాణిజ్య సముదాయాలను నిర్మాణం, వాటికి అనుసంధానంగా బోర్లు, సెప్టిక్‌ట్యాంకులు ఏర్పాటు చేసుకోవడం వల్ల తాటిపూడి పైపులపై ఒత్తిడి పెరిగి తరచూ పైపులు పగులుతున్నాయి.

**లీకు అయితే సమస్యలెన్నో..**

పైపులైను లీకైనప్పుడు పెద్దశబ్దం వస్తోంది. దీంతో పైపులైను కింది ప్రాంతాల్లో నివాసముంటున్న ఐదు కాలనీవాసులు ఉలిక్కిపడుతున్నారు. పైపులైను లీకేజీ నీటితో వంద అడుగుల దూరంలో ఉన్న భవనాల వద్ద చెమ్మతోపాటు, ఊటలు బయటకు వస్తున్నాయి.

దీనికితోడు పైపులైను పేలినప్పుడు తాగునీరు సెలయేరులా కాలనీల్లో నీరు ప్రవహించడంతో భవనాల పునాదులు కోతకు గురవుతున్నాయి. గతేడాది నీటి ప్రవాహానికి ప్రహరీ కూలి విలువైన కారు ధ్వంసమైంది.

**రూ. లక్షల ప్రజాధనం వృథా..**

ఆక్రమణల కారణంగా పగుళ్లిస్తున్న పైపులైనుకు మరమ్మతులు చేయడానికి రూ. లక్షలు వెచ్చించాల్సి వస్తోంది. సుమారు 67 కిలోమీటర్ల పొడవు గల పైపులైను మరమ్మతులకు జీవీఎంసీ గుత్తేదారుడికి సంవత్సరానికి సుమారు రూ. 15 లక్షలు చెల్లిస్తోంది. పైపులు పగిలినపుడు పైపులైనుకు పైపైనే పూతలు వేసి చేతులు దులుపుకొంటున్నారన్న విమర్శలు వున్నాయి.

**మరమ్మతులు చేసిన చోటే..**

తాడిపూడి పైపులైను మరమ్మతుల్లో భాగంగా స్థానిక పెట్రోల్‌బంకు కూడలిలో పేలిన పైపులైను స్థానంలో కొత్తగా రీప్లేస్‌మెంట్ పైపులైను పనులు చేపడుతున్నారు. ఇదే అదునుగా మరమ్మతులు చేపట్టిన చోటే.. అనధికార నిర్మాణం వెలుస్తుండడం గమనార్హం.

**నోటీసులు జారీ చేశాం**తాడిపూడి పైపులైనుపై ఉన్న అక్రమ నిర్మాణదారులకు ఇటీవల నోటీసులు జారీ చేశాం. వాటిని పట్టుకుని స్థానిక ప్రజాప్రతినిధి దగ్గరికి వెళ్లారు. కొన్ని రోజులు ఆపాం. మళ్లీ రెండోసారి అక్రమ నిర్మాణదారులకు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటాం.సింహాచలంనాయుడు, ఏఈ, మంచినీటి విభాగం

# ఆక్రమణ చెరలో చెరువు



బుక్కరాయసముద్రం : బుక్కరాయసముద్రం మండల పరిధిలోని పాత చెదుళ్ల గ్రామంలో శింగనమల చెరువు భూమిని కొందరు వైకాపా నాయకులు యథేచ్ఛగా ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నారు. చెదుళ్ల గ్రామానికి కేవలం 500 మీటర్ల దూరంలోనే శింగనమల చెరువు ఉంది. ప్రస్తుతం చెరువు సగం వరకూ నీరు ఉండటంలో పశువులు, గొర్రెలు నీరు తాగడానికి ఉపయోగపడుతున్నాయి. **60 ఎకరాల్లో సాగు**

చెరువు ఖాళీ ప్రదేశంలో గతంలో గ్రామస్థులు పశువులను, గొర్రెలను మేతకు తీసుకెళ్లేవారు. గత ఐదేళ్లూ వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉండటంతో గ్రామానికి చెందిన కొందరు వైకాపాకు నాయకులు చెరువు భూమిలో దుక్కులు దున్ని పంటలు సాగు చేశారు. ఇప్పటికీ దాదాపుగా 60 ఎకరాలకు పైగా చెరువు భూమిలో పంటలు సాగు చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు.

**అడుగుపెట్టనివ్వని వైకాపా నాయకులు**

భూముల్లోకి వైకాపా నాయకులు పశువులను, గొర్రెలను రానివ్వకపోవడంతో పశుగ్రాసం కొరత తలెత్తిందని గ్రామస్థులు వాపోతున్నారు. గొర్రెల కాపరులు మేతకోసం సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. ప్రజల అవసరాలకు ఉపయోగపడాల్సిన చెరువు స్థలంలో ఇలా కొందరు నాయకులు పంటలు సాగు చేయడమేంటని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా నీటిపారుదలశాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు చొరవ తీసుకుని చెరువు భూమిలో పంటలు సాగు చేయకుండా అడ్డుకుని పశువులు, గొర్రెలు మేతకు తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# ప్రభుత్వ భూమిలో స్థిరాస్తి క్షేత్రానికి రహదారి

సూళ్లూరుపేట : అధికారుల అండ, రాజకీయ నేతల సిఫార్సు ఉంటే అక్రమమైనా సక్రమం అవుతుంది. ఇదే కోవలోనే సూళ్లూరుపేట మండలంలోని కోటపోలూరు రెవెన్యూలో ప్రభుత్వ స్థలంలో ఓ స్థిరాస్తి క్షేత్రానికి ఏకంగా సిమెంటు రోడ్డు వేసేశారు. గత వైకాపా ప్రభుత్వంలో ఈ వ్యవహారం నడిచింది. దీనిని అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం స్థిరాస్తి క్షేత్రం నిర్వాహకులకు సాయమందించింది. ఇది ఎక్కడో మారుమూల పల్లెలో కాదు. చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారికి అనుకుని ఉండే ప్రభుత్వ భూమిలోనే.

గత ప్రభుత్వంలో జాతీయ రహదారి పక్కన రియల్టర్లు ఓ స్థిరాస్థి క్షేత్రం ఏర్పాటు చేశారు. దీనికి జాతీయ రహదారి నుంచి నేరుగా



రోడ్డు వసతి ఏర్పాటు చేసుకునే వీలుంది. కానీ వారి భూమిలో రోడ్డు వేయకుండా దానిని వాణిజ్య అవసరాలకు విక్రయించేలా ఏర్పాటు చేసుకున్నారు. దాంతో స్థిరాస్థి క్షేత్రానికి కోటపోలూరు రెవెన్యూలో సర్వేనంబరు 46-2లో 58 సెంట్లు, 49లో 44 సెంట్ల విస్తీర్ణం డొంక పోరంబోకు ఉంది. ఇది జాతీయ రహదారి నుంచి రైల్వే కట్ట వరకు విస్తరించింది. ఇందులో కొంత భాగాన్ని స్థిరాస్తి క్షేత్రం వారు ఆక్రమించేసి, సిమెంటు రోడ్డు వేశారు. అప్పట్లో వైకాపా నేతలు తోడ్పడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చినా చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలొస్తున్నాయి.

**మా దృష్టికి వచ్చింది: కిరణ్మయి, ఆర్డీవో**

సిమెంట్ రోడ్డు విషయం మా దృష్టికి వచ్చింది. అధికారులతో చర్చించాం. క్షేత్రస్థాయిలో సర్వే చేసి చర్యలు తీసుకుంటాం.

# హంద్రీ ఆయకట్టులో అలజడి

పత్తికొండ : ఉమ్మడి కర్నూలు జిల్లా రైతులకు హంద్రీనీవా ఆదరువుగా ఉంటోంది. నందికొట్కూరు నుంచి పత్తికొండ వరకు పారుతున్న కాల్వ వెంట దాదాపు 27 వేల ఎకరాల్లో పంటలు సాగు చేసుకొంటున్నారు. ఈ నెల 15 నుంచి నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించడంతో ఆయకట్టు రైతుల్లో అలజడి మొదలైంది. నందికొట్కూరు, దేవనకొండ, పత్తికొండ, మద్దికెర, వెల్దుర్తి, కృష్ణగిరి, డోన్, ప్యాపిలి మండలాల రైతులు కాల్వ నీటి ఆధారంగా వివిధ పంటలు సాగు చేశారు. ఖరీఫ్‌లో 31 వేల ఎకరాలు, రబీలో 27 వేల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. పంట కాల్వలు లేవు.. ప్రధాన కాల్వలో పైపులు వేసి కి.మీ. మేర నీటిని తీసుకెళ్తారు. ఒక్కో రైతు భగీరథ ప్రయత్నమే చేస్తారు. వేరుసెనగ ఈ నెలాఖరుకు మిరప, ఉల్లి, వంకాయ తదితర పంటలు వచ్చేనెలలో చేతికందనున్నాయి. ఈతరుణంలో నీటి తడి అందకపోతే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని



రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**28.830 టీఎంసీల వినియోగం**

హంద్రీనీవా కాల్వకు గతేడాది ఆగస్టు నుంచి ఇప్పటివరకు 28.830 టీఎంసీల నీటిని సరఫరా చేసినట్లు అధికారులు చెబుతున్నారు. మార్చి 15 నాటికి మరో 1.770 టీఎంసీల నీటిని అందిస్తాం.. నిత్యం 1,200 క్యూసెక్కుల మేర 215 రోజుల పాటు మల్యాల పంప్‌హౌస్ నుంచి విడుదల చేసినట్లు అధికారులు ప్రకటించారు.

**నెలాఖరు వరకు ఇవ్వాలి - మధు, హొసూరు**

హంద్రీనీవా ప్రధాన కాల్వ పక్కనే పొలం ఉంది.. నీటి ఆధారంగా వంకాయ తోట సాగు చేశారు. మా ఒక్క గ్రామంలోనే 1,500 ఎకరాల్లో మిరప, వంకాయ, వేరుసెనగ, ఉల్లి సాగు చేశా. కాల్వ నీళ్లే ఆధారం.. ఇప్పుడు నీటి సరఫరా నిలిపివేస్తే తీవ్రంగా నష్టపోతాం.. ఈనెలాఖరు వరకు ఇస్తే పంటలు చేతికొస్తాయి.

# బిల్లు లొల్లి ఉండదిక

ఆదోని : పురపాలక సంఘాల్లో చేపట్టే పనులకు సంబంధించి ఏప్రిల్ నుంచి ఎక్కడికక్కడే బిల్లులు చెల్లించాలని 'కూటమి' ప్రభుత్వం నిర్ణయించడంతో ప్రగతి పరుగులు పెట్టనుంది. పురపాలికల్లో పనులంటే ఒకప్పుడు గుత్తేదారులు ఎగిరి గంతేసేవారు. వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎఫ్‌ఎంఎస్ విధానంలో బిల్లులు చెల్లించే ప్రక్రియను తీసుకొచ్చింది. పురపాలికలకు ఆర్థికస్వేచ్ఛ లేకుండా చేశారు. చేసిన పనులకు సీఎఫ్‌ఎంఎస్‌లో పొందుపర్చి నెలల పాటు ఎదురుచూడాల్సిన పరిస్థితిని తీసుకొచ్చారు. దీంతో పనులు చేపట్టడానికి గుత్తేదారులు ముందుకురాలేదు.



**ఎక్కడెక్కడ ఎలా ఉందంటే**

ఆదోనిలో రూ.6 కోట్ల వరకు బిల్లులు చెల్లించాలి. ఎన్నికల ముందు హడావుడిగా చేపట్టిన గడప గడపకు సంబంధించిన బిల్లులే రూ.కోట్లలో ఉన్నాయి. నంద్యాలలో రూ.30 కోట్ల వరకు విద్యుత్తు, శానిటేషన్ తదితర వాటికి చెల్లించాలి. గడప గడపకు సంబంధించి రూ.2-3 కోట్ల బిల్లులు ఇవ్వాల్సి ఉంది. డోన్‌లో రూ.6 కోట్లు చెల్లించాలి.

బేతంచెర్లలో రూ.3.45 కోట్లు, ఎమ్మిగనూరు పురపాలికలో రూ.2-3 కోట్లు ఆళ్లగడ్డలో రూ.2 కోట్లు, ఆత్మకూరులో రూ.20 లక్షలు, కర్నూలులో రూ.40 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి.

కుడాకు రూ.40 లక్షలు, సీఎండీఎఫ్ రూ.30 లక్షలు, ప్రత్యేక గ్రాంటు రూ.2.70 కోట్లు, కూరగాయల మార్కెట్ బిల్లులు రూ.3 కోట్లు, అదనపు గ్రాంట్ కింద రూ.1.50 కోట్లు ఇవ్వాలి.

చురకలు


# జడ్పీ ఆస్తులు చే'జారి'పోతున్నాయ్!

అనకాపల్లి : జిల్లా పరిషత్తు ఆస్తులు ఇప్పటికే చాలావరకు అన్యాక్రాంతమైపోయాయి. జీవీఎంసీ మొదలుకొని అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో రూ.కోట్ల విలువైన భూములు ఆక్రమణదారుల చెరలో చిక్కుకుపోయాయి. ఉన్న అరకొర ఆస్తులను కాపాడుకోవడం జడ్పీ అధికారులకు సవాల్‌గా మారుతోంది. 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వంలో జడ్పీ ఆస్తుల సంరక్షణకు జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఓ కమిటీ ప్రత్యేకంగా పనిచేసింది. వైకాపా అధికారంలోకి వచ్చాక స్థానిక సంస్థలను పూర్తిగా పట్టించుకోవడం మానేసింది. దీంతో మరిన్ని ఆక్రమణలకు తెరలేచింది. అతిథి గృహాల నుంచి వచ్చే ఆదాయం కూడా పడిపోయింది. ఈ మధ్యనే మరలా జడ్పీ ఆస్తుల రక్షణ, ఆదాయ వృద్ధిపై అధికారులు దృష్టిసారించి ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. జిల్లా పరిషత్తుకు ఉమ్మడి జిల్లాలో 310 పైగా ఆస్తులు ఉన్నాయి. వీటిలో 280 వరకు జడ్పీ ఉన్నత పాఠశాలల స్థలాలే ఉన్నాయి. మిగతా వాటిలో కొన్ని ఖాళీ స్థలాలు, మరికొన్ని అతిథిగృహాలున్నాయి. ఏళ్ల తరబడి పాలకవర్గాలు పట్టించుకోకపోవడం, కోర్టు కేసులు, ఆక్రమణలపై అధికారులు ఉదాసీనత చూపడంతో జడ్పీ ఆస్తుల్లో ఆక్రమణదారులు పాతుకుపోయారు. విశాఖ నగరంతో పాటు అనకాపల్లి పట్టణంలో రూ.వందల కోట్ల విలువైన ఆస్తులు జడ్పీ చేజారిపోయాయి. అతిథిగృహాలన్నీ నిర్వహణ లేక, శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటి నుంచి పైసా ఆదాయం రావడం లేదు. ఇటీవల జడ్పీ సర్వసభ్య సమావేశంలో ఆస్తుల అన్యాక్రాంతంపై చర్చించిన



తర్వాత ఆక్రమణలపై ఆరాలు తీయడం మొదలుపెట్టారు.

**దస్త్రాల్లోనే ఆస్తులు.. దరి చూస్తే ఆక్రమణలే**

అనకాపల్లి పట్టణం శారదా నది సమీపంలో జిల్లా పరిషత్తుకు 11 ఎకరాల భూములున్నట్లు రెవెన్యూ రికార్డులు చెబుతున్నాయి. క్షేత్రస్థాయిలో చూస్తే కేవలం 30 సెంట్ల స్థలం మాత్రమే ఇప్పుడుంది. దానిపై కూడా ఆక్రమణదారులు కన్నేశారు. పొక్లెయిన్లతో చదునుచేసి నిర్మాణాలకు సిద్ధం చేసుకున్నారు. జీవీఎంసీ పరిధిలోని పురుషోత్తపురంలో ఎకరా పైబడి జడ్పీ స్థలం ఉండేది. అందులో కొంత స్థానికులు ఆక్రమించారు. గుడి కట్టేశారు. ఇప్పుడు 60 సెంట్లు స్థలం మాత్రమే ఉంది. ఆక్రమణదారులు పాగా వేయక ముందరే ఆ స్థలాన్ని జడ్పీ రక్షణలోకి తెచ్చుకోవాలి. గోపాలపట్నం, సింహాచలం రైల్వేస్టేషన్ సమీపంలో విలువైన స్థలాలు, శిథిల భవనాలున్నాయి. వీటిని జడ్పీ నుంచి తప్పించి ఇతర అవసరాలకు వినియోగించుకునేలా నేతలు ఒత్తిళ్లు తెస్తున్నట్లు తెలిసింది. అచ్యుతాపురం మండలం దోసూరులో ఉన్నత పాఠశాల స్థలం విషయంలో కోర్టులో కేసులు నడుస్తున్నాయి. అల్లూరి జిల్లా అరకులోయ, పాడేరు, చింతపల్లి వంటి పర్యాటక ప్రాంతాల్లో అతిథిగృహాలున్నా వాటితో పైసా ఆదాయం రావడం లేదు.

**రక్షణ చర్యలు తీసుకుంటాం**

జడ్పీ ఆస్తులు ఆక్రమణలకు గురికాకుండా రక్షణ చర్యలు తీసుకుంటున్నాం. ఖాళీ స్థలాలకు కంచె ఏర్పాటు చేస్తాం. అతిథిగృహాలను ఆదాయ వనరులుగా మార్చుకుంటాం. కోర్టు కేసుల్లో ఉన్నవాటిపై దృష్టిసారించాం. ఇకపై సెంటు జాగా కూడా అన్యాక్రాంతం కానివ్వకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. నారాయణమూర్తి, జడ్పీ సీఈవో

# పొదుపు స్ఫూర్తి.. ఈ-వ్యాపార దీప్తి

చిత్తూరు : డ్వాక్రా మహిళలు ఈ-వ్యాపారం దిశగా సన్నద్ధమవుతున్నారు. ఇంటి నుంచే ఉత్పత్తులు విక్రయించి ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్నారు. పొదుపు ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు, మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం 176 సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) ఏర్పాటు చేయనుంది. రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు రుణ సౌకర్యం కల్పిస్తోంది. ఇదే సమయంలో వారు తయారు చేసిన ఉత్పత్తులకు డిజిటల్ మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తోంది. 'ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్' తోడ్పాటుతో వినియోగదారులకు అవసరమైన వస్తువులు, ఉత్పత్తులు ఆన్‌లైన్ వేదికగా తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. కలంకారీ, డెయిరీ, చేనేత, మిల్లెట్ ఉత్పత్తులు, కూరగాయలు, చెక్కబొమ్మలు, ఎంబ్రాయిడరీ దుస్తులు, జనపనార బ్యాగులు వంటివాటిని ఈ-కామర్స్ వేదికపైకి తీసుకొస్తున్నారు. ఇప్పటికే 578 రకాల వస్తువులను గుర్తించి విక్రయానికి ఉంచారు. వీటి సంఖ్య మరింత పెంచడంతోపాటు లావాదేవీల మొత్తాన్ని పెంచడంపై డీఆర్‌డీఏ అధికారులు చర్యలు చేపడుతున్నారు. మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

జిల్లాలోని గ్రామ సమాఖ్యలు : 1,247 సభ్యులు : 3,70,419



గుర్తించిన వస్తువులు : 578

ఆన్‌లైన్‌లో నమోదు : 530


**కేంద్ర ప్రభుత్వ లబ్ధి ఇలా..**

ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్ఎంఈ) పథకం కింద జిల్లాలో 57 మందిని ఎంపిక చేయగా రూ.2.25 కోట్ల వరకు లబ్ధి చేకూరనుంది. ప్రధానమంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ (పీఎంఈజీపీ) ద్వారా మరో 570 మందిని జిల్లాలో ఎంపిక చేయగా వీరికి రూ.20 కోట్ల వరకు లబ్ధి చేకూరనుంది.

**మహిళల ఉన్నతికి అడుగులు**

పొదుపు మహిళలను అన్నివిధాలుగా ప్రోత్సహిస్తూ, ఈ- వ్యాపారం అభివృద్ధి సాధించే దిశగా వారిని ప్రోత్సహిస్తున్నాం. ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో పొందుపరిచి వినియోగదారులకు చేరేలా చూస్తున్నాం. జిల్లాలో దాదాపు వెయ్యిమందికి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నాం. శోభన్‌బాబు, డీఆర్‌డీఏ పీడీ, తిరుపతి జిల్లా

# పట్టాలెక్కనున్న 'పేరూరు'!



అనంతపురం: గత వైకాపా ప్రభుత్వం 75 వేల ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టును గాలికొదిలేసింది. రీ డిజైనింగ్ పేరుతో ఐదేళ్ల పాటు ఒక్క గంప మట్టి తీయకుండా మాటలతోనే కాలయాపన చేసింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రాజెక్టులను పట్టాలెక్కించి పేరూరు జలాశయాన్ని కృష్ణా జలాలతో నింపాలనే సంకల్పంతో అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగానే హంద్రీనీవాకు రూ.3,243 కోట్లు కేటాయించారు. జీడిపల్లి-పేరూరు ఎత్తిపోతల పథకం పనులకు కొంతమేర ఖర్చు చేయనున్నారు. ప్రధాన కాలువ భూసేకరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పరిహారం చెల్లించి పనులు మొదలు పెట్టనున్నారు. తర్వాత సోమరవాండ్లపల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. రెండేళ్లలో పనులు పూర్తిచేయాలనే లక్ష్యంతో ప్రణాళిక రూపొందిస్తున్నారు.

**కరవు ప్రాంతానికి వరం**

బెళుగుప్ప, ఆత్మకూరు, రామగిరి, కనగానపల్లి. కంబదూరు మండలాల పరిధిలో సాగునీరు అందించాలనే లక్ష్యంతో 2018లో సీఎం చంద్రబాబు జీడిపల్లి-పేరూరు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. కర్ణాటక ప్రాజెక్టుల కారణంగా పేరూరుకు నీరు చేరడం తగ్గిపోవడంతో హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలు అందించాలని పనుల్ని వేగవంతం చేశారు. రూ.803 కోట్ల అంచనాతో మొదటిదశలో రూ.565 కోట్లకు టెండర్లు పిలిచి పనులు చేపట్టారు. 37 కిలోమీటర్ల ప్రధాన కాలువ పూర్తిచేశారు. 988 ఎకరాల భూసేకరణ చేసి 67 ఎకరాలకు రూ.4.82 కోట్లు చెల్లించారు. రీడిజైన్ పేరుతో జగన్ కాలయాపన వైకాపా హయాం 2020, డిసెంబరులో రీడిజైన్ పేరుతో కొత్తగా దేవరకొండ, తోపుదుర్తి రిజర్వాయర్లకు శంకుస్థాపన చేశారు. పుట్టకనుమను రద్దు చేశారు. 17 గ్రామాల పరిధిలోని రైతులకు అధిక మొత్తంలో పరిహారం ఇస్తామని నమ్మబలికారు. మూడున్నరేళ్లలో ఒక్కరికీ రూపాయి చెల్లించలేదు. దేవరకొండ, తోపుదుర్తి ప్రాజెక్టుల్లో భూములు కోల్పోతున్న రైతులు జగన్ మోసాన్ని గమనించి భూములు ఇచ్చేందుకు ముందుకు రాలేదు. మూడున్నరేళ్ల పాటు పనులు నిలిచిపోయాయి.

**మళ్లీ కదలిక**

కూటమి ప్రభుత్వం వచ్చాక ఎత్తిపోతల పథకం పనుల్ని మొదలు పెట్టాలని స్థానిక ఎమ్మెల్యే పరిటాల సునీత జలవనరులశాఖ మంత్రిని కోరారు. ఈ మేరకు పథకానికి 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.200 కోట్లు కేటాయించే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రధాన కాలువ పనులు మొదలుపెట్టేందుకు 267 ఎకరాల భూసేకరణకు రూ.14.64 కోట్లు విడుదల కావాల్సి ఉంది. మొత్తం భూసేకరణకు రూ.136 కోట్లు వెచ్చించాల్సి ఉంది. ముందుగా ప్రధాన కాలువ పనులు చేపట్టాలనే యోచనలో అధికారులు ఉన్నారు. సుమారు 500 మంది రైతులకు భూసేకరణ పరిహారం చెల్లించి త్వరలోనే పనులు మొదలుపెడతామని హంద్రీనీవా ఎస్ఈ రాజా స్వరూప్ పేర్కొన్నారు.

# గృహ విద్యుత్తు వినియోగదారులకు సువర్ణ అవకాశం



అనంతపురం : గత వైకాపా ప్రభుత్వ పాలనలో గృహ విద్యుత్తు వినియోగదారులకు చుక్కలు చూపించారు. నిబంధనల ప్రకారం తీసుకున్న లోడుకంటే ఒక కిలోవాట్ అదనంగా వాడినా అపరాధ రుసుం విధించారు. వినియోగదారులు చేసేదిలేక ఆ మొత్తాలను చెల్లించేవారు. ఇలా ఒకటి రెండు కాదు ఉమ్మడి అనంతపురం జిల్లాలో లక్ష కనెక్షన్‌లకు అదనపు లోడు పేరుతో అపరాధ రుసుం రూ.20 కోట్ల మేర విధించి, వసూళ్లు చేశారు. ప్రస్తుతం కూటమి సర్కారు అదనపు లోడు వాడుతున్న వినియోగదారులకు సువర్ణ అవకాశం కల్పించింది. స్వచ్ఛందంగా అదనపు లోడును క్రమబద్ధీకరించుకుంటే ఒక కిలోవాట్‌కు 50 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు ప్రకటించింది. ఈ నెల 1 నుంచి జూన్ 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించినట్లు విద్యుత్తుశాఖ ఎస్ఈ శేశాద్రిశేఖర్ తెలిపారు.

**తక్కువ లోడు తీసుకుని.. ఎక్కువ వాడుతున్న వారికి ప్రయోజనం**

విద్యుత్తు సర్వీసు తీసుకునే సమయంలో ఇంట్లో వినియోగించే ఎలక్ట్రికల్ వస్తువులను బట్టీ కిలోవాట్‌లను తీసుకుని ఉంటారు. కిలోవాట్‌ల మేరకే డెవలప్‌మెంట్ ఛార్జీ, సెక్యూరిటీ డిపాజిట్ మొత్తాలను విద్యుత్తుశాఖకు చెల్లించి ఉంటారు. ప్రస్తుతం ఇంట్లో ఎలక్ట్రికల్ వస్తువులు, ఫ్యాన్లు, ఏసీల వినియోగం పెరుగుతుంది. ఈ క్రమంలో తీసుకున్న లోడు కంటే అదనంగా విద్యుత్తు వినియోగించాల్సిన పరిస్థితి ఉంటుంది. ఇలా అదనపు లోడు వినియోగిస్తున్న వారందరూ లోడు క్రమబద్ధీకరించుకునే అవకాశాన్ని ఎస్పీడీసీఎల్ కల్పించింది. లోడ్ పెంచుకునే వారికి ఒక కిలోవాట్‌కు రూ.1000 మేర (యాభైశాతం) రాయితీ లభిస్తుంది.

గతంలో గృహ విద్యుత్తు సర్వీసుకు ఒక కిలోవాట్ విద్యుత్తు పొందాలంటే డెవలప్‌మెంట్ ఛార్జ్ మొత్తం రూ.2,000, సెక్యూరిటీ డిపాజిట్ రూ.200, అప్లికేషన్ ఫీజు 25 నిబంధనల ప్రకారం డీడీలు తీసి శాఖకు చెల్లించాల్సి ఉండేది. ప్రస్తుతం అదనపు లోడు క్రమబద్ధీకరించుకునే వినియోగదారులు ఒక కిలోవాట్‌కు రూ.1000 మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. ఏపీఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్‌లో అడిషనల్ లోడును క్రమబద్ధీకరించుకోవచ్చు. లేకపోతే విద్యుత్తు సెక్షన్, ఈఆర్‌వో కార్యాలయాల్లో సంప్రదించాలి. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఈ కోరారు.

# అతిగా రెచ్చిపోతున్నారు

విశాఖపట్నం : నగరంలోని రోడ్లపై కుర్రకారు రయ్..రయ్ అంటూ అతివేగంతో దూసుకెళుతున్నారు. భారీ వాహనాల పక్కనే బైకులను మెలికలు తిప్పుతూ, వంచి నడుపుతూ అధిగమిస్తున్నారు. ట్రాఫిక్ కూడళ్లలోనూ కళ్లు మూసి తెరిచేలోగా రోడ్డు దాటేస్తున్నారు. చీకటిపడితే చాలు బీచ్ రోడ్డులో రేసర్లు భారీ శబ్దాలతో వాహనాలు నడుపుతూ బెంబేలెత్తిస్తున్నారు. వీటన్నింటి ఫలితంగా ప్రమాదాలతో నగర రోడ్లు రక్తమోడుతున్నాయి. ఈ ప్రమాదాల్లో ఎక్కువగా ద్విచక్ర వాహన చోదకులుంటుండగా, మృతుల్లో భవిష్యత్ ఉన్న యువత ఉండటం కలవరపెడుతోంది.

ప్రమాదాలకు కారణాలెన్నో..

అతి వేగం, నిర్లక్ష్యంగా నడపడం మద్యం, గంజాయి మత్తులో ర్యాష్ డ్రైవింగ్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యేందుకు బైకులపై స్టంట్లు చేయడం మైనర్ల చేతికి బైకులు

యువత ప్రాణాలు జారుతున్నాయి..

భారీ వాహనాల వెనుక అతి సమీపంలో బైకులు నడుపుతున్నారు. ఈ సమయంలో ట్రాఫిక్ కారణాలతో ముందున్న భారీ వాహనాలు అకస్మాత్తుగా బ్రేకులు వేయడంతో వెనుక వైపు ఉన్న ద్విచక్ర వాహనాల్ని అదుపు చేయలేక ఢీకొంటున్నారు. ద్విచక్ర వాహనాలు రోడ్లపై అదుపుతప్పిన సమయంలో హెల్మెట్ ధరించకపోవడం వల్ల తలకు బలమైన గాయాలై మృతి చెందుతున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. అతివేగాన్ని అదుపు చేయలేక ఒక్కసారిగా బ్రేకులు వేయడంతో రోడ్డు పక్కన డివైడర్లను ఢీకొనడం, బండి సహా జారి కిందకు పడిపోవడం వంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కూడళ్లలో, ఇరుకు రోడ్లలో ద్విచక్ర వాహనాలు అతివేగంతో ఎదురెదురుగా ఢీకొంటున్నాయి. ఇలాంటి ప్రమాదాల్లో మృతుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. నగరంలోని రోడ్లపై కుర్రకారు రయ్..రయ్ అంటూ అతివేగంతో దూసుకెళుతున్నారు. భారీ వాహనాల పక్కనే బైకులను మెలికలు తిప్పుతూ, వంచి నడుపుతూ అధిగమిస్తున్నారు. ట్రాఫిక్ కూడళ్లలోనూ కళ్లు మూసి తెరిచేలోగా రోడ్డు దాటేస్తున్నారు. చీకటిపడితే చాలు బీచ్ రోడ్డులో రేసర్లు భారీ శబ్దాలతో వాహనాలు నడుపుతూ బెంబేలెత్తిస్తున్నారు. వీటన్నింటి ఫలితంగా ప్రమాదాలతో నగర రోడ్లు రక్తమోడుతున్నాయి. ఈ ప్రమాదాల్లో ఎక్కువగా ద్విచక్ర వాహన చోదకులుంటుండగా, మృతుల్లో భవిష్యత్ ఉన్న యువత ఉండటం కలవరపెడుతోంది.

ప్రమాదాలకు కారణాలెన్నో..అతి వేగం, నిర్లక్ష్యంగా నడపడం మద్యం, గంజాయి మత్తులో ర్యాష్ డ్రైవింగ్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యేందుకు బైకులపై స్టంట్లు చేయడం మైనర్ల చేతికి బైకులుయువత ప్రాణాలు జారుతున్నాయి..భారీ వాహనాల వెనుక అతి సమీపంలో బైకులు నడుపుతున్నారు. ఈ సమయంలో ట్రాఫిక్ కారణాలతో ముందున్న భారీ వాహనాలు అకస్మాత్తుగా బ్రేకులు వేయడంతో వెనుక వైపు ఉన్న ద్విచక్ర వాహనాల్ని అదుపు చేయలేక ఢీకొంటున్నారు. ద్విచక్ర వాహనాలు రోడ్లపై అదుపుతప్పిన సమయంలో హెల్మెట్ ధరించకపోవడం వల్ల తలకు బలమైన గాయాలై మృతి చెందుతున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. అతివేగాన్ని అదుపు చేయలేక ఒక్కసారిగా బ్రేకులు వేయడంతో రోడ్డు పక్కన డివైడర్లను ఢీకొనడం, బండి సహా జారి కిందకు పడిపోవడం వంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కూడళ్లలో, ఇరుకు రోడ్లలో ద్విచక్ర వాహనాలు అతివేగంతో ఎదురెదురుగా ఢీకొంటున్నాయి. ఇలాంటి ప్రమాదాల్లో మృతుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. దూకుడుకు కళ్లెం వేస్తేనే..: నగరంలో ద్విచక్ర వాహనాల వేగానికి కళ్లెం వేయాల్సిన అవసరం ఉంది. ట్రిపుల్ రైడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, శిరస్త్రాణం ధరించని, మైనర్ డ్రైవింగ్‌పై పోలీసులు జరిమానాలు విధిస్తున్నారు. కొందరు యువత బైకుల సైలెన్సర్లు తీసేసి భారీ శబ్దాలతో హడావుడి చేస్తున్నారు. బీచ్ రోడ్డులో అయితే రాత్రి వేళల్లో ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ పాదచారులు, వాహన చోదకులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారు. కొన్ని రోడ్లలో యువకులు రాత్రివేళల్లో రేసులు సైతం నిర్వహిస్తున్నారు.

# వేతన వేదన

చిత్తూరు : జిల్లాలో ఉపాధి హామీ కూలీలకు 50 రోజులుగా చెల్లింపులు నిలిచిపోయాయి.. ఈనెల మూడో తేదీ నాటికి రూ.30 కోట్లు మేర కూలీలకు వేతనాలు ఇవ్వాలి.. వ్యవసాయ పనులకు విరామం రావడంతో కూలి డబ్బులపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాల పరిస్థితి దుర్భరంగా మారింది.. జనవరి 13 తర్వాత ఉపాధి కూలీలకు డబ్బులు అందలేదు.

జిల్లాలో మండలాలు: 31

ప్రభుత్వం ఇచ్చిన జాబ్‌కార్డులు: 2.67 లక్షలు

ఉపాధి పొందుతున్న కూలీల సంఖ్య: 4.79 లక్షలు

వంద రోజుల పనిదినాలు పూర్తయినవి : 9,173

రోజువారీ సగటు వేతనం : రూ. 258.51

**రోజుకు 30 వేల మంది పనికి..**

జిల్లాలో 4.79 లక్షల మంది ఉపాధి కూలీలు ఉన్నారు. వీరిలో ప్రస్తుతం రోజుకు 30 వేల మందే పనికి హాజరవుతున్నారు. గతంలో రోజుకు సగటున 50 వేల మంది పనులకు హాజరయ్యేవారు. వేతనాలు ఆలస్యం కావడంతో ఈ సంఖ్య 30 వేలకు పడిపోయింది. నెలల తరబడి కూలి డబ్బు అందకుంటే కుటుంబాలు గడవడం కష్టంగా ఉందని, అందుకే ఈ పనులు మానేసి ఇతర పనులకు వెళ్తున్నామని ఉపాధి



కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండల తీవ్రత పెరగడం, వ్యవసాయ పనులు లేకపోవడం, ప్రతి కుటుంబానికి వంద పనిదినాలు లక్ష్యం కావడంతో వేతనదారులు ఉదయం ఏడు గంటలకే పనికి వెళ్తున్నారు. జిల్లాలో సగటు వేతనం రూ.258.51గా ఉంది. నిబంధనల ప్రకారం ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ అప్‌లోడ్ చేసిన 15 రోజులకు వేతనాలు చెల్లించాలి. ఎప్పటికప్పుడు ఎఫ్‌టీవో అప్‌లోడ్ చేస్తున్నామని, ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావాల్సి ఉందని ఉపాధి హామీ సిబ్బంది చెబుతున్నారు. 'ప్రస్తుతం రోజుకు 30 వేల మంది పనులకు హాజరవుతున్నారు. జనవరి 13 నుంచి ఉపాధి కూలీలకు వేతనాలు అందాల్సి ఉంది. త్వరలో బకాయిలు విడుదలవుతాయి. రవికుమార్, పీడీ డ్వామా

# నాణ్యత నాసి.. బిల్లుల వాసి

కర్నూలు : 1.51 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చే తుంగభద్ర దిగువ కాల్వలో అక్రమాల ప్రవాహం పోటెత్తుతోంది. చివరి ఆయకట్టుకు సాఫీగా నీళ్లు ఇవ్వాలన్న ఉద్దేశంతో నాలుగు వందల కోట్లు పెట్టి పనులు చేపట్టారు. నీళ్లు ఇచ్చే సమయానికి నెల రోజుల ముందు హడావుడిగా 2022 నుంచి 2023 వరకు ప్యాకేజీలుగా విభజించి ఆధునికీకరణ పనులు తూతూమంత్రంగా చేశారు. అధికారుల పర్యవేక్షణ లేకుండా గుత్తేదారులు ఇష్టానుసారంగా చేశారు. ప్రస్తుతం బోర్డు నిధులు విడుదల చేయడంతో కమీషన్ల పంచాయితీ మొదలైంది.

**రూ.448 కోట్ల పనులు**

ఆంధ్ర, కర్ణాటక ప్రజల జీవనాడి తుంగభద్ర దిగువకాల్వ (ఎల్లెల్సీ) చివరి ఆయకట్టుకు సాగునీరు అందించే ఉద్దేశంతో తుంగభద్ర బోర్డు పరిధిలోని 0 నుంచి 250 కి.మీ. వరకు, జిల్లా పరిధిలోని 135 కి.మీ. నుంచి 205 వరకు లైనింగ్ పనులు చేపట్టారు. ఇందుకు రూ.448 కోట్ల వరకు వెచ్చించారు. వైకాపాకు చెందిన ఓ నేత పనులు దక్కించుకొన్నారు. తొమ్మిది ప్యాకేజీలుగా విభజించి 2022 జూన్‌లో పనులు మొదలుపెట్టారు. మోకా, చింతకుంట, బాపురం హెళగుంద, హానవాళు సెక్షన్ల పరిధిలో లైనింగ్, ఫ్లోరింగ్ పనులు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో రూ.100 కోట్ల వరకు బిల్లులు చెల్లించి మిగిలినవి పెండింగ్‌లో పెట్టారు.

**చక్రం తిప్పిన ఓ కీలక అధికారి**

పెండింగ్ బిల్లులు చెల్లించాలని తుంగభద్ర బోర్డు నిర్ణయించింది. నెల రోజుల కిందట రూ.313 కోట్లు విడుదల చేసింది. అందులో రూ.113 కోట్లను బోర్డు అవసరాలకు ఉంచి మిగిలిన రూ.200 కోట్లు గుత్తేదారులకు ఇవ్వాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఆ బిల్లు రావాలంటే 7.5 శాతం కమీషన్ చెల్లించాలని కొందరు మధ్యవర్తిత్వం వహిస్తున్నారు. సదరు వ్యక్తులు రంగంలోకి దిగి కమీషన్ చెల్లించిన వెంటనే బిల్లుల చెల్లింపు క్షణాల్లో జరిగిపోతుందని బేరం చేస్తున్నారు.



కమీషన్ రూపంలో వచ్చే రూ.15 కోట్లలో ఎవరికి ఎంత శాతం వాటా ఇవ్వాలో జాబితా కూడా సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది. తుంగభద్ర బోర్డులోని ఓ అధికారి చక్రం తిప్పి కొందరు నాయకుల సాయంతో పెండింగు బిల్లులు వచ్చేలా చేశారని ప్రచారం జరుగుతోంది. కొందరు గుత్తేదారులు కమీషన్ ఇచ్చేందుకు నిరాకరించడంతో వారిపై బెదిరింపులు దిగినట్లు సమాచారం.

**పనులన్నీ నాసిరకం**

పనులు దక్కించుకొన్న గుత్తేదారులు కాల్వకు నీళ్లు విడుదల చేసే సమయంలో పనులు చేపట్టారు. ఎలాంటి క్యూరింగ్ చేయలేదు. సరైన ప్రమాణాలు పాటించకపోవడం.. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గుత్తేదారులు ఇష్టారాజ్యంగా చేపట్టారు. క్యూరింగ్ సరిగా లేకపోవడంతో ఆర్‌సీసీ లైనింగ్‌లో చీలికలు వచ్చాయి. పలుచోట్ల సిమెంట్ పూతలు పూశారు. ఫ్లోరింగ్ దెబ్బతింది, మరికొన్నిచోట్ల లైనింగ్ నెర్రెలిచ్చింది. చాలా చోట్ల కాల్వ లైనింగ్‌కు చీలికలు వచ్చాయి.

# సర్వీసు దారిలో రక్తచారికలు

ఆళ్లగడ్డ : నంద్యాల– కడప (40వ జాతీయ రహదారి) దారి ప్రమాదకరంగా మారింది.. 2016లో నాలుగు వరుసలుగా మార్చారు.. తొమ్మిదేళ్లు అయినా సర్వీస్ రోడ్లు, జంక్షన్ల వద్ద నిర్వహణ లోపం ప్రమాదాలకు 'దారి'తీస్తోంది. పలు చోట్ల సర్వీసు రోడ్లు అసంపూర్తిగా ఉన్నాయి. నల్లగట్ల వద్ద స్థల సేకరణ జరగక అసంపూర్తిగా వదిలేశారు. శిరివెళ్ల మెట్ట సమీపంలో నిబంధనలకు అనుగుణంగా నిర్మించలేకపోయారు. నల్లగట్ల, బత్తలూరు, గోవిందపల్లె, పేరాయపల్లె మెట్ట, కోటకందకూరు మెట్ట వద్ద నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. నిత్యం పెద్ద ఎత్తున వాహనాలు వెళ్తున్నాయి.. 'టోల్' రూపంలో భారీగా ఆదాయం వస్తోంది. నిర్వాహణదారులు పట్టించుకోవడం లేదు.



**బ్లాక్ స్పాట్‌లు వదిలేశారు**

చాగలమర్రి–నంద్యాల రహదారిపై ఐదు చోట్ల బ్లాక్ స్పాట్‌లను గుర్తించారు. పెద్దబోధనం మెట్ట, ఆళ్లగడ్డ రెండు బైపాస్‌లు, యర్రగుంట్ల మలుపు, మసీదుపురం మెట్ట అధికంగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలుగా గుర్తించారు. చాగలమర్రి మండలం మద్దూరు–పెద్దబోధనం గ్రామాల మధ్యలో నెలలో కనీసం పది రహదారి ప్రమాదాలు జరుగుతున్నాయి. నల్లగట్ల వద్ద అండర్ పాస్ లేకపోవడంతో గ్రామస్థులు రోడ్డును దాటుతూ ప్రమాదాలకు గురవుతున్నారు.
ఆళ్లగడ్డ శివార్లలో కడప రోడ్లు వైపు ఏడు రహదారుల కూడలి ఉంది. దీన్ని బ్లాక్ స్పాట్‌గా గుర్తించిన అధికారులు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడం లేదు. ఈ కూడలిలో గతేడాది నలుగురు మృతి చెందారు. మసీదుపురం కూడలి ప్రమాదాలకు నెలవుగా మారుతోంది. ఇక్కడా బ్లాక్ స్పాట్‌గా గుర్తించినా ప్రమాదాల నివారణకు కేవలం బారికేడ్లను ఉంచడం మినహా తీసుకున్న చర్యలు ఏవీ లేవు.
విశ్రాంతి గదులు మరిచారుసాధారణంగా జాతీయ రహదారిపై ప్రతి 60 కి.మీ ఒక చోట రెస్టు ఏరియాలను నిర్మించాల్సిన బాధ్యత హైవే అథారిటీ ఆఫ్ ఇండియాపై ఉంది ఇక్కడ వాహనదారులు విశ్రాంతి తీసుకోవడంతో పాటు, నిద్రకు ఉపక్రమించొచ్చు. యర్రగుంట్ల వద్ద రెస్టు ఏరియా ఉన్నా అందుబాటులోకి రాలేదు.

# శైవక్షేత్రం.. సమస్యల వలయం

యాగంటి: బనగానపల్లి మండల పరిధిలోని ప్రముఖ శైవక్షేత్రం అయిన యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి నిత్యం పెద్దసంఖ్యలో భక్తులు వస్తుంటారు. అయితే క్షేత్రంలో పలు సమస్యలు వేధిస్తున్నాయి. ఈ నెల 25 నుంచి మార్చి 1వ తేది వరకు శివరాత్రి ఉత్సవాలు నిర్వహణకు ఆలయాధికారులు సిద్ధమవుతున్నారు.
**ప్రధాన సమస్యలు ఇవే...**శివరాత్రి ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి దాదాపుగా 50 వేల మంది భక్తులు ఆలయానికి చేరుకుంటారు. అందుకు తగ్గట్లుగా మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కేవలం 28 మరుగుదొడ్లు ఉండగా.. కొత్తగా 12 నిర్మిస్తున్నారు. ఆలయంలో శుద్ధ జలయంత్రం నిరుపయోగంగా ఉంది. ఆలయంలో లోపలికి వస్తే నీరు లభించక ఇబ్బందులు పడుతుం



టారు. ఎర్రటికొండల్లోని గుహలకు వెళ్లడానికి వంతెనను ఏర్పాటు చేశారు. వంతెనకు ఇరువైపుల రక్షణ కవచాలుగా దిమ్మెలు అమర్చి పైపులు వేశారు. పలుచోట్ల దిమ్మెలు దెబ్బతిని పైపులు తుప్పుపట్టి ఉన్నాయి. శివరాత్రి ఉత్సవాలకు కిలోమీటరు దూరంలో వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేస్తుండటంతో.. చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఉత్సవాల సమయంలోనే చలువ పందిళ్లు, తివాచీలు వేస్తుంటారు. ప్రతి రోజూ వచ్చే భక్తులు ఎండలోనే ఉండాల్సిన పరిస్థితి ఉంది.
**పూర్తిస్థాయిలో ఏర్పాట్లు** యాగంటి ఆలయంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం. ముఖ్యంగా తాగునీటికి ఇబ్బందులు లేకుండా చేస్తాం. మురుగుదొడ్లు నిర్మాణం పనులు వేగంగా పూర్తిచేసి అందుబాటులోకి తెస్తాం. భక్తులకు ఎటువంటి భక్తులు లేకుండా చేస్తాం. చంద్రుడు, ఆలయాధికారి, యాగంటి

# రక్షణ మరిచి.. రక్కసిని పిలిచి

బలిజిపేట : ఉమ్మడి జిల్లాలోని పలు వంతెనలు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. రక్షణ గోడలు లేకపోవడం, రంధ్రాలు పడడం, రెయిలింగ్‌లు దెబ్బతినడం, కింది భాగాల్లోని మట్టి జారిపోవడం.. తదితర కారణాలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ చిత్రాలన్నీ ప్రస్తుత పరిస్థితికి అద్దం పడుతున్నాయి. బలిజిపేట నుంచి



నారాయణపురం గ్రామానికి వెళ్తున్న మార్గంలో పెదంకలాం కాలువపై నాలుగున్నర దశాబ్దాల కిందట నిర్మించిన మినీ వంతెన శిథిలావస్థకు చేరుకుంది. ఓ వైపున్న సిమెంటు గోడ ఇప్పటికే కూలిపోయింది. పక్కన అగాథం రూపంలో మృత్యువు పొంచి ఉంది. మెంటాడ మండలంలోని ఇప్పలవలస, జయతి గ్రామాల మధ్యగల కూనేటిగెడ్డపై గతంలో నిర్మించిన వారధికి నేటికీ రక్షణ లేదు. రామభద్రపురం మండలం కోటశిర్లాంలోని ఏడొంపుల గెడ్డపైనా ఇదే దుస్థితి.

# ఆక్రమించి.. యథేచ్ఛగా సాగుచేసి..!



సూళ్లూరుపేట : గూడూరు, సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్లలోని నీటి వనరులు, చెరువులు ఆక్రమణకు గురవుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. దరిమిలా గ్రామాల్లో శాంతి భద్రతలకు భంగం వాటిల్లుతోంది. మరికొన్ని ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులే ఆక్రమణదారులకు పట్టాలు మంజూరు చేసిన సందర్భాలున్నాయి. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు స్పందించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సూళ్లూరుపేట, వెంకటగిరి, గూడూరు నియోజకవర్గాల్లోని 14 మండలాల పరిధిలో 50 శాతం వరకు సాగునీటి వనరులు ఆక్రమణదారుల చెరలో ఉన్నాయి. సూళ్లూరుపేట మండలంలోని పులికాట్ తీరం కడపత్ర పంచాయతీ రాగన్నపట్టెడ సమీపంలోని అంగేరిగుంట చెరువులో 30 ఎకరాల మేర ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నారు. చుట్టూ సోలార్ ఫెన్సింగ్ వేశారని గ్రామస్థులు కలెక్టరేట్‌లో జరిగిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో ఫిర్యాదు చేశారు. దీనిపై జేసీ శుభం భన్సల్ ఆరా తీసినట్లు సమాచారం.

**మరికొన్ని రుజువులు..**

సూళ్లూరుపేట మండలం పడమటి పల్లెల్లో వెలగలపన్నూరు చెరువును పలువురు ఆక్రమించేశారు. పంటలు సైతం దర్జాగా సాగు చేస్తున్నారు. ఈ భూములకు గతంలో ఈ ప్రాంతంలో పనిచేసిన రెవెన్యూ ఉద్యోగులు పట్టాలు ఇచ్చినట్లు వెలుగులోకి వచ్చింది. అయితే దీనిపై రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు.
సూళ్లూరుపేట మండలం దామరాయలోనూ ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైంది. అప్పట్లో ఈ విషయమై ప్రశ్నించిన గ్రామ రెవెన్యూ సహాయకుడిపై దాడి చేశారు. దీనిపై అప్పటి తహసీల్దార్ రవికుమార్ శ్రీహరికోట పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేసిన ఘటనలున్నాయి.
చిల్లకూరు మండలం వరగలి క్రాస్ రోడ్డు వద్ద ఉన్న సాగునీరు వెళ్లే వాగును పలువురు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు.
వెంకటగిరి పురపాలికలో చెవిరెడ్డిపల్లె చెరువు, అమ్మవారిపేట చెరువులు ఆక్రమణలకు గురయ్యారు. ఆక్రమిస్తే చర్యలునీటి వనరులు ఆక్రమణకు గురవుతున్నట్లు ఫిర్యాదులు అందుత ఎన్నాయి. దేశ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఎవరూ కూడ చెరువులను, నీటి వనరులను ఆక్రమించరాదు. ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటాం. – శ్రీధర్, డీఈఈ, జలవనరుల శాఖ

# ఆస్తులు తుంచి.. తుడాను ముంచి



తిరుపతి : తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) ఆర్థిక చిక్కుల్లో కూరుకుపోయింది. తుడా భూముల్ని తెగనమ్మి సొమ్ము చేసుకోవాలన్న గత పాలకుల దురాలోచనతో ఖజానా మొత్తం ఖాళీ అయింది. తుడా వార్షిక బడ్జెట్ రూ.15 కోట్లు. ఐదేళ్లకు ముందువరకు లేఅవుట్ల అనుమతులు, భవన నిర్మాణ రుసుములు, అద్దెలు తదితర రూపాల్లో ఏటా రూ.15 కోట్ల వరకు ఆదాయం సమకూరేది. జీతభత్యాలు, సాధారణ వ్యయాలు పోను ఏటా రూ.7–8 కోట్ల విలువైన అభివృద్ధి పనుల్ని చేపట్టేది. వైకాపా పాలనలో ఆస్తులన్నీ కరిగిపోగా నేడు దిక్కులు చూసే దుస్థితి నెలకొంది.
ః వైకాపా అధికారంలోకి రాగానే మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి తుడా పీఠాన్ని కట్టబెట్టారు. తొలుత పలు లేఅవుట్లలో ఖాళీ స్థలాల్ని విక్రయించి ఖర్చుచేయడం ఆరంభించారు. ప్రభుత్వ మద్దతు, అనుకూలురైన అధికారులు, పాలక మండలి లేకపోవడంతో తన మార్కు పాలనకు తెరతీశారు. తుడాకు అదనపు ఆస్తులు సమకూర్చడం అటుంచి ఉన్న భూముల్ని విక్రయానికి పెట్టి రూ.వందల కోట్లు స్వప్రయోజనాలే లక్ష్యంగా ఖర్చుపెట్టారు. చంద్రగిరి నియోజకవర్గంలో ఇప్పటివరకు రూ.300 కోట్లు ఖర్చుచేసినట్లు చెబుతుండగా ఇది మరింత పెరిగే అవకాశం ఉంది.

**లేఅవుట్లు విక్రయించినా రూపులేక..**

రేణిగుంట మండలం సూరప్పకశం వద్ద ఉన్న 146 ఎకరాలు లేఅవుట్‌గా మార్చారు. 548 స్థలాల్ని దశలవారీగా విక్రయించి రూ.230 కోట్లు ఆర్జించారు. ఇక్కడ రూ.50 కోట్ల విలువైన పనులు జరగ్గా.. మరో రూ.115 కోట్ల అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయి.
నగరి మండలం కీలపట్టు వద్ద పదెకరాల విస్తీర్ణంలో లేఅవుట్ వేయగా.. ఇక్కడ అభివృద్ధి పనులకు రూ.86 లక్షలు వెచ్చించగా.. మరో రూ.1.40 కోట్లు వెచ్చిస్తేగానీ తుదిరూపు రాదు. 81 స్థలాలకు 19 మాత్రమే అమ్ముడుపోయాయి.
చంద్రగిరి మండలం మామండూరు వద్ద 12 ఎకరాల లేఅవుట్‌లో 124 స్థలాల్లో 95 శాతం విక్రయాలు పూర్తయ్యాయి. ఇక్కడ రూ.8 కోట్లు రాగా అభివృద్ధి కోసం రూ.3 కోట్లు వ్యయం చేయగా.. మిగిలిన పనులు పూర్తవడానికి రూ.4 కోట్లు అవసరం.
తుడా టవర్స్ పేరుతో రూ.30 కోట్ల ఓవర్‌డ్రాఫ్ట్ పొందారు. తాజాగా రూ.50 కోట్ల రుణాన్ని సేకరించి ప్రాజెక్టు పూర్తిచేయాలని భావిస్తున్నారు. ఇలా తుడాలో రూ.150 కోట్ల పెండింగ్ పనులు పూర్తిచేయాల్సి ఉంది.

# కొండలు కరిగించేస్తున్నా కన్నెత్తి చూడం!



పాడేరు : అల్లూరి జిల్లాలో 66 మైనింగ్ లీజులున్నా వాటిలో ప్రస్తుతం 15 క్వారీలకు మాత్రమే పర్యావరణ అనుమతులున్నాయి. అనంతగిరి, గూడెంకొత్తవీధి, జి.మాడుగల, పాడేరు మండలాల పరిధిలో అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ప్రభుత్వం మారినా మైనింగ్ అక్రమార్కుల జోరు తగ్గలేదు. అనుమతుల్లేకుండానే కొండలు పిండిచేసేస్తున్నారు. గ్రావెల్, మట్టి యథేచ్ఛగా తవ్వి తరలించుకుపోతున్నారు. నాడు వైకాపా హయాంలో చెలరేగిపోయిన మైనింగ్ మాఫియానే ఇప్పుడూ హవా కొనసాగిస్తోంది. కూటమి నేతలను మచ్చిక చేసుకుని ఖనిజ సంపదను దోచుకుంటోంది. మామూళ్ల మత్తు, నేతల ఒత్తిళ్లతో మైనింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడమే లేదు. దీంతో ఉమ్మడి జిల్లాలో సహజ వనరులన్నీ కళ్లెదుటే కరిగిపోతున్నాయి.

**ఇదిగో మైనింగ్ దోపిడీ..**

సబ్బవరం మండలం గంగవరం, అమృతపురం, పైడివాడ అగ్రహారం ప్రాంతాల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జోరుగా జరుగుతున్నాయి. ఇటీవల గంగవరంలో లీజు ముగిసిన తర్వాత కూడా పొక్లెయిన్లు పెట్టి తవ్వేస్తుంటే మైన్స్ విజిలెన్స్ అధికారులు వచ్చి పట్టుకున్నారు తప్ప స్థానిక అధికారులు వాటి జోలికిపోలేదు.
ఎలమంచిలి మండలం కొక్కిరాపల్లి సమీపంలో పోలవరం కాలువ గట్టుపై రాత్రిళ్లు మట్టి తవ్వి తరలించుకుపోతున్నారు. ఈ విషయం తెలిసి జలవనరుల శాఖ అధికారులు వెళితే వారిపై అక్రమార్కులు దురుసుగా ప్రవర్తించి యంత్రాలను, ట్రాక్టర్లను తరలించుకుపోయారు.
అనకాపల్లిలోని గనుల శాఖ కార్యాలయానికి కూతవేటు దూరంలోని వేటజంగాలపాలెం క్వారీల్లో పర్యావరణ అనుమతుల్లేకుండానే మైనింగ్ చేస్తున్నారు. క్వారీల సమీపంలో తహసీల్దారు, కలెక్టర్ పేరిట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా అక్రమార్కులు పట్టించుకోవడం లేదు. పర్యావరణ అనుమతులే లేకుండా..
అనకాపల్లి జిల్లాలో 276 క్వారీలు ఉండగా వాటిలో 186 క్వారీలకు పర్యావరణ అనుమతులే లేవు. అయినా కొండలు కరిగిపోతున్నాయి. గనులశాఖలో సిబ్బంది కొరత సాకును చూపి అధికారులు మైనింగ్ ప్రాంతాలకు వెళ్లడమే మానేశారు. ప్రస్తుతం అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలకు గనులశాఖ అధికారి ఒకరే. ఈయన అటూఇటూ తిరుగుతూ ఉన్నతాధికారుల సమీక్షలకే పరిమితం అవుతున్నారు తప్ప తనిఖీలు చేసింది లేదు. నర్సీపట్నం డివిజన్ గనుల శాఖ అధికారులు విశాఖ నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. వీరి ప్రయాణానికి రోజులో నాలుగైదు గంటలు పడుతుంది.. ఇక క్షేత్ర తనిఖీలకు వెళ్లే పరిస్థితి లేదు. వారంలో రెండు మూడు రోజులు కలెక్టరేట్‌లో మీటింగ్‌లు అంటూ ఉండిపోతున్నారు. అల్లూరి జిల్లా మైనింగ్ అధికారి దీర్ఘకాలిక సెలవులో ఉండడంతో కిందిస్థాయి అధికారికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. జిల్లా విస్తీర్ణం పెద్దది కావడంతో వారు కూడా తనిఖీలు చేయడానికి అవకాశం లేకుండాపోతోంది. ఇవన్నీ మైనింగ్ అక్రమార్కులకు కలిసి వచ్చాయి. అధికారులు ఎలాగూ పట్టించుకునే అవకాశం లేదని అడ్డగోలుగా తవ్వి తరలించుకుపోతున్నారు. ఈ విషయమై అనకాపల్లి గనుల శాఖ అధికారి మజ్జి శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా 'మా కదలికల సమాచారం ముందే తెలుసుకుని కొందరు జాగ్రత్త పడుతున్నారు. నేను మీటింగుల్లో ఉన్నా క్షేత్రసిబ్బంది తనిఖీలకు వెళుతున్నారు. అక్రమ మైనింగ్‌పై ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి జరిమానాలు విధిస్తున్నాం' అని అన్నారు.

# ప్రాణాంతక రోగం.. అప్రమత్తతే కీలకం

విశాఖపట్నం: జీవనశైలిలో మార్పులు.. పాశ్చాత్య ధోరణి పెరగడం.. వ్యాయామంపై నిర్లక్ష్యం.. వెరసి ప్రాణాంతక క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయి. ఉత్తరాంధ్రలో గర్భాశయ ముఖద్వార, రొమ్ము క్యాన్సర్‌తోపాటు నోటి, ఊపిరితిత్తుల క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. వీటిని తొలి దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేయగలమని వైద్య నిపుణులు చెబుతున్నారు. అడ్డపొగ పీల్చడం, మద్యం తాగడంతో బాధితులు పెరుగుతున్నారు.
విశాఖ జిల్లాలో దాదాపు 8 క్యాన్సర్ ఆసుపత్రులున్నాయి. ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రోగులు చికిత్సకు నగరానికి వస్తున్నారు. చికిత్స వల్ల దుష్ప్రభావాలుంటాయనే అనుమానం, ఖర్చుకు భయపడి ఆసుపత్రులకు రాని బాధితుల సంఖ్య ఎక్కువేనని వైద్యులు చెబుతున్నారు. మరోవైపు జిల్లాలో క్యాన్సర్‌పై పరిశోధన, నియంత్రణకు చర్యలు చేపట్టేందుకు వీలుగా కేసుల సమాచారం అందుబాటులో లేదు. జిల్లాలో నమోదవుతున్న కేసులు, యాక్టివ్ కేసులను పర్యవేక్షించేందుకు వీలుగా రిజిస్ట్రీ ఏర్పాటుచేయాల్సిన అవసరముంది.
గ్రామీణ ప్రాంతాల్లోనే అధికం: ఆంధ్ర వైద్య కళాశాలకు చెందిన ప్రొఫెసర్లు గతంలో 173 మందిపై సర్వే చేశారు. అందుకు 2017 నుంచి 2019 మధ్యలో ఊపిరితిత్తుల క్యాన్సర్ బారిన పడి ప్రభుత్వ ఛాతీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను ఎంపిక చేసుకున్నారు.



వారిలో 120 మంది గ్రామీణ ప్రాంతాలకు చెందినవారు కాగా 142 మందికి పొగతాగే అలవాటుంది. వైద్య నిపుణుల సూచనలు: ఆరోగ్యశ్రీ ద్వారా క్యాన్సర్ చికిత్సకు రూ.కోట్లలో ఖర్చు చేస్తున్నారు. దీనికి బదులుగా తొలి దశలో గుర్తించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. – పిల్లలకు పాఠశాల దశ నుంచే పొగాకు, మద్యం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలి. – నగరంలోని కొన్ని పాఠశాలల చుట్టూ దుకాణాల్లో పొగాకు ఉత్పత్తులు, సిగరెట్లు విక్రయిస్తున్నారు. వీటికి అడ్డుకట్ట వేయాలి.
సరైన చికిత్స కీలకం: జీవనశైలిలో మార్పుల ద్వారా 30 నుంచి 40 శాతం క్యాన్సర్లు రాకుండా జాగ్రత్తపడవచ్చు. గతంలో క్యాన్సర్ బారిన పడితే శరీరంలో వ్యాధి సోకిన భాగం తొలగించాల్సి వచ్చేది. మెరుగైన సాంకేతికతతో లాప్రోస్కోపిక్, రోబోటిక్ తదితర చికిత్స విధానాలు అందుబాటులోకి వచ్చాయి. ఫలితంగా చిన్నపాటి శస్త్రచికిత్సలతో మామూలు స్థితికి తీసుకురావొచ్చు. తొమ్మిదేళ్లు దాటిన బాలికలకు గర్భాశయ క్యాన్సర్ నిరోధానికి తోడ్పడే హెచ్‌పీవీ టీకా వేయించాలి. – డా. మురళీకృష్ణ, క్యాన్సర్ వైద్య నిపుణులు

# ఆడబిడ్డలకు 'రక్షణ' కవచం

విశాఖపట్నం: బాలికల మిస్సింగ్ కేసులపై విశాఖ పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఫిర్యాదులు అందిన వెంటనే సాంకేతిక పరిజ్ఞానంతో ఆచూకీ కనిపెట్టి కుటుంబీకుల చెంతకు చేరుస్తున్నారు. గంటల వ్యవధిలో బాలికల ఆచూకీ తెలుసుకుని కేసులు పరిష్కరిస్తున్నారు. తాటిచెట్లపాలెంకు చెందిన ఓ బాలిక 58 రోజులుగా కనిపించడం లేదని ఫిర్యాదు అందింది. గత నెల 27న విశాఖ వచ్చిన మంత్రి నారా లోకేష్ దృష్టికి బాలిక తల్లి విషయం తీసుకువెళ్లింది. 'నా కూతురిని వెతికి పెట్టండి' అంటూ కన్నీరుమున్నీరైంది. వివరాలు తీసుకుని మంత్రి పోలీసులతో మాట్లాడారు. బాధితులు ఇంటికి చేరేలోపే...ఆ బాలికను తిరుపతిలో గుర్తించామంటూ పోలీసుల నుంచి ఫోన్ వచ్చింది. కేజీహెచ్‌లో వైద్య పరీక్షలు నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించడంతోపాటు, మాయమాటలతో తీసుకువెళ్లిన నిందితుడిపై నాల్గవ పట్టణ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.
తెలంగాణకు చెందిన ఓ కుటుంబం గత నెల 27న విశాఖ పర్యటనకు వచ్చింది. చరవాణి ఎక్కువగా చూస్తుందని తల్లి మందలించడంతో బాలిక (15) ఒంటరిగా బీచ్‌వైపునకు వెళ్లి కనిపించలేదు. గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో తల్లిదండ్రులు ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ తరువాత గంటల వ్యవధిలో బాలిక ఆచూకీ లభ్యమైంది.
గతంలో ఫిర్యాదులపై నిర్లక్ష్యం: 'ఏ ఆడపిల్లపై అఘాయిత్యం జరిగినా గన్



కన్నా ముందు జగన్ ఉంటాడు. అక్కచెల్లెమ్మలకు అన్యాయం జరిగితే ఊరుకోం' అంటూ వైకాపా ప్రభుత్వంలో ఊదరగొట్టారు. గత ఐదేళ్లలో విశాఖ కమిషనరేట్ పరిధిలో వందల మంది బాలికల మిస్సింగ్ కేసులు నమోదయ్యాయి. ఆచూకీ గుర్తించడానికి నెలల తరబడి తాత్సారం చేశారు. దీనికి కారణం... ప్రేమ పేరుతో, మోసపు మాటలతో బాలికలను తీసుకెళ్లిన వారిని అరెస్టు చేయకుండా, విచారణ ముందుకు సాగకుండా స్థానిక వైకాపా నాయకులు స్టేషన్లలో పంచాయితీలు నిర్వహించడమే. తమ ఆడబిడ్డల కోసం బాధితులు కాళ్లరిగేలా స్టేషన్ల చుట్టూ తిరగాల్సి వచ్చింది. నీ మిస్సింగ్ కేసులపై స్టేషన్ గడప తొక్కే బాధితుల విషయంలో నిర్లక్ష్యం వహించకూడదని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వంలో కేసులు నమోదై ఆచూకీ గుర్తించని 79 మహిళల కేసుల విచారణ 2024లో ప్రారంభించారు. అందులో 19 మందిని గుర్తించారు. ఇందుకు వివిధ రకాల సాంకేతిక పరిజ్ఞానాలను వినియోగించారు.

# మిథ్యాజ్యోతి

కర్నూలు : ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు విద్యా జ్యోతి పుస్తకం ఇప్పటి వరకు చేతికందలేదు. ముద్రణ చేపట్టకపోవడంతో ఉపాధ్యాయులు వాట్సప్‌లో చూసి బోధిస్తున్నారు. విద్యా జ్యోతి నకలు పుస్తక ప్రతి గతేడాది డిసెంబరులో జిల్లా విద్యాశాఖకు వచ్చింది. ఇప్పటి వరకు ముద్రించలేదు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా ఇప్పటికే 60 రోజులు పూర్తైనా నేటికీ స్టడీ మెటీరియల్ ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**వాట్సప్‌లో చూసి బోధన**

విద్యాజ్యోతి పుస్తకాలు ముద్రణ చేపట్టకపోవడంతో ఉపాధ్యాయుల



వాట్సప్‌లో చూసి బోధిస్తున్నారు. కొందరు సొంత నిధులు వెచ్చించి ప్రింట్లు తీసుకున్నారు. మరికొందరు పాఠశాల స్కూల్ గ్రాంట్ నిధులతో ప్రింటు తీసుకుని బోధన చేస్తున్నారు.

ప్రతి విద్యార్థికి విద్యా జ్యోతి పుస్తకం ఇవ్వాలంటే సుమారు రూ.కోటి వరకు నిధులు అవసరమని అధికారులు అంచనా వేశారు.

విద్యాశాఖలో ఆ మేర బడ్జెట్ లేకపోవడంతో పుస్తకాన్ని ఉపాధ్యాయుల వాట్సప్‌కు పంపించాము.. పాఠశాల గ్రాంటులో నిధులుంటే పుస్తకాన్ని ప్రింటు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు సూచించామని డీఈవో శామ్యూల్‌పాల్ తెలిపారు.

మార్చి 17వ తేదీ నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. నిపుణులైన ఉపాధ్యాయులు కష్టపడి విద్యా జ్యోతి పుస్తకాన్ని రూపొందించారు. పరీక్షలకు కనీసం మూడు నెలల ముందు ఇస్తే విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉండేది.

# అక్రమాల పద్మవ్యూహం

నంద్యాల : జిల్లా కేంద్రంలోని పద్మావతినగర్( లేఅవుట్)ను అభివృద్ధి చేసిన శ్రీనివాస హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యకలాపాలు దారి తప్పినట్లు.. పలు అక్రమాలు చోటుచేసుకొన్నట్లు తేలింది. ఫిర్యాదులు రావడంతో సహాయ రిజిస్ట్రార్ అశోక్‌కుమార్‌రెడ్డిని విచారించాల్సిందిగా జిల్లా సహకార అధికారి ఆదేశించారు. విచారణ చేయగా పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి.

**వీటిపై మరింత లోతుగా**

మేనేజింగ్ కమిటీలు 1997 నుంచి 2024 వరకు ప్లాట్ల కేటాయింపు, బదిలీలో నిబంధనలు పాటించలేదు. సొసైటీ కార్యాలయం 'నివర్తి భవన్'తో పాటు సంఘ అభివృద్ధి బాధ్యతలను పలు సంస్థలకు అప్పగించారు. సొసైటీ పూర్వ అధ్యక్షుడు కె.భరత్‌కుమార్ కుటుంబ సభ్యులకు ఇవన్నీ మేలు చేయడంతో పాటు సంఘానికి రూ.కోట్లలో నష్టాన్ని తెచ్చాయి. వాటన్నింటిపైనా మరోసారి సమగ్రంగా విచారణ చేయాలని అశోక్‌రెడ్డి సూచించారు.

**52 మందికి చట్టవిరుద్ధంగా**

సంఘ సభ్యుడు వి.శివనాగిరెడ్డి వంటివారు డబ్బులు చెల్లించినా ప్లాట్లు ఇవ్వలేదు. 52 మందికి చట్టవిరుద్ధం, మూడు ప్లాట్లను సంఘ ఉద్యోగుల కుటుంబసభ్యులకు కేటాయించారు. ఇలాంటి ఘటనలతో దాదాపు రూ.200 కోట్ల వరకు అక్రమాలు జరిగినట్లు తెలుస్తోంది.

**ఆక్రమణలు దాచిపెట్టారు**

16.71 సెంట్ల ఖాళీ స్థలం ఆక్రమణలో ఉందని లేఅవుట్‌లో చూపలేదు. దీన్ని వేలం వేయకపోవడంతో పాటు బోర్డు తీర్మానంతో



ఒక సభ్యుడికి కేటాయించడం, ఆయన రౌడీల నుంచి బెదిరింపులు వచ్చాయని వేరొకరి విక్రయించడం, ఆ ప్లాట్లో సంఘ మాజీ అధ్యక్షుడు పేరిట 'శశి అపార్ట్‌మెంట్' నిర్మాణం జరిగినట్లు గుర్తించారు.

**వాటాల ఒప్పందం**

సంఘానికి మూలసాగరంలోని సర్వే నంబరు 431/1, 430/1, 430/2, 431/2ఎ, 431/ఎ లలో పదెకరాల భూమి అభివృద్ధి బాధ్యతను 'తేజ కన్‌స్ట్రక్షన్స్'కు అప్పగించారు. ఈ సంస్థలో నాటి అధ్యక్షుడి కుమారుడు శశిధర్ భాగస్వామిగా ఉన్నారు. అభివృద్ధి చేసే సంస్థకు ఏకంగా 65 శాతం, సొసైటీకి 35శాతం వాటా వచ్చేలా ఒప్పందాలు చేసుకున్నారు. సొసైటీ అధ్యక్షుడి కుమారుడికి అభివృద్ధి చేసే బాధ్యత అప్పగించడం నిబంధనలకు విరుద్ధం.

**సెల్లార్‌లో దుకాణాలు నిర్మించారు**

స.హ. చట్టం ప్రకారం పురపాలక సంఘానికి దరఖాస్తు చేయగా వాటికి ఎలాంటి అనుమతులు లేవని తేలింది. రూఫ్‌టాప్‌పై ఉన్న నిర్మాణానికీ అనుమతులు లేవు. భవనాన్ని నిర్మించే పనులను రామ్‌సాయి ఎన్‌క్లేవ్‌కు అప్పగించారు. ఆభవనాన్ని నిర్మించినందుకు కేవలం 30శాతం సొసైటీకి ఇచ్చి 70శాతం విస్తీర్ణం నిర్మాణ సంస్థ తీసుకునేలా ఒప్పందం చేసుకున్నారు. ఆ నిర్మాణ సంస్థలో సంఘం మాజీ అధ్యక్షుడి భార్య భాగస్వామిగా ఉన్నారు. ఇది నిబంధనలకు విరుద్ధం. ఫిర్యాదుదారులతో పాటు సంఘ మాజీ అధ్యక్షుడు కె.భరత్‌కుమార్, కె.శశిధర్‌లకు, మాజీ కార్యదర్శి డి.ప్రద్యుమ్నరెడ్డిలకు నోటీసులు జారీ చేసి పలు వివరాలు ఆరా తీశారు.

ఎస్.సుధాకర్‌బాబు

# క్యాన్సర్ రక్కసిపై కట్టడి ఏదీ?



అనంతపురం : అనంతపురం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ క్యాన్సర్ ఆసుపత్రి ఉన్నా పూర్తిస్థాయిలో సేవలు అందుబాటులో లేకపోవటంతో బాధితులు ఇతర ప్రాంతాలకు వెళ్లి వైద్యసేవలు పొందాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంది. గతంలో పాలకులు, అధికారులు ఆసుపత్రి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించకపోవటంతో అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని రోగులు వ్యయప్రయాసలకు గురవుతున్నారు. వయసుతో సంబంధం లేకుండా ప్రాణాంతక వ్యాధి వస్తుండంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. తొలి దశలో గుర్తిస్తే వివిధ పద్ధతుల ద్వారా రోగులకు మెరుగైన చికిత్స అందించి.. నియంత్రించవచ్చని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం నోటి, గొంతు, ఛాతి, గర్భాశయం, లివర్ సంబంధిత క్యాన్సర్ ఎక్కువగా గుర్తిస్తున్నట్లు వారు వెల్లడిస్తున్నారు. అనంతపురంలోని శారదానగర్‌లో 30 పడకల సామర్థ్యంతో 2011లో ప్రభుత్వ ఆసుపత్రిని ప్రారంభించారు. ప్రస్తుతం ఓపీ, కీమోథెరపీ మాత్రమే అందుబాటులో ఉన్నాయి. రేడియోథెరపీకి సంబంధించి కోబాల్ట్ సోర్స్ గడువు ముగియటంతో సేవలను నిలిపివేశారు. ఇక్కడ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, సీనియర్ రెసిడెంట్ తోపాటు టెక్నీషియన్లు సేవలు అందిస్తున్నారు. అనంతపురంలోని సర్వజన వైద్యశాల గైనిక్ విభాగంలో ప్రివెంట్ ఆంకాలజి ఓపీని ఏర్పాటు చేశారు. ప్రతి మంగళవారం, ఓపీకి వచ్చే మహిళలకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు.

**కాగితాల్లోనే...**

ప్రభుత్వ క్యాన్సర్ ఆసుపత్రిలో మెడికల్ ఆంకాలజి, సర్జికల్ ఆంకాలజి విభాగాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వైద్యులనూ కేటాయించింది. ఇవన్నీ కాగితాల దశనే దాటలేదు. దీంతో రోగులు బెంగళూరు, హైదరాబాద్, తిరుపతి, కర్నూలు తదితర ప్రాంతాలకు వ్యయప్రయాసలకు ఓర్చి వెళుతున్నారు.

కదిరికి చెందిన ఓ మహిళకు (30) గర్భాశయ క్యాన్సర్ వచ్చింది. అనంత ప్రభుత్వ క్యాన్సర్ ఆసుపత్రిలో రేడియోథెరపీ అందుబాటులో లేకపోవటంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. నెల రోజుల పాటు ఉండాలని వైద్యులు చెప్పటంతో ప్రైవేటుగా గది అద్దెకు తీసుకుని ఆమెకు వైద్యసేవలు చేయిస్తున్నారు. ముదిగుబ్బ మండలానికి చెందిన ఒకరికి వ్యాధి సోకింది. మూడో దశకు చేరిన తరువాత గుర్తించారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఆమె భర్త అప్పు చేసి హైదరాబాద్‌లోని ఓ వైద్యశాలలో చేర్చారు. ఇప్పటికే రూ.4లక్షలకు పైగా ఖర్చు అయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ క్యాన్సర్ ఆసుపత్రిలో రోజు వారీగా ఓపీ: 75 మందికి పైగా

నెలలో కీమోథెరపీ పొందుతున్న వారు: 90

పడకల సామర్థ్యం : 30

ఉమ్మడి అనంత జిల్లాలోని వివిధ వైద్యశాలల్లో చికిత్స పొందుతున్న రోగులు: 3,300

**ఉన్నతాధికారులకు నివేదిస్తాం..**

డాక్టర్ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్, సర్వజన వైద్యశాల

కోబాల్ట్ సోర్స్ తెప్పించేందుకు రూ.1.17 కోట్లు సంబంధిత సంస్థకు చెల్లించాం. ఐపీ సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. సర్వజన వైద్యశాల నిధులతోనే క్యాన్సర్ ఆసుపత్రిని నిర్వహిస్తున్నాం. ఆసుపత్రి అభివృద్ధికి నివేదిక సిద్ధం చేసి కలెక్టర్ ద్వారా ఉన్నతాధికారులకు పంపేందుకు చర్యలు తీసుకుంటాం.

# ప్రయోగ పరీక్షల దందా



అనంతపురం : ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈనెల 5వ తేదీ నుంచి ప్రయోగ పరీక్షలు ఆరంభమవుతున్నాయి. పరీక్షల పేరిట కొన్ని కళాశాలల్లో ప్రైవేటు దందా నడుస్తోంది. ఇందుకోసం ప్రతి విద్యార్థి నుంచి రూ.800 నుంచి రూ.వెయ్యి వసూలు చేస్తున్నారు. ఆ సొమ్ము చెల్లిస్తేనే ఉత్తీర్ణులవుతారని బెదిరిస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ప్రయోగ పరీక్షల్లో కూడా జంబ్లింగ్ విధానం ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. ఆయా సబ్జెక్టు నిపుణులను పర్యవేక్షకులుగా నియమించారు. కొన్ని కార్పొరేట్, ప్రైవేటు కళాశాలల అధికారులు పర్యవేక్షకులకు ముడుపులు ఇవ్వాలని చెబుతూ విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఒకేషనల్ విద్యార్థులకు ఈనెల 5వ తేదీ నుంచి మొదటి విడత పరీక్షలు ఆరంభమవుతాయి. ఒకేషనల్ విద్యార్థులకు 3 విడతల్లో జరుగుతాయి. ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకూ నిర్వహిస్తున్నారు.

**తూతూమంత్రంగా...**

30 మార్కులకు ప్రయోగ పరీక్షలుంటాయి. అందులో రికార్డులకు 5, ప్రయోగాలకు 25 మార్కులుంటాయి. రెండింటిలో కలిపి 11 మార్కులు వస్తే ఉత్తీర్ణులవుతారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రయోగాలు నిర్వహించాలి. కొన్ని కళాశాలల్లో సీసీ కెమెరాలు కూడా లేవు. ప్రయోగ పరికరాలున్నా ఎప్పుడూ ఉపయోగించింది లేదు. పరీక్షల కోసం పరికరాల దుమ్ము దులుపుతున్నారు. చాలా కళాశాలలకు రసాయనాలు కూడా అందుబాటులో లేవు.

**వృత్తివిద్య కోర్సులకు పరికరాల కొరత**

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీసీ, ఎంపీసీతో పాటు వృత్తి విద్యా కోర్సులకు అన్నింటికీ ఇక్కడే ప్రయోగ పరీక్షలు నిర్వహించనున్నారు. సాధారణ గ్రూపులకు సంబంధించిన అన్ని పరికరాలు అందుబాటులో ఉన్నప్పటికీ వృత్తి విద్యా కోర్సులకు సరైన పరికరాలు అందుబాటులో లేవు. ఎంఎల్‌టీ గ్రూపునకు స్టాఫ్ వాచ్, స్టెతస్కోప్, రక్త గ్రూపు నిర్ధారణ కిట్‌లు, క్రియాటిన్ కిట్, ఎలక్ట్రోల్ బ్యాలెన్స్ కిట్లు అందుబాటులో లేవు. బాలికల జూనియర్ కళాశాల, రాయదుర్గం కేజీబీవీ, డి.హీరేహాళ్ జూనియర్ కళాశాల, కేజీబీవీ నుంచి విద్యార్థులు ప్రయోగ పరీక్షలకు హాజరవుతున్నారు. కొన్ని పరికరాలు లేనందున అనంతపురం నుంచి తెప్పించి ఇబ్బంది లేకుండా చేస్తామని ప్రిన్సిపల్ విజయలక్ష్మి తెలిపారు.

**విద్యార్థుల సంఖ్య పెరిగితే ఇబ్బందే**

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సొంత భవనంలో బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ వృత్తి విద్యాకోర్సులకు సంబంధించి పరికరాలు అందుబాటులో ఉండగా, సుమారు 30 రకాల కిట్లు, రసాయనాలు సమకూర్చాల్సి ఉంది. పట్టణంలోని కస్తూర్బాగాంధీ, ఆదర్శ పాఠశాల, జ్ఞానభారతి, సాయికృష్ణ, బెళుగుప్ప, బ్రహ్మసముద్రం, శెట్టూరు మండలాల నుంచి కూడా విద్యార్థులు ఇక్కడకు రావాల్సిందే. గతం కంటే ఎక్కువ మంది హాజరు కావచ్చని అధ్యాపకులు చెబుతున్నారు. విద్యార్థుల సంఖ్య పెరిగితే పరికరాలకు ఇబ్బందిపడే పరిస్థితి ఉంది.

**ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటాం**

వెంకటరమణనాయక్, ఇంటర్ పరీక్షల నిర్వహణ కన్వీనర్

ప్రయోగ పరీక్ష నిర్వహణకు పర్యవేక్షకులను కమిటీ సమక్షంలో నియమించాం. 2 ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశాం. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించాం. విద్యార్థుల నుంచి వసూలు చేసినట్లు ఫిర్యాదులు వస్తే ఆయా కళాశాలలపై చర్యలు తీసుకుంటాం.

జిల్లా: అనంతపురం

జూనియర్ కళాశాలలు: 149

ప్రయోగ పరీక్షల కేంద్రాలు: 73

మొత్తం విద్యార్థులు: 22,605

# అమ్మో.. ఘాట్ రోడ్!

ముదిగుబ్బ : ముదిగుబ్బ నుంచి కడప జిల్లా పులివెందులకు వెళ్లే మార్గంలో దొరిగల్లు అటవీ ప్రాంతం దగ్గర ఘాట్‌రోడ్డులో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఏమాత్రం అదుపు తప్పినా లోయలోకి పడి ప్రాణాలు కోల్పోవాల్సిందే. సూచికబోర్డులు లేకపోవడంతో వేగంగా వచ్చే వాహనదారులు అదుపు చేయలేక ఢీకొంటున్నారు. ఈ మార్గంలో సిమెంటు లారీలు నిత్యం ముదిగుబ్బ మీదుగా బెంగళూరుకు వెళ్తుంటాయి. అరటి లోడుతో ఐచర్, బొలెరో వాహనాలు ప్రమాదకరంగా ప్రయాణం చేస్తుంటారు. రాత్రి వేళల్లోనూ ప్రయాణిస్తూ మలుపుల్లో వాహనాన్ని అదుపు చేయలేక లోయలోకి దూసుకుపోతున్నారు. టాపుమీద ప్రయాణం చేస్తూ, వేగంగా వెళ్తూ, ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు రోడ్డు అంచుల వరకు వెళ్లినప్పుడు రక్షణ గోడలేక ప్రమాదాలు జరుగుతున్నారు. ఇందులో ఉపాధి కోసం వెళ్తూ కూలీలే ప్రాణాలు కోల్పోతున్నారు. జనవరి 31న గ్యాస్ లోడుతో పులివెందుల నుంచి ముదిగుబ్బ వైపు వస్తున్న లారీ వేగాన్ని అదుపు చేయలేక రాయిని ఢీకొంది. ఏడాది క్రితం అదే ప్రాంతంలో వేగాన్ని అదపు చేయలేక లారీ గోడను ఢీకొని డ్రైవర్‌కు గాయాలయ్యాయి.

గతేడాది ఏప్రిల్‌లో 1వ తేదీ పులివెందుల నుంచి ముదిగుబ్బకు వస్తున్న క్రేన్ ఘాట్‌రోడ్డు దిగే క్రమంలో మూడో మలుపులో తిప్పుకోలేక అదుపుతప్పి బోల్తా పడింది. క్రేన్ తిరగబడటంతో డ్రైవర్ వాహనం కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు.

**నివారణకు చర్యలు తీసుకుంటాం**

శివరాముడు, ముదిగుబ్బ టౌన్ సీఐ

ఘాట్ రోడ్డులో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. హైవే అధికారుల దృష్టికి తీసుకెళ్లి మలుపుల్లో ప్రమాదాలు నివారణకు స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించేలా చర్యలు తీసుకుంటాం.

# సాగుదారులకు సంఖ్య

నంద్యాల : అన్నదాతలకు ఆధార్ తరహాలు గుర్తింపు కార్డు ఇవ్వాలని.. ప్రతి రైతుకు 11 అంకెల విశిష్ట సంఖ్య ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. 'ఫార్మర్ రిజిస్ట్రీ' పేరుతో అన్నదాతల వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పటివరకు కర్నూలు జిల్లాలో ముగ్గురు, నంద్యాలలో ఏడుగురు రైతుల వివరాలను ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేశారు. అన్ని వివరాలు సరిపోలడంతో కర్నూలులో ఒకరు, నంద్యాల జిల్లాలో ఇద్దరు రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య వచ్చింది.

**రైతు సేవా కేంద్రాల్లో నమోదు**

రైతు సేవా కేంద్రం (ఆర్ఎస్‌కే)లో పేరు నమోదు చేసుకోవచ్చు. ఆధార్ నంబరుకు అనుసంధానించిన చరవాణి నంబరు, పట్టాదారు పాసుపుస్తకం తీసుకొని ఆర్ఎస్‌కేకు వెళ్తే సిబ్బంది ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తారు. అనంతరం రైతు చరవాణికి ఓటీపీ వస్తుంది. దీనిని సిబ్బందికి చెబితే 11 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య వస్తుంది. గ్రామంలో లేని రైతులు ఆర్ఎస్‌కే సిబ్బందిని చరవాణిలో సంప్రదించి పూర్తి వివరాలు తెలియజేస్తే విశిష్ట సంఖ్య కేటాయిస్తారు.

**అడంగల్‌లో పేరు సరిగ్గా ఉంటేనే**

ఆధార్, ఆన్‌లైన్ అడంగల్‌లో పేరు సరిగ్గా ఉంటే వెంటనే 11 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య వస్తుంది. ఆన్‌లైన్ అడంగల్‌లో, ఆధార్‌లో రైతు పేరు 80 శాతం సరిగా ఉంటే.. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తై



విశిష్ట గుర్తింపు సంఖ్య వస్తుంది. 60–80 శాతం వరకు వివరాలు సరిగా ఉంటే దీనిని పరిశీలించేందుకు వీఆర్వో లాగిన్‌కు వెళ్తుంది. 60 శాతానికంటే కంటే తక్కువగా (ఆధార్, అడంగల్‌లో) పేరు సరిపోలని పరిస్థితి ఉంటే ఆ వివరాలు తహసీల్దారు లాగిన్‌కు వెళుతుంది. వారు పరిశీలించి అంతా సరిగా ఉందని భావిస్తేనే రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య వస్తుంది.

**పథకాలు పక్కాగా అందేలా**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 887 రైతు సేవా కేంద్రాల పరిధిలో 7 లక్షల మందికిపైగా రైతులు ఉన్నారు. సుమారు 10 లక్షల హెక్టార్లకుపైగా సాగు భూములున్నాయి.

ప్రస్తుతం వ్యవసాయ రైతుల వివరాలు సేకరిస్తున్నారు. ఆ తర్వాత ఉద్యాన, మత్స్య రైతుల వివరాలు నమోదు చేయనున్నారు. భవిష్యత్తులో కౌలు రైతులు, భూమి లేని వ్యవసాయ కూలీలు, వ్యవసాయ అనుబంధ వృత్తిదారులకు దీనిని వర్తింపజేసే అవకాశముంది.

పంటల బీమా, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ పరికరాలపై రాయితీ, పంట నష్టపరిహారం తదితరాలు అర్హులైన వారికే చేరేలా ఉపయోగపడుతుంది. సాగునీటి సమస్యలు, తెగుళ్లు, ఇతర వ్యవసాయ సలహాలను అధికారుల నుంచి నేరుగా తెలుసుకోవచ్చు.

# ఇంధనం మింగారు

ఆదోని : ఆదోని పురపాలక సంఘం ప్రజారోగ్య (శానిటేషన్) విభాగంలో ఇంధన బిల్లుల చెల్లింపుల్లో అవినీతి బాగోతం వెలుగు చూసింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో పెట్రోలు బంకులకు ఆయాచితంగా లబ్ధి చేకుర్చేలా వ్యవహరించారు. బిల్లుల మంజూరు 15 రోజులు దాటితే మొత్తం ఆ బిల్లుపై రెండు శాతం కమీషన్ అదనంగా సంబంధిత పెట్రోల్ బంకులకు ఇచ్చేలా నిర్ణయించారు. డీజిల్ పోయించకున్నా.. పోయించినట్లు లెక్కలు చూపి, బంకులకు లబ్ధి చేకుర్చే విధానాన్ని తీసుకొచ్చారు. కూటమి ప్రభుత్వం రాకతో అడ్డుచెప్పడంతో అక్రమార్కులు తల పట్టుకుంటున్నారు.

**వైకాపా నేత కమీషన్ పథకం**

వైకాపా ప్రభుత్వ హయాంలో బిల్లులు సకాలంలో విడుదల కాకపోవడంతో ఇంధనం పోసేందుకు బంకులు ముందుకొచ్చేవి కావు. దీంతో ఆ పార్టీకి చెందిన ఓ ముఖ్యనాయకుడి కమీషన్ పథకం వేశారు. బిల్లులు ఆలస్యమైతే రెండు శాతం కమీషన్ చెల్లించేలా ఒప్పందం చేసుకొన్నారు. ఇందుకు 15 రోజులు గడువు విధించారు. ఈ లెక్కన రూ.3.22 లక్షలకు రెండు శాతం కమీషన్ అంటే.. రూ.6,440 అవుతుంది. ఏడాదికి రూ.78 వేలు లబ్ధి చేకురేలా చేశారు.

ప్రభుత్వం దగ్గర రెండు శాతం కమీషన్ విధానం చేర్చి బిల్లులు మంజూరు చేసేందుకు వీలుపడదు. తప్పుడు లెక్కలతో బిల్లులో నమోదు చేసేవారు. ఇందులో ప్రజారోగ్య విభాగాధికారులు కీలకంగా వ్యవహరించినట్లు సమాచారం. ఇదే అదునుగా శానిటేషన్ విభాగంలో డీజిల్ వినియోగంలో అనేక అవకతవకలకు పాల్పడినట్లు సమాచారం. దీనిపై మరింత లోతుగా విచారణ చేయిస్తే.. రూ.లక్షల్లో బిల్లులు గోల్‌మాల్ బాగోతం బయట పడుతుంది.

**నెలకు రూ.3.22 లక్షలు**

ఆదోని పట్టణంలో పురపాలక విభాగంలో ఎనిమిది ట్రాక్టర్లు, రెండు పెద్ద, రెండు చిన్న కాంపాక్టర్లు ఉన్నాయి. నిత్యం 80–90 మెట్రిక్ టన్నుల చెత్త సేకరించి.. డంపింగ్ యార్డుకు తరలిస్తారు. వీటికి డీజిల్ పోయించేందుకు పెట్రోలు బంకులతో ఒప్పందం చేసుకున్నారు. ఒక్కో ట్రాక్టరుకు నాలుగు రోజులకోసారి 40–43 లీటర్లు, ఒక్కో పెద్ద కాంపాక్టర్‌కు 21 రోజులకోసారి 250 లీటర్లు, ఒక్కో చిన్న కాంపాక్టరుకు ఎనిమిది రోజులకోసారి 140 లీటర్ల చొప్పున డీజిల్ పోయించాలి. నెల మొత్తంలో సుమారు 3,220 లీటర్ల డీజిల్ వినియోగిస్తున్నారు. నెలకు రూ.3.22 లక్షలు ఖర్చవుతుంది.

# పల్లె పండగ.. రహదారులకు మహర్దశ

పుంగనూరు : పల్లెలకు పండగొచ్చింది.. రహదారులకు మహర్దశ కల్గింది. అడుగుతీసి అడుగు వేయలేని దుస్థితి నుంచి రయ్..రయ్‌మంటూ దూసుకెళ్లేలా పల్లె దారులు రూపు దిద్దుకుంటున్నాయి. ప్రయాణికుల కష్టాలు తీరుతున్నాయి. కూటమి ప్రభుత్వం పల్లెల ముఖచిత్రం మార్చేందుకు కంకణం కట్టుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, కాలువల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో పల్లె దారులు సిమెంటు రోడ్లుగా మారుతున్నాయి. పల్లె పండగ పనుల నిర్వహణలో వి.కోట, చౌడేపల్లె, గుడిపల్లె, కుప్పం, శాంతిపురం, పలమనేరు, పాలసముద్రం, రామకుప్పం మండలాలు మొదటి వరుసలో నిలిచాయి. పనులు మంజూరైన వెంటనే పూర్తిచేయడానికి స్థానికులు ముందుకు రావడంతో వేగంగా సాగుతున్నాయి.

వైకాపా హయాంలో అధ్వానం వైకాపా హయాంలో గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లు దుస్థితికి చేరుకున్నాయి. రోడ్లు, కాలువల నిర్మాణంపై నిర్లక్ష్యం చూపగా పంచాయతీలకు వచ్చే నిధులను సైతం పక్కదారి పట్టించారు. కూటమి ప్రభుత్వం ఈ దుస్థితి రూపుమాపేందుకు జిల్లాలో గ్రామసభలు నిర్వహించి సిమెంటు రోడ్లు, మురుగునీటి కాలువలకు ప్రాధాన్యమిచ్చారు.

## నభా నటేష్.. హీటెక్కిస్తున్న గ్లామర్ ట్రీట్

టాలీవుడ్ గ్లామరస్ బ్యూటీ నభా నటేష్ తన స్టైల్ స్టేట్మెంట్‌తో మరోసారి ఫ్యాన్స్‌ను మెస్మరైజ్ చేసింది. సోషల్ మీడియాలో ఎంత యాక్టివ్‌గా ఉంటుందో, అదే స్థాయిలో తన స్టన్నింగ్ ఫోటోషూట్‌లను షేర్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. తాజాగా ఆమె పోస్ట్ చేసిన లేటెస్ట్ ఫొటోలు నెటిజన్ల మతిపోగొడుతున్నాయి. ఇందులో నభా తన బోల్డ్ లుక్స్‌తో అందర్నీ ఫిదా చేసేసింది. స్టన్నింగ్ లుక్స్‌తో ఆమె పోస్ట్ చేసిన ఈ ఫోటోషూట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది. బ్లాక్ కలర్ కెల్విన్ క్లీన్ బ్రా, లూజ్ బేజీ షర్ట్, మ్యాచింగ్ ట్రౌజర్స్‌లో నభా తన గ్లామర్‌ను మరో లెవెల్‌కు తీసుకెళ్లింది.



ఒంటి మీద కవర్ చేసుకునేలా ఒక క్యాజువల్ లుక్ ఇచ్చినప్పటికీ, తన ఎక్స్‌ప్రెషన్స్‌తో సోషల్ మీడియాలో హీటెక్కిస్తోంది. మరీ ముఖ్యంగా ఈ లుక్స్‌లో నభా మోడ్రన్ యాంగిల్‌లో కొత్తగా కనిపించడం అభిమానులకు మజానే అందిస్తోంది. ఈ ఫోటోలను షేర్ చేస్తూ, నభా "మార్చి అంటే ఫిబ్రవరి మాత్రమే, మంచి లైటింగ్ ఉంటే!" అంటూ క్యాప్షన్ జత చేసింది. ఈ క్యాప్షన్ ఆమె ఫోటోషూట్‌కు ఎంత కష్టపడ్డారో చెప్పకనే చెబుతోంది. నెటిజన్లు ఆమె లుక్స్‌పై ఫిదా అవుతూ కామెంట్స్ వర్షం కురిపిస్తున్నారు. టాలీవుడ్‌లో నభా గ్లామర్‌కు ఓ రేంజ్ ఉంది, బోల్డ్‌నెస్‌కీ, క్లాస్‌కీ మిక్స్ నువ్వే.. అంటూ కామెంట్స్ చేస్తున్నారు. సినిమాల విషయానికి వస్తే, నభా ప్రస్తుతం 'స్వయంభు' సినిమాలో నిఖిల్‌కు జోడిగా నటిస్తోంది. అలాగే అనే మరో రొమాంటిక్ డ్రామాలో నటిస్తోంది. గతంలో 'ఇస్మార్ట్ శంకర్'తో సూపర్ హిట్ అందుకున్న నభా, మళ్లీ అదే స్థాయి క్రేజ్ తెచ్చుకునే ప్రయత్నంలో ఉంది. ఇటీవలి కాలంలో నటన పరంగా మంచి ప్రాజెక్ట్స్ ఎంపిక చేసుకుంటూ, కెరీర్‌ను కొత్త దిశగా మలచుకుంటోంది.

## మహేష్ హీరోయిన్ ఇప్పుడు గూగుల్ ఇండియా బాస్

1996లో 'పాపా కెహతే హై' సినిమాలో నటించిన తర్వాత నటి మయూరి కాంగో చాలా కాలంగా బాలీవుడ్ లో కనిపించ లేదు. ఈ బ్యూటీ చివరిసారిగా 2000లో విడుదలైన తెలుగు చిత్రం 'వంశీ'లో కనిపించింది. ఈ సినిమాలో మహేష్ బాబు కథానాయకుడిగా నటించారు. వంశీలో తన ప్రత్యేక పాట ఓహో సోనియా తనకు మంచి గుర్తింపు తెచ్చింది. 1995లో 'నసీమ్' అనే హిందీ చిత్రంతో అరంగేట్రం చేసిన మయూరి 'పాపా కెహతే హై', 'హొగీ ప్యార్ కీ జీత్' వంటి చిత్రాలను మినహాయించి పెద్దగా విజయం సాధించలేదు. గ్లామర్ రంగంలో ఆశించిన సక్సెస్ దక్కకపోవడంతో మయూరి తన రూట్ మార్చింది. ఇప్పుడు గూగుల్ ఇండియాలో సీనియర్ హోదాలో ఉంది. టీవీ మూవీ రంగంలో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటూ మయూరి 2000లో బుల్లితెరపైకి ప్రవేశించి నర్గిస్, థోడా ఘుమ్ థోడి ఖుషి, డాలర్ బాబు, కిట్టి పార్టీ వంటి సీరియల్స్‌లో పనిచేసింది. అయితే



టీవీ నటిగాను ఆశించిన విజయం సాధించలేదు. సినిమాలు, సీరియల్స్‌లో విజయం సాధించకపోవడంతో,నిరాశపడింది. అటుపై మయూరి డిసెంబర్ 2003లో ఔరంగాబాద్‌లో ఎన్నారై ఆదిత్య ధిల్లాన్‌ను వివాహం చేసుకుంది. మయూరి- ఆదిత్య మొదట ఒక కామన్ స్నేహితుడి ద్వారా ఒక పార్టీలో కలుసుకున్నారు. ఈ జంటకు 2011లో ఒక కుమారుడు జన్మించాడు. తన చదువు సమయంలో మయూరి ఐఐటి కాన్పూర్‌కు ఎంపికైంది. కానీ సినిమాల్లో బిజీ కెరీర్ కారణంగా అక్కడ అడ్మిషన్ తీసుకోలేదు. మయూరి దాదాపు 16 సినిమాలు చేసింది. కానీ వాటిలో చాలా వరకు విడుదల కాలేదు. ఆమె పాపా కెహ్తే హైన్ (1996), హొగి ప్యార్ కి జీత్, బేటాబి, బాదల్, జంగ్, షికారి-కామియో, జీతెంగే హమ్ వంటి చిత్రాలలో నటించింది. మయూరి 2000లో విడుదలైన తెలుగు చిత్రం 'వంశీ'లో తన నటనతో ఆకట్టుకుంది. ఇందులో మహేష్ బాబు - నమ్రతా శిరోద్కర్ జంటగా నటించారు. వంశీ సినిమాలో నటించాక పరిశ్రమలో కనిపించలేదు. తరువాత తన భర్తతో కలిసి న్యూయార్క్‌కు వెళ్లి బారుచ్ కాలేజ్ జిక్లిన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ నుండి మార్కెటింగ్ - ఫైనాన్స్‌లో ఎంబీఏ పట్టా పొందింది. ఆమె గతంలో ఫ్రెంచ్ గ్రూప్ పబ్లిసిస్‌లో భాగమైన ప్రముఖ డిజిటల్ మీడియా ఏజెన్సీ అయిన పెర్ఫార్మిక్స్‌కు మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం, మయూరి కాంగో ఐదు సంవత్సరాలకు పైగా గూగుల్ ఇండియాలో ఇండస్ట్రీ హెడ్‌గా పనిచేస్తున్నారు.




## సంతాన ప్రాప్తిరస్తు టీజర్.. నవ్విస్తూనే ఆలోచింపజేసే కాన్సెప్ట్!




తెలుగు సినిమా సరికొత్త కాన్సెప్ట్‌లను ఎంచుకుంటూ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. తాజాగా సంతాన ప్రాప్తిరస్తు అనే చిత్రంతో ఫన్, ఫ్యామిలీ ఎమోషన్స్, కామెడీ మిక్స్ చేసి ఓ విభిన్నమైన కథను తెరపై ఆవిష్కరించనున్నారు. మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్లపై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించిన ఈ మూవీకి సంజీవ్ రెడ్డి దర్శకత్వం వహించాడు. ఇక టీజర్‌ను యానిమల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా రిలీజ్ చేయగా, ఇది ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది.

విక్రాంత్, చాందిని చౌదరి జంటగా నటిస్తున్న ఈ సినిమాలో ప్రధానంగా ఓ యువకుడి జీవితంలో ఎదురయ్యే అనూహ్యమైన సమస్యను వినోదంతో చూపించారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా జీవితాన్ని గడిపే విక్రాంత్ పెళ్లి తర్వాత కొత్త సమస్యను ఎదుర్కొంటాడు. తండ్రికాబోతున్నాననే ఆనందాన్ని పొందేలోపే, అనుకోని వైద్య సమస్యతో ఎదురైన విపత్కర పరిస్థితి కథలో కీలక మలుపు తీసుకొస్తుంది. అతని శరీరంలో 'లో స్పెర్మ్ కౌంట్' ఉండటంతో పిల్లలు కలగడం కష్టమని వైద్యులు చెబుతారు. ఇక దీనిని అధిగమించేందుకు అతను 100 రోజుల మిషన్ ప్రారంభిస్తాడు. ఈ సినిమాకు కీలకంగా నిలిచే పాత్రలు వెంకటేష్, తరుణ్ భాస్కర్, వెన్నెల కిషోర్, అభినవ్ గోమటం మరింత ఫన్ క్రియేట్ చేయనున్నట్లు తెలుస్తోంది. అలాగే జీవన్ కుమార్, శ్రీలక్ష్మి, హర్షవర్ధన్, తాగుబోతు రమేశ్, అభయ్ బెతిగంటి, కీర్తి, అనిల్ గీలా, సద్దాం తదితరులు మరికొన్ని పాత్రలలో అలరించనున్నారు. ముఖ్యంగా వెన్నెల కిషోర్ కామెడీ, అభినవ్ గోమటం, తరుణ్ భాస్కర్ టైమింగ్ డైలాగ్స్ టీజర్‌ను మరింత ఆసక్తికరంగా మార్చాయి. టీజర్‌లో చూపించిన కామెడీ సన్నివేశాలు ఆకట్టుకునేలా ఉండగా, స్టోరీ మాత్రం చాలా డిఫరెంట్‌గా కనిపిస్తోంది. కథలోని ట్విస్ట్‌లు, రొమాంటిక్ ఎలిమెంట్స్, ఎమోషనల్ ఎంగేజ్‌మెంట్ కూడా హైలైట్‌గా మారాయి. కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే హాస్యపూరిత సన్నివేశాలు సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచేశాయి. ఒక వైపు కామెడీ, మరోవైపు కుటుంబ సంబంధాలు, భార్యాభర్తల మధ్య ఉండే సమస్యలను సరదాగా పరిచయం చేయడం ఈ సినిమా ప్రత్యేకతగా మారింది.

ఇక డైలాగ్స్ కూడా ఆలోచింపజేస్తున్నాయి. దర్శకుడు సంజీవ్ రెడ్డి ఈ సినిమాను పూర్తి వినోదాత్మకంగా తెరకెక్కించారు. ABCD, ఆహా నా పెళ్లంట వంటి ఎంటర్‌టైనింగ్ వెబ్ సిరీస్‌లను రూపొందించిన ఆయన, మరోసారి తన మార్క్‌ను చూపించబోతున్నట్లు టీజర్ ద్వారా తెలుస్తోంది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఈ సినిమా ఉండబోతోందని చిత్రబృందం ధీమా వ్యక్తం చేస్తోంది. త్వరలోనే సినిమా థియేటర్లలో సందడి చేయనుంది.

## రెండేళ్ల తర్వాత ఏజెంట్ డిజిటల్ రిలీజ్..!




అక్కినేని హీరో అఖిల్ సురేందర్ రెడ్డి కాంబినేషన్ లో 2023 సమ్మర్ లో రిలీజైన సినిమా ఏజెంట్. ఈ సినిమాను ఏకె ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ లో అనీల్ సుంకర భారీ బడ్జెట్ తో నిర్మించారు. సినిమాలో మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి కూడా ఇంపార్టెంట్ రోల్ లో నటించారు. రా ఏజెంట్ గా అఖిల్ ది బెస్ట్ ఇచ్చాడు. యాక్షన్ ఎంటర్ టైనర్ గా తెరకెక్కిన అఖిల్ ఏజెంట్ సినిమా ఏప్రిల్ 28, 2023లో రిలీజైంది. సినిమాపై భారీ అంచనాలు ఉండటమే కాకుండా అఖిల్ కి మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ తర్వాత వచ్చిన సినిమాగా క్రేజ్ తెచ్చుకుంది. ఐతే ఈ సినిమా ఆడియన్స్ అంచనాలను అందుకోలేకపోయింది. రా ఏజెంట్ కథను కమర్షియల్ యాక్షన్ గా మార్చి తీశాడు డైరెక్టర్ సురేందర్ రెడ్డి అందుకే ఈ సినిమా ఆడియన్స్ కు సరిగా ఎక్కలేదు. ఏజెంట్ సినిమాలో అఖిల్ ఎంత హార్డ్ వర్క్ చేసినా సరే తగిన ఫలితాన్ని తెచ్చుకోలేకపోయాడు. ఐతే అఖిల్ ఏజెంట్ సినిమా థియేట్రికల్ రిలీజ్ అయ్యింది కానీ ఇప్పటివరకు డిజిటల్ రిలీజ్ కు నోచుకోలేదు. ఏజెంట్ ఓటీటీ రిలీజ్ కోసం అక్కినేని ఫ్యాన్స్ ఎంతో ఎగ్జైట్మెంట్ గా ఉన్నారు. ఐతే ఈ సినిమా డిజిటల్ రిలీజ్ కోసం ఫ్యాన్స్ కళ్లు కాయలు కాచేలా ఎదురుచూశారు. ఫైనల్ గా ఈ సినిమా మార్చి 14న డిజిటల్ రిలీజ్ లాక్ చేశారు. అఖిల్ ఏజెంట్ సినిమా హోలీ సందర్భంగా ఓటీటీ లోకి వచ్చేస్తుంది. ఈ సినిమాలో సాక్షి వైద్య హీరోయిన్ గా చేయగా సినిమాకు హిప్ హాప్ తమిళ మ్యూజిక్ అందించారు. ఏజెంట్ సినిమా స్టైలిష్ యాక్షన్ మూవీ కాగా థియేట్రికల్ వెర్షన్ వర్క్ అవుట్ కాలేదు మరి కనీసం డిజిటల్ రిలీజ్ తో అయినా ప్రేక్షకులను అలరిస్తుందా లేదా అన్నది చూడాలి. ఏజెంట్ సినిమా వచ్చి రెండేళ్లు అవుతుండగా అఖిల్ నెక్స్ట్ సినిమా అప్డేట్ ఏంటన్నది ఇంకా క్లారిటీ రాలేదు. ఈసారి భారీ బడ్జెట్ తో పీరియాడికల్ కథతో వస్తాడని వార్తలు వస్తున్నా కూడా వాటిల్లో ఏది వాస్తవం అన్నది తెలియాల్సి ఉంది. అఖిల్ సురేందర్ రెడ్డి కాంబినేషన్ మూవీ ఏజెంట్ డిజిటల్ రిలీజ్ తో అక్కినేని ఫ్యాన్స్ ఫుల్ ఖుషిగా ఉన్నారు. మరి ఈ సినిమా ఓటీటీ ఆడియన్స్ ని ఏమేరకు మెప్పిస్తుందా అన్నది చూడాలి.

## ఒళ్లంత తుళ్లింత రావాలిలే.. మలైకా స్కిన్నోవేషన్


ఒళ్లంత తుళ్లింత కావాలిలే.. గుండెల్లో జల్లంతా కురవాలిలే!! .. గీతాంజలిలో గిరిజ వాన పాట ఇది. ప్రస్తుతం మలైకా సన్నివేశం చూస్తుంటే ఇలానే ఉంది. అందమైన బాడీ ఫిట్ దుస్తుల్లో మలైకా కవ్వింత ఇప్పుడు చర్చగా మారింది. నిజానికి ఇలాంటి అవతారం ఇదే మొదటి సారి కాదు. ఈ కొత్త లుక్ యువతరాన్ని ఆకర్షిస్తోంది. ప్రఖ్యాత కార్పొరెట్ బ్రాండ్ ప్రచారం కోసం మలైకా కాంట్రాక్ట్ కుదుర్చుకుంది. దీనికోసం కోటి పారితోషికం అందుకుంటోందని తెలుస్తోంది. స్కిన్నోవేషన్ పేరుతో కొవ్వును కరిగించే పరికరాల సంస్థకు మలైకా ప్రచారం చేస్తోంది. ఈ సందర్భంగా ప్రచార కార్యక్రమంలో స్కిన్ టైట్ దుస్తులను ధరించి గుండెల్ని మరిగించింది. ప్రస్తుతం ఈ



ప్రమోషనల్ కార్యక్రమం నుంచి మలైకా కొత్త లుక్ అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది. 50 వయసులోను మల్లా అందచందాలు యూత్ కి మతులు చెడగొడుతున్నాయి. అదే సమయంలో ఏజ్ లెస్ బ్యూటీగా మలైకా కోట్లాది రూపాయల విలువ చేసే కాంట్రాక్టులను దక్కించుకోవడంపైనా ఆసక్తికర చర్చ సాగుతోంది. వెల్ నెస్, ఫిట్ నెస్ రంగాల్లో ఉత్పత్తులకు ప్రచారం చేయడానికి మలైకా బెస్ట్ ఆప్షన్ అనడంలో సందేహం లేదు. నిరంతరం జిమ్ యోగాతో పర్ఫెక్ట్ ఫిట్ లుక్ తో కనిపించే మలైకా ఇప్పుడు టోన్డ్ లుక్ కోసం యూత్ కి దిశా నిర్దేశనం చేస్తోంది. అయితే ఇలాంటి కార్పొరెట్ ఉత్పత్తులతో రిజల్ట్ ఎలా ఉంటుందో చెక్ చేయకుండా ఎలాంటి ప్రచారం కల్పించినా దానిపై విమర్శలు వెల్లువెత్తడం ఖాయం. మలైకా అలాంటి జాగ్రత్తలు తీసుకుంటుందని భావిద్దాం. మలైకా ఫిట్‌నెస్ దినచర్యలో యోగా, పైలేట్స్, ఎనర్జీ శిక్షణ, నృత్యం ఉంటాయి. ఇవి టోన్డ్ బాడీని కొనసాగించేందుకు, యవ్వన శక్తిని కాపాడుకోవడానికి సహాయపడతాయి. సమతుల్య ఆహారం, హైడ్రేషన్, స్వీయ సంరక్షణ ప్రాముఖ్యతను మలైకా తన అభిమానుల కోసం చెబుతుంది.

## దివ్య భారతి.. వయ్యారాల రోజా!

సౌత్ సినిమా ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంటున్న అందాల భామ దివ్య భారతి తన లేటెస్ట్ ఫోటోషూట్‌తో నెట్టింట హీట్ పెంచేస్తోంది. బ్యాచిలర్ సినిమాతో అమ్మడు ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. అయితే తాజాగా ఆమె షేర్ చేసిన ఈ స్టైలిష్ లుక్స్, ఎలిగెంట్ ఫ్యాషన్ సెన్స్ అభిమానులను కట్టిపడేస్తున్నాయి. అద్దిరిపోయే ఎక్స్‌ప్రెషన్స్, ఆహ్లాదకరమైన చిరునవ్వుతో ఈ ఫోటోలు నెటిజన్ల హృదయాలను దోచుకుంటున్నాయి. ప్రత్యేకంగా చెప్పాలంటే,



ఆమె ధరించిన మేజెంటా కలర్ లేహంగా, ఎంబ్రాయిడరీ వర్క్ ఉన్న బ్లౌజ్ ఆమె అందాన్ని మరింత మెరుగుపరిచాయి. దివ్య భారతి ఫోటోషూట్‌లో కనిపించిన ఆ గ్రేస్, ఆమె గ్లామర్, మోడలింగ్ స్కిల్స్ ఓ కొత్త ట్రెండ్ సెట్టింగ్‌గా మారాయి. ఆమె ఫ్లోరిస్ట్ స్టైల్ జ్యువెలరీ, అట్రాక్టివ్ ఇయర్ రింగ్స్ ఆమె అందాన్ని మరింత హైలైట్ చేస్తున్నాయి. వీటికి తోడు ఆమె స్మైలింగ్ ఎక్స్‌ప్రెషన్.. ఆమె ఒదిగి ఉన్న కన్ఫిడెన్స్.. అభిమానులను మైమరపింపజేస్తున్నాయి. ప్రతి ఫోజ్‌లోనూ సొగసైన ప్రెజెంటేషన్ ఉన్న ఈ ఫోటోలు కేవలం గ్లామర్ కంటే క్లాస్ లుక్‌కి పెట్టింది పేరు అనేలా మారాయి. నేడు సోషల్ మీడియాలో టాప్ ట్రెండ్స్‌లో దివ్య భారతి తాజా ఫోటోలు కనిపిస్తున్నాయి. ఆమె వయ్యారాలు, ఆకర్షణీయమైన బాడీ లాంగ్వేజ్‌తో ఈ ఫోటోషూట్ మరింత హైలైట్ అయింది. ఒక్క ఫోటోలోనే కాదు, ఫుల్ లెంగ్త్ లుక్‌లో ఆమె చూపించిన గ్రేస్ నిజంగా ప్రత్యేకం. అభిమానులు 'దివ్య భారతి అంటే అందం, స్టైల్‌కి బ్రాండ్ అంబాసిడర్' అంటూ కామెంట్స్ చేస్తున్నారు. టాలీవుడ్‌లో తన స్థానాన్ని బలపరచుకునే ప్రయత్నంలో ఉన్న ఈ బ్యూటీ త్వరలోనే మరిన్ని ఆసక్తికరమైన ప్రాజెక్టులతో అలరించనుంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536